# జన హృదయనేత

# అన్నభీమోజు ఆచారి

## Achary : A Warrior of 1969 Telangana movement



రచయిత

**తాటికొండ రమేశ్‌బాబు**






ఘన



కీ॥శే॥ అన్నభోమోజు మదనా చారి (ఆచారి) గారు
జననం: 07-05-1938, మరణం: 16-08-1979



















July 1975 at Agra



కీ॥శే॥ అన్నభీమోజు ఆచారి గారి జ్యేష్ఠ పుత్రుడు

# కీ॥శే॥ అన్నభీమోజు సత్యనారాయణాచారి

**జననం 20-9-1961, మరణం 27-6-2021**

సౌమ్యుడు, శాంతమూర్తి కీ॥శే॥ సత్యనారాయణాచారి
మంచితనానికి మారుపేరుగా, మానవతామూర్తిగా,
ఉన్నతమైన ఆదర్శాలతో, మంచి మనస్సుతో ప్రతి ఒక్కరి
మనస్సులలో సుస్థిరస్థానం ఏర్పరచుకొన్న మీకు ఘనమైన
నివాళి అర్పిస్తూ ... మీ ఆత్మకు శాంతి కలగాలని సదా
భగవంతుని ప్రార్థిస్తూ ... బాధాతప్త హృదయాలతో ...

## "అన్నభీమోజు కుటుంబం"


Bad Boy







# జన హృదయనేత
# అన్నభీమోజు ఆచారి

## Achary : A Warrior of 1969 Telangana movement




రచయిత

**తాటికొండ రమేశ్‌బాబు**

# జన హృదయనేత అన్నభీమోజు ఆచారి

(Achary : A Warrior of 1969 Telangana movement)

**ప్రథమ ముద్రణ : శ్రీ విశ్వావసు నామ సంవత్సరం - 2025**

**ప్రతులు : 1000**

**వెల రూ. 150/-**

**ప్రతులకు :**

**అన్నభీమోజు జితేంద్రాచార్య**

ఇం.నం. 1512, Tower-1,

NSL East County,

హబ్సిగూడ, హైదరాబాద్,

తెలంగాణ - 500007

సెల్ : **9535752559**

**డి.టి.పి. :**

**వి.బి. గ్రాఫిక్స్,**

నల్లకుంట, హైద్రాబాద్.

సెల్ : 9246247885

Published by:

**VB PUBLICATIONS**

Chandha Nagar, Hyd.

Ph: 040 35674844, Cell: 9246247885.

# విషయ సూచిక


| | |
|---|---|
| i. రచయిత మాట | 5 |
| ii. కృతజ్ఞతాభివందనాలు | 8 |
| iii. అక్షర చిరంజీవి – అమరజీవి ఆచారి | 11 |
| iv. జనం కోసం నిలిచిన ఆచారి | 16 |
| v. నేటి యువతరానికి ఆదర్శం ఆచారి | 20 |
| vi. శ్రీమత్ నందికొండ జగద్గురు ఆశీర్వాద శ్రీముఖం | 22 |
| vii. సమస్యలపై పోరాటం–పరిష్కారాల కోసం ఆరాటం | 24 |
| viii. తెలంగాణ తొలి ఉద్యమకారుడి గాథ | 26 |
| ix. మైలురాళ్లు సరే... పునాదిరాళ్ల మాటేంటి? | 31 |
| x. మరణం లేని యోధుడు | 34 |
| 1. ఉపక్రమణిక | 37 |
| 2. మిర్యాలగూడలో నిప్పై రగిలిన  చెకుముకి రాయి | 41 |
| 3. ఆ ఆవేశం వెనుక స్వరాష్ట్రం మీద ప్రేమ –అందుకే జైలు జీవితం | 54 |
| 4. జైల్లో రూపుదిద్దుకున్న నాయకత్వం | 59 |
| 5. మదనాచారి కుటుంబ నేపథ్యం | 63 |
| 6. కొందరికి మదనాచారి – అందరికీ ఆచారి | 78 |

7. కృష్ణారెడ్డి కుడిభుజం 86

8. కమ్యూనిస్టుల కవ్వింపులకు ఫుల్‌స్టాప్ 93

9. ఆచారికి అపురూప కానుక: 1975 98

10. కృష్ణారెడ్డి అనుకున్నదొకటి చెన్నారెడ్డి చేసిందొకటి 107

11. అన్నభీమోజు కుటుంబంలో చీకటి అధ్యాయం 127

12. మంటల్లో సీపీఎం ఆఫీస్ 149

13. అది అంతిమ యాత్రా? ప్రజల ఆగ్రహ యాత్రా? 152

14. తుపాకి లోడ్ చేసుకున్న కృష్ణారెడ్డి 157

15. ఆచారి అడుగు జాడలు 160

16. ఆచారిగారి గది 163

17. ఆచారి జీవితంలో కొన్ని మైలురాళ్లు - మరికొన్ని జ్ఞాపకాలు 166

18. ఆచారి ఏం సాధించాడు? ఏం వదిలేశాడు? 169

19. వంశ వృక్షం 173

# రచయిత మాట



**"సింహం తన గురించి తాను చెప్పుకోకపోతే గుంటనక్కలన్నీ ఏకమై కూసే కూతలే ఆ సింహం చరిత్రగా మిగిలిపోతుంది. సత్యమై నిన్ను శాశ్వతంగా చరిత్ర హీనుడిని చేస్తుంది." అది చరిత్రకు ఉండే సహజ లక్షణం.**

ఆ కోణంలో చరిత్రను నాలుగు రకాలుగా వర్గీకరించుకోవచ్చు.

1. తెలిసిన చరిత్ర.
2. తెలియని చరిత్ర.
3. తెలియకుండా పోతున్న తెలుసుకోవాల్సిన చరిత్ర.
4. అవసరం లేకపోయినా తెలుసుకుంటున్న చరిత్ర (లేదా మనమీద రుద్దబడుతున్న చరిత్ర).

అన్నభీమోజు ఆచారి జీవిత విశేషాలను గ్రంథస్థం చేయాలన్న ప్రతిపాదన నా ముందుకు వచ్చినప్పుడు నేను ఈ కోణంలోనే ఆలోచించాను. ఆచారి జీవితానుభవాలు ఆ నాలుగు కేటగిరీల్లో ఎందులోకి వస్తాయనేది బేరీజు వేసుకున్నాను. మొదటి రెండు కేటగిరీలతో ప్రజలకు సమస్య లేదు. తెలిసింది తెలుస్తుంది. తెలియంది తెలియకుండా పోతుంది, అంతే.

కానీ చివరి రెండు కేటగిరీలే చాలా చాలా ముఖ్యం. అసలు

చరిత్ర, అవసరమైన చరిత్ర ఆ రెండు కేటగిరీల్లోనే ఉంటాయి. ఆధిపత్యం, అణచివేత, మైండ్‌గేమ్, కుట్రలు, కుతంత్రాలు, రాజకీయాలు అన్నీ ఈ రెండు కేటగిరీల్లోనే ఉంటాయి. అన్ని మీడియా సంస్థలు, సోషల్ మీడియా ప్లాట్‌ఫారాలు 4 వ కేటగిరీ ప్రాతినిధ్యం వహిస్తున్న "చరిత్రకారుల" చేతుల్లో నలిగిపోతున్నాయి. మూడో కేటగిరీకి దక్కుతున్నది అతి స్వల్ప ప్రాతినిధ్యమే, లేదా శూన్యం. మూడో కేటగిరీకి అత్యంత విలువనిచ్చే జర్నలిస్టుగా ఆచారి గురించి విన్నాక నాలోని సిసలైన పాత్రికేయ న్యాయాన్ని సంతృప్తి పరచే ఒక చక్కటి అవకాశం దొరికిందనిపించింది.

ఆచారి గారి కొడుకు జితేంద్రాచారి తన తండ్రిగారి జీవిత విశేషాలను గ్రంథస్థం చేయదలచాడని, గత చాలాకాలంగా ఒక మంచి రచయిత కోసం వెతుకుతున్నాడని మిత్రుడు సింహరాజు శ్రీనివాస్ చెప్పి ఓ రోజు మీటింగ్ ఏర్పాటు చేశాడు.

మా మొదటి మీటింగ్‌లోనే నాలో ఏముందో జితేందర్‌కు అర్థమైంది. ఆచారిలో ఏముందో, ఆయన ఎంత లోతైన మనిషో నాకర్థమైంది. వెంటనే పుస్తక రచనకు పూనుకోవడం జరిగింది.

ఈ పుస్తక రచనలో నాకంటూ కొన్ని పరిమితులున్నాయి. ఆచారి గురించి ఏమీ తెలియని నేను బాగా తెలిసినట్టుగా చెప్పాల్సి రావడం ఈ రచనలోని కాఠిన్యం. అందుకోసం జితేందర్ మీదనే నేను పూర్తిగా ఆధారపడ్డాను. తండ్రి గురించి వీలైనంత ఎక్కువ సమాచారం, ఎక్కువ విషయాలు ఆయన తెలుసుకొని నాకు ఎప్పటికప్పుడు అందించాడు. ఆయనకు తెలిసింది చెప్పాడు. నేను అడిగింది తెలుసుకొని చెప్పాడు. తండ్రి క్యారెక్టర్‌ను అర్థం చేసుకొని, అన్నభీమోజు వంశకీర్తిని చాటేందుకు జితేంద్రాచారి చేసిన ప్రయత్నం ఆదర్శవంతం. ఆయన పట్టుదల అభినందనీయం. లోతుల్లోకి వెళ్తున్నకొద్దీ ఆచారి జీవితంలోని కొన్ని

ఘట్టాలు అసలు నమ్మశక్యం కానివిగా కనిపిస్తాయి. అంతటి సాహసిని మనం సినిమాల్లో, నవలల్లో తప్ప నిజ జీవితంలో చూసి ఎరుగం. అయితే రచనా సౌలభ్య కోసం, కథా గమనంలో భాగంగా పాఠకుల ఆసక్తిని పెంచడం కోసం అతి తక్కువ సందర్భాల్లో కాస్త స్వేచ్ఛగా వ్యవహరించడం జరిగింది. ఒకటి, రెండు సందర్భాల్లో తేదీలు, సంవత్సరాలను పుస్తక రచనకు అనుకూలంగా తీసుకోవడం జరిగింది.

దేశంలోని ధనవంతులు, పెత్తందార్లు నిర్దేశించిన చరిత్రనే ప్రజలంతా చదువుకోవాల్సి రావడం ఈ దేశ సౌభాగ్యానికి, శ్రేయస్సుకు మంచిది కాదనేది నా దృఢమైన అభిప్రాయం. ఈ దేశానికి మూల స్తంభాల పాత్ర పోషించిన వారిలో బహుజనులే ఎక్కువ. కానీ వారికి దక్కాల్సిన ప్రాధాన్యం మాత్రం దక్కడం లేదు. ఈ దృష్టితో గనక ఆ వర్గాలు ఆలోచించడం మొదలు పెడితే ఇంకెందరో "ఆచార్యుల" అద్భుత గాథలు స్ఫూర్తిమంతమైన శాశ్వత దృశ్యాలుగా చరిత్ర కెక్కుతాయి.

**మా తండ్రిగారైన**
**కీ.శే. తాటికొండ సుదర్శనం గారిని**
**స్మరించుకుంటూ...**

**రచయిత**
**తాటికొండ రమేశ్‌బాబు**
**నల్లకుంట, హైదరాబాద్**
**9032003022**

# కృతజ్ఞతాభివందనాలు



మా నాన్న గురించి నాకు తెలియదు. ఆయనతో నాకు ఎలాంటి అనుభూతులు లేవు. అన్నీ మాకు మా అమ్మే. కానీ నాన్న గురించి తెలిసినకొద్దీ, తెలుసుకుంటున్నకొద్దీ ఆయన వంటి పాత్రలను సజీవంగా ఉంచాలన్న సంకల్పం బలపడసాగింది. అన్నభీమోజు వంశ నామంతో ముడిపడిన మా అమ్మ మా తండ్రి గురించి ఉన్నది ఉన్నట్టుగా చెప్పి మాకు అనేక అంశాల్లో అవగాహన కల్పించింది. కాబట్టి ఆచారి అనే పాత్రలో బ్లాక్ షేడ్స్ కన్నా పాజిటివ్ యాంగిల్స్ ఎంతో అట్రాక్ట్ చేశాయి. ఎదిగొస్తున్న తరానికి ఆచారి లాంటి సాహసికుల చరిత్ర కచ్చితంగా స్ఫూర్తి దాయకమేనని అనిపించించింది. అదే విషయాన్ని ఈ పుస్తక రచయిత రమేశ్‌బాబుగారితో చర్చిస్తే ఆయన ఇచ్చిన ప్రోత్సాహం వెయ్యేనుగుల ఆత్మబలాన్నిచ్చింది. ఆయనకు ఈ బాధ్యతలు అప్పగిస్తే కచ్చితంగా పుస్తకానికి న్యాయం చేస్తాడన్న నమ్మకం కలిగింది. అయితే పుస్తక రచనలో ఆలస్యం అయినా క్వాలిటీ పరంగా రాజీ పడలేదు. దానివల్ల పుస్తకం నాణ్యత పెరిగిందనే చెప్పాలి.

పుస్తకం రియాలిటీని కోల్పోకుండా, ఎవరి మనోభావాలూ దెబ్బ తినకుండా, అతి స్వల్ప కల్పనతో చదివింపజేసేలా రాసినందుకు రమేశ్‌బాబుగారికి కృతజ్ఞతలు.

ఒక మంచి రచయితను పరిచయం చేసినందుకు మిత్రుడు సింహరాజు శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు. ఈ పుస్తకం ఆమూలాగ్రం చదివి అమూల్యమైన అభిప్రాయాలు అందజేసిన పెద్దలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు.

పుస్తకాన్ని డిటిపి చేసి, అర్థవంతమైన, ఆకట్టుకునే కవర్ పేజీ, బ్యాక్ పేజీల డిజైనింగ్‌లతో వన్నె తెచ్చిన వి.బి. పబ్లికేషన్స్ వలబోజు భాస్కరాచారి గార్కి ప్రత్యేక ధన్యవాదాలు.

## మా నాన్న గురించి రెండు మాటలు

మదనాచారి అలియాస్ ఆచారి 1961 లోనే ఆర్మీకి సెలెక్ట్ అయి ఆరు నెలల కఠిన శిక్షణ పొంది, కొన్ని అనుకోని కారణాల చేత ఆర్మీలో చేరకుండా కుటుంబ వ్యాపారంలోకి నెట్టబడి, ఆ తర్వాత ఆర్ఎస్ఎస్ భావజాలానికి ఆకర్షితుడై అందులో జాయిన్ అయి అప్పటి మిర్యాలగూడ తాలూకాలో ఆ సంస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తి.

తొలిదశ తెలంగాణ ఉద్యమానికి ఆకర్షితుడై తెలంగాణ విముక్తి కోసం 1969 తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని 9 నెలల కఠిన కారాగార శిక్ష అనుభవించాడు. బయటికి వచ్చిన తర్వాత, అధికారం రాజకీయ చైతన్యం ఉంటేనే బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయవచ్చు అనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీలో చేరి అనతి కాలంలోనే (1972)బడుగు బలహీన వర్గాల మరియు మైనారిటీల తాలూకా ప్రెసిడెంట్ గా ఎన్నికై పలు కార్మిక సంఘాలను స్థాపించి వారి హక్కులు కాపాడేందుకు కృషి చేశారు.

ఆ తర్వాత 1975 లో మిర్యాలగూడ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకొని రాజకీయాలకు, ప్రజాసేవకు కొత్త నిర్వచనం చెప్పారు. ఎక్కడైనా ప్రజలకు అన్యాయం జరిగిందని తెలిస్తే, మరు క్షణమే వాలిపోయి వారి పక్షాన పోరాడిన ధీశాలి. 1978 అసెంబ్లీ ఎన్నికల్లో మిర్యాలగూడ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం త్రుటిలో చేజారిన నిరాశ చెందకుండా, తన సమయాన్ని వ్యక్తిగత అవసరాల కోసమో, కుటుంబం కోసమో గాక అశేష పీడిత ప్రజానీకం కోసం అర్పించిన వ్యక్తి. భవిష్యత్ రాజకీయ వేత్తలకు స్ఫూర్తిగా నిలిచి, మిర్యాలగూడ లోనే కాక నల్లగొండ జిల్లా రాజకీయాలను ప్రభావితం చేశాడు. స్నేహం కోసం 1979 ఆగస్టు 16న ప్రాణాలను అర్పించి, వేలాదిమంది హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి స్వర్గీయ అన్నభీమోజు మదనాచారి అలియాస్ ఆచారి.

**ఇట్లు**

**అన్నభీమోజు జితేంద్రాచార్య,**

**హైదరాబాద్.**

# అక్షర చిరంజీవి - అమరజీవి ఆచారి

ఆచార్య టి. గౌరీశంకర్



ఈ సమాజంలో పరుల కోసం ప్రాణాలు విడిచే త్యాగమూర్తులు, ప్రజల కోసం నిస్వార్థంగా పాటుపడే నాయకులు, అధికారాన్ని తృణ ప్రాయంగా భావించే స్థితప్రజ్ఞులు, ఇచ్చిన మాట మీద నిలబడి, ఉచ్చులో చిక్కుకొని ప్రాణాల మీదికే తెచ్చుకొని అమరులై చీకటి కోణంలోనే ఉండి పోయిన వారెందరో ఉన్నారు. అయితే వారంతా వెలుగులోకి రాకపోవడానికి అడ్డుకునే శక్తులు అనేకం కావచ్చు. కొన్ని గిట్టని వాళ్ళు తొక్కి పెట్టడం, ఇంకొన్ని ఎటువంటి ఆనవాళ్ళు, ఆధారాలు కనిపించకుండా కాలగర్భంలో కలిసిపోవడం, మరికొన్ని మనకెందుకులే అన్న ఉదాసీనభావం కావచ్చు, కానీ అటువంటి వ్యక్తుల జీవితాలు, ఆ జీవితాలలోని అద్భుతాలు, ఉత్థాన పతనాలు, జయాపజయాలు, చీకటి వెలుగులు, సాహసోపేతాలు, వ్యక్తిత్వపు కాంతులు, బలిదానాలు వంటివి వెలుగులోకి రాకపోవడం ఒక వెలితి మాత్రమే కాదు, క్షమించరాని నేరం కూడా అవుతుంది.

అటువంటి మహనీయుల జీవితాలు అక్షరీకరించడం వల్ల ఆ అక్షరాలు కూడా తాము పునీతమైనట్లు భావించి, గర్వంగా తలెత్తుకొని నిలబడతాయి. వారిని చరిత్ర పుటల్లో శాశ్వతంగా నిలబెడతాయి.

అంతేకాదు మానవ సమాజ నిర్మాణంలో కీలకమైన పాత్రను పోషిస్తాయి. రానున్న తరాలకు స్ఫూర్తిదాయకమై, ఆదర్శప్రాయమవుతాయి. అనేక జీవితాలను ప్రభావితం చేస్తాయి. వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయి. విశాల దృక్పథానికి దారితీస్తాయి. వీరి జీవిత చరిత్రలు కేవలం వారిని సమాజానికి పరిచయం చేయడం కోసమే కాదు, సమాజ నిర్మాణంలో వారి భాగస్వామ్యాన్ని శాశ్వతంగా నమోదు చేయడమవుతుంది. అటువంటి ఒక గొప్ప ప్రయత్నమే ఈ 'జన హృదయనేత అన్నభీమోజు ఆచారి' అన్న ఈ గ్రంథం.

మనిషి తన కోసం తాను బతకడంలో గొప్పేమీ లేదు. ఇతరుల కోసం బతకడం గొప్ప అంటాం, అనుకుంటాం. ఇటువంటి వారి జీవిత చరిత్రలు మనకు చాలానే కనిపిస్తాయి. వాటిని మనం గౌరవిస్తాం, గుండెలకు హత్తుకుంటాం. కానీ తాను బతుకుతూ, ఇతరులను బతికిస్తూ, వారి కోసం బలిదానం కావడాన్ని ఏమంటాం? అంత బలమైన, పదునైన, శక్తివంతమైన మాట మన భాషలో లేదేమోననిపిస్తుంది. కానీ, ఇటువంటి వారి జీవిత చరిత్రలు ఇదిగో, ఇలా అప్పుడప్పుడు, అక్కడక్కడ ఒకటో, అరో కనిపిస్తే కళ్ళు చెమ్మగిల్లుతాయి, ఒళ్ళు గగుర్పొడుస్తుంది.

కులాధిపత్యం అనే పైత్యం కమ్ముకుపోయి, కళ్ళు మూసుకు పోయి కుళ్ళిపోతున్న ఈ సమాజ నైజానికి బలైపోయిన వ్యక్తి గాథ ఇది. అధికార దాహంతో నమ్మిన వాళ్లకే ద్రోహం తలపెట్టే కుహనా రాజకీయ రంగమనే చదరంగంలో పావులా నేలకొరిగిన వీర యోధుని మరణోదంతమిది. పార్టీల మనుగడ కోసం విచక్షణారహితంగా మనుషుల్ని అమానుషంగా నరికి చంపే విష సంస్కృతి ప్రబలిన అమానవీయ ప్రపంచానికి బలైపోయిన త్యాగశీలి కథ ఇది. ఇటువంటి

చారిత్రక పురుషుల చరిత్రలు సమాధి చేయబడుతుంటే అటువంటి సమాధుల గోడల్ని బద్దలు కొట్టుకొని బయటకు వచ్చిన ఒక జీవిత చరిత్ర ఇది.

జన హృదయ నేతగా పేరు బడసి అన్నభీమోజు 'ఆచారి' గా గుర్తింపబడి, కీర్తిని పొందిన మదనాచారి జీవితంలోని అనేక ఘట్టాలు ఆయనను ఒక మహోన్నత శిఖరంలా నిలబెడతాయి. ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు, పంచ పాండవుల లాగా ఐదుగురు అన్నదమ్ములు ఆదర్శానికి ప్రతీక వీరి జీవితం. తెలంగాణ తొలి దశ ఉద్యమంలో ముందు వరుసలో నిలిచి పోరుబాట పట్టి, చివరికి జైలు ఊచలు లెక్కపెట్టి, కృంగిపోకుండా, ఉత్తుంగ తరంగంలా ఎగసిపడిన వైనం వీరిది. తాను ఎదుగుతూనే, తన చుట్టూ ఉన్నవారు ఎదగడానికి చేయూత నిచ్చిన మానవతా మూర్తి, నైతిక విలువలను పాటిస్తూ, అన్యాయాన్ని ఎదిరించడంలో ధర్మాగ్రహం ప్రకటించిన ధీరుడు. అణగారిన వర్గాలకు అండగా నిలిచిన ఉక్కు కొండ.

మదనాచారి కుటుంబ నేపథ్యం సంప్రదాయపు విలువలతో కూడుకున్నది. శ్రమ శక్తిని నమ్ముకొని వ్యాపార వాణిజ్య రంగాలలో ఎదిగినది. చాలా పెద్ద కుటుంబం. అన్నదమ్ములందరూ కలిసికట్టుగా జీవించేవారు. వారిలో ఈ కథా నాయకుడు మదనాచారి జీవితం సాహసోపేతమైనది. మిర్యాలగూడలో వివిధ కుల సంఘాలు జరుపుతున్న నిరాహార దీక్షలో పోలీసుల జులుంను ప్రతిఘటించిన చర్యతో వీరి వీరచరిత్ర మొదలవుతుంది. తత్ఫలితంగా అనుభవించిన జైలు జీవితం వీరిని ఒక ప్రజల మనిషిగా తీర్చిదిద్దింది. మిలిటరీలో ఉద్యోగం రావడం, దాన్ని కాదనుకోవడం ప్రజలకు మేలు అయ్యింది. క్రమశిక్షణ,

సమయపాలనా వంటి లక్షణాలతో పాటు సామాజిక సేవా తత్పరత కూడా వీరిలోని ప్రధాన గుణం. ఓవర్టేక్ చేసిన లారీ డ్రైవర్ పొగరు అణచడం, బల్వీందర్ సింగ్ వంటి ఉన్నతాధికారి నుంచి మెప్పు పొందడం, తుపాకీ లైసెన్స్ పొందడం, కాంగ్రెస్ రాజకీయ నాయకునిగా పేరుపొందిన కృష్ణారెడ్డికి దగ్గర కావడం, గర్ల్స్ హై స్కూల్ కోసం స్థలం సంపాదించడంలో చూపిన సాహసం, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియామక పత్రం అందుకున్న క్షణంలో కొడుకు పుట్టాడన్న వార్త తెలిసినప్పటి ఆయన భావోద్వేగాలు, ఆసుపత్రిలోని డాక్టర్ నిర్లక్ష్యం పట్ల ఆయన ప్రదర్శించిన ఆవేశం, ఆసుపత్రిని గాడిన పెట్టిన వైనం ఇవన్నీ ఆయన వ్యక్తిత్వాన్ని, మనస్తత్వాన్ని, విశాల దృక్పథాన్ని తెలియజేస్తాయి. రైతులకు మార్కెట్ యార్డులో వసతులు కల్పించడం, అక్కడి లోపాలను సరిదిద్దడం, రోడ్లు వేయించడం వంటివి చెప్పుకో దగినవి. ఆ మాటకు వస్తే అసలు మిర్యాలగూడ అభివృద్ధికి మూలాధాతువు వీరే. ఇంతటి మహోన్నత వ్యక్తి ప్రజల మనిషిగా సిక్కులకు స్థలాన్ని కేటాయించడమే గాక, తమ కులదైవమైన వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయ నిర్మాణంలో ముందు నిలిచి తన ఆధ్యాత్మిక ప్రవృత్తిని చాటుకున్నారు.

ఇక 1979 ఆగస్టు 16వ తేదీ ఆయన జీవిత చరిత్రలోనే చివరి పుట అన్నది ఎవరికీ తెలీదు. అది ఒక కురుక్షేత్ర రణరంగం, తనను ఆశ్రయించిన వ్యక్తికి అండగా నిలిచి, ప్రతిపక్షం వారి కరకు కసాయి కత్తులకు, కొడవళ్లకు, గొడ్డళ్లకు దారుణంగా, నిష్కారణంగా, ప్రాణాలొడ్డిన వీరోచిత యోధుడు మదనాచారి అనబడే అన్నభీమోజు ఆచారి. అమర జీవుడు.

ఇతనిని చరిత్ర పుటలలో చిరంజీవిగా నిలిపిన ఈ పుస్తక రచయిత

శ్రీ తాటికొండ రమేశ్‌బాబు గారిని నేను బహుధా ప్రశంసిస్తున్నాను. అద్భుతమైన రచనాశైలి, భాషా పటిమ పుస్తకాన్ని ఆసాంతం ఆసక్తికరంగా చదివించేలా ఉన్నాయి. ముఖ్యంగా ఆచారి కుమారుడు శ్రీ జితేంద్రాచారి అభినందనీయులు. తండ్రిని అక్షరాలలో చిరంజీవిగా నిలిపిన ధన్యుడు.

**ఆచార్య త్రిమూర్తుల గౌరీ శంకర్**
**సభాపతి**
**విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం,**
**మాజీ రిజిస్ట్రార్**
**తెలుగు యూనివర్సిటీ, హైద్రాబాద్.**

# జనం కోసం నిలిచిన ఆచారి

**– జూలూరి గౌరీ శంకర్**



ఊరు నిర్మాణం చేతివృత్తుల వారి చేతుల నుంచే జరిగింది. చేతివృత్తుల వారు లేకుండా గ్రామ, పట్టణ నిర్మాణాలను చూడలేము. అంటే దేశ నిర్మాణమే చేతివృత్తుల చమట చుక్కలతో జరిగింది. ఆ నిర్మాణ కౌశల్యమే ఊరు, పట్టణాల పునాదులైంది. వృత్తి కులాల వాళ్లే ఆది ఇంజనీర్లు. ఆ కోవకు చెందిన విశ్వకర్మలే నాగరికతకు దారులు వేశారు. వడ్రంగి చేతుల నుంచి రూపుదాల్చిందే నాగలి. అదే నాగరికతకు బీజం వేసింది.

విశ్వకర్మ కులం నుంచి వచ్చిన అన్నభీమోజు మదనాచారి రేఖా మాత్రపు చరిత్రను చదువుతుంటే వృత్తి కులాలు చేసిన నిర్మాణాలు, ఆనాటి ఉమ్మడి కుటుంబాలలో ఉన్న ఐకమత్యం, అన్నదమ్ముల మధ్య అనుబంధాలు, అక్కాచెల్లెళ్ల బంధాలు, ఇంటికి పెద్దగా కుటుంబాన్ని నిర్వహించడానికి వాళ్లు తీసుకున్న శ్రమ కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. ఇంటి నిర్మాణానికి ముగ్గులు పోసి, గడపను పెట్టిన వృత్తి కులం నుంచి వచ్చిన మదనాచారి వూరి నిర్మాణంతో పాటు ఊరికి కాపలాదారునిగా నిలిచి ప్రజల పక్షంగా పనిచేయటం ఈ పుస్తకం తెలియజేస్తుంది. తెలంగాణలో 1960, 70 దశకంలో జీవించిన వారందరూ ఆనాటి 1969 తొలి దశ స్వరాష్ట్ర ఉద్యమంలో ఏదో ఒక రూపంలో పాత్రధారులై ఉంటారు. ఆ కాలంలో అన్నభీమోజు ఆచారి తొలిదశ తెలంగాణ

ఉద్యమంలో దూకి వీరోచితంగా నిలిచాడు. ఖమ్మం జిల్లా పాల్వంచలో రగిలిన ఉద్యమ నిప్పును మిర్యాలగూడలో రాజేసిన ముఖ్యులలో ఆచారి ఒకరు. ఇదే విషయాన్ని ఈ పుస్తకం ప్రస్తావించింది.

ఆచారిని చూస్తే ఆరు అడుగుల భీమసేనునిలా ఉంటాడు. ఆయన రూపాన్ని చూస్తే సినీ నటుడు ఎస్. వి. రంగారావు లాగా కనిపిస్తాడు. రూపం పరంగా ఉండటం మాత్రమే కాదు ప్రజల తరపున నిలిచి తొడగొట్టి, మీసం మెలేసి కలబడ్డాడు. 69 ఉద్యమంలో తొమ్మిది నెలలు జైలు జీవితం కూడా గడిపాడు. జైలు జీవితం నుంచి బయటకు వచ్చాక ఆయన సమయాన్నంతా ప్రజల కోసం పని చేయడానికే కేటాయించారు. ప్రజల కోసం పనిచేసిన తీరు ఆయనను ఎమ్మెల్యేగా పోటీ చేసే దశకు తీసుకువచ్చింది. కింది కులాల నుంచి వచ్చిన వ్యక్తి అట్టడుగు వర్గాల కోసం నిలిచి ఎమ్మెల్యేగా సీటు పొందే దాకా ఎదగటం ఆచారిలోని నాయకున్ని మనకు చూపుతుంది. మిర్యాలగూడ ఎమ్మెల్యే సీటు ఆయన దాకా వచ్చి చివరి నిమిషంలో వేరే వాళ్లకు ఇవ్వటం జరిగింది. ఇది రివాజు గానే జరుగుతూ వస్తుంది. కింది కులాల వారికి నోటి దాకా వచ్చిన దాన్ని అందకుండా పోవడం ఆశ్చర్యమేమీ కాదు. త్యాగం చేసే లక్షణం ఆచారిలో ఉంది. అందుకే అధిష్టానం చెబితే విన్నాడు. ఈయనకు త్యాగం చేసే లక్షణం ఎంతగా ఉన్నాయంటే తోటి స్నేహితుని ఆదుకోబోయి తానే ప్రాణాలిచ్చాడు.

ఆచారి దేశభక్తుడు. పుట్టిన నేల మీద ప్రేమతో మిలిటరీలో చేరి శిక్షణ పొందాడు. సాటి మనుషులను ప్రేమించే తత్వం తనలో బలంగా ఉండటంతో అనతి కాలంలోనే మిర్యాలగూడలో అనేక కార్మిక సంఘాలకు నాయకుడు అయ్యాడు. మిర్యాలగూడకు మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన తిప్పన కృష్ణారెడ్డికి ఆచారి ఎంతో అండగా నిలిచారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రైతాంగానికి అండగా నిలిచాడు. మిర్యాలగూడా అభివృద్ధిలో తన వంతు పాత్రను నిర్వహించాడు. ఇప్పుడు ఎదిగిన మిర్యాలగూడ పట్టణ నిర్మాణం వెనుక అన్నభీమోజు ఆచారి, ఆయన కుటుంబం కృషి ఉంది. ఈ విషయాలు ఈ తరానికి అంతగా తెలియవు. కింది కులాల నుంచి వచ్చిన వాళ్ళ చరిత్రను ఎవరు చెప్తారు? వాళ్ళ జీవన రేఖలను రాబోయే తరానికి ఎవరు అందిస్తారు? ఆచారి నిజాయితీ, ధైర్యం, త్యాగనిరతి మాజీ జెడ్పి చైర్మన్ సి.డి. రవికుమార్ తండ్రి సి.డి. నాయుడికి తెలుసు. ఈ విషయాన్ని ఇప్పటి నాయకులకు తెలిసినా బయటకు చెప్పరు. అందుకో కారణం ఇది వర్గ కుల సమాజం. అన్నభీమోజు ఆచారి చరిత్రను చెప్పే క్రమంలో కుల ఆధిపత్యం గురించి మాట్లాడితే కొందరికి ఇష్టం ఉండకపోవచ్చును. కానీ అదే నిజం.

ప్రజల పక్షం నిలిచిన అన్నభీమోజు ఆచారిపై ఒక పుస్తకం తీసుకురావడం వల్ల మాత్రమే రాబోయే తరాలకు ఆయన చరిత్ర తెలుస్తుంది. మిర్యాలగూడకు చెందిన ఆనాటి తరం నాయకుడిని ఈతరం ముందుకు ఆయన కుమారుడు అన్నభీమోజు జితేంద్రాచార్య నే తీసుకురావడం అభినందించదగింది. నిజానికి ఇలాంటి వ్యక్తుల చరిత్రలను స్థానిక యోధుల గాథలను పౌర సమాజంలో పనిచేస్తున్న వారే బాధ్యతగా బయటకు తేవాలి.

మన మూల వాసుల చరిత్రను మనం విస్మరిస్తే చరిత్రకు చాలా అన్యాయం చేసిన వాళ్ళం అవుతాం.

మన చరిత్రను మనమే రాయాలి, భద్రపరచుకోవాలి. అదే మన ప్రాంత సాహిత్య సాంస్కృతిక సంపదగా మిగులుతుంది. మనల్ని పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులెంత గొప్పవారు. మన ప్రాంతం కోసం పనిచేసిన ప్రజా నాయకులు కూడా అంతే గొప్పవారు.

ఇలాంటి త్యాగధనుల చరిత్రను మన తరాలకు చెప్పే బాధ్యతను తరగతిగదే తీసుకోవాలి. కుల మతాలకు అతీతంగా ప్రజల కోసం పనిచేసిన, ఈ ప్రాంత నాయకుల చరిత్రలను చెప్పటం తరగతి బోధకుల బాధ్యతగా భావిస్తాను. ఈ పుస్తకం చదవండి... చర్చించండి... ఈ తరానికి అందించండి.

**జూలూరి గౌరీ శంకర్**

**తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ సభ్యులు.**

**తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్**

# నేటి యువతరానికి ఆదర్శం ఆచారి



అన్నభీమోజు మదనాచారి నాకు ఎంతో ఆత్మీయులు అత్యంత ఆప్తులు ఆయన నేపథ్యాన్ని జీవితంలోని ముఖ్య ఘట్టాలను రచయిత రమేష్ బాబు చాలా చక్కగా కళ్ళకు కట్టినట్టుగా ఈ పుస్తకంలో ఆవిష్కరించారు.

యవ్వన దశలోనే సైన్యంలో చేరి దేశసేవ చేయాలనుకున్నారు కానీ కుటుంబ సభ్యుల తీవ్ర వ్యతిరేకతతో ఆ ప్రయత్నం మానుకున్నారు. ఆ తరువాత ఆర్ఎస్ఎస్ భావజాలానికి ఆకర్షతుడై అందులో చేరి ఆ సంస్థను బలోపేతం చేయడం కొరకు కీలకమైన పాత్రను పోషించిన వ్యక్తి.

ఆచారికి ధర్మం మీద న్యాయం మీద చాలా నమ్మకం ఉండేది. సామాన్య ప్రజానీకంతో వారి సమస్యలను పరిష్కరించడంలో కూడా న్యాయమైన ధర్మమైన మార్గాన్నే ఎన్నుకొనేవారు. అందుకే ఆయన సామాన్య ప్రజల్లో అమితమైన ఆదరణ పొందారు.

ఏ ఉద్యమకారుడి జీవితంలో అయినా పోలీసు కేసులు, జైళ్ళు, కోర్టు కేసులు, అండర్ గ్రౌండ్ జీవితం మొదలైనవి అన్నీ మామూలే. ఆచారికి కూడా ఇవి తప్పలేదు. ఇందుకోసం చాలా డబ్బు ఖర్చు చేయాల్సి వచ్చింది. చాలా సార్లు ఆచారి గారు తన సొంత డబ్బును, తన కుటుంబ డబ్బును పెద్దమొత్తంలో ఖర్చు చేయాల్సి వచ్చింది.

తెలంగాణ ఉద్యమంలో మిర్యాలగూడ ప్రాంతంలో బడుగు బలహీన వర్గాలలో అన్ని రకాల అసోసియేషన్లను ఏర్పాటు చేసి వాటికి

నాయకత్వం వహిస్తూ, తెలంగాణ ఉద్యమాన్ని ఆచారి గారు ఉధృతం చేశారు. ఈ క్రమంలోనే ఒకసారి మిర్యాలగూడలో పోలీస్ ఫైరింగ్ కూడా జరిగింది.

ఆచారి ఉమ్మడి కుటుంబంలో ఏ ఒక్కరికి సమస్య వచ్చినా అది మొత్తం కుటుంబ సమస్యగా భావించేవారు. అందువల్ల ఎంతటి జటిలమైన సమస్య అయినా ఉమ్మడి కుటుంబం బలం ముందు అవి చాలా చిన్నవి అయిపోయేవి.

నీలాయిగూడెం మాజీ సర్పంచ్ అయిన రామ్ రెడ్డి ఆచారితో పరిచయం పెంచుకొని స్నేహంగా ఉండేవాడు. నీలాయిగూడెం గ్రామంలో భూ పంచాయతీ ఉండేది దాన్ని తనకు అనుకూలంగా మలుచుకోవడానికి ఆచారి గారితో స్నేహం పెంచుకున్నారు. ఆగస్టు 16, 1979 సాయంత్రం రాంరెడ్డి ఆచారి గారు రత్నయ్య ఎస్టేట్ నుండి బయటకు వస్తుండగా దుండగులు రామ్ రెడ్డిని హత్య చేయాలనే ఉద్దేశంతో ఉన్నారు. కాకతాళీయంగా ఆచారి కూడా రామిరెడ్డి తో పాటు ఉండడం వలన ఇద్దరినీ హత్య చేశారు.

అనుకోని రీతిలో ఒక ధ్రువతార రాలిపోయింది...

ఆచారిది స్వార్థం లేని జీవితం అడుగు బడుగు వర్గాల కోసమే ఆయన తన జీవితాన్ని అర్పించారు. ఆయన స్వయంగా వెనుకబడిన వర్గాల కేటగిరీకి చెందినవారు. ఈనాటి యువకులు అంతా ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని అణగారిన వర్గాల కోసం పనిచేయాలని, సమాజంలో రోజురోజుకూ బలహీన పడుతున్న విలువలను పునరుద్ధరించాలని, సమ సమాజం వైపు ఈ సమాజాన్ని తీసుకువెళ్లడంలో ఆచారి గారి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని కృషి చేయాలని ఆకాంక్షిస్తూ ..

**సిడి రవికుమార్**

**మిర్యాలగూడ**

|| Aum Namo Vishwakarmane ||
|| Sri Kaalika Kamatteshwara Prasannaha ||
Sri Math Jagadguru Kaalahasthyacharya Paramparaagatha Srimath Gayathree Peetha
His Holiness Srimath Nandhikonda Gayathree Peettadhipathi

**JAGADGURU SRI SRIKANTHENDHRA SWAAMULA VAARU**

**Srimattam Samsthaanam**

Jagadguru Sannidhanam, Sri Mattam No. 2-121, Qudbullapur (V), Abdullapurmet (M), Ranga Reddy Dist., Telangana - 501505, Mobile : 9440690373.

శ్రీవారి సమ్ముఖం నుండి.
శ్రీముఖం విడుదల.

తేది 16-8-2024
శుక్రవారం.
శ్రావణ శు|| ఏకాదశి.

శ్రీమత్ నందికొండ జగద్గురు ఆశీర్వాద శ్రీముఖం.

**SREE MUKHAM**

మొదటగా మఠ శిష్యవర్యులు "తాటికొండ రమేష్ బాబు" గారు అన్వేషిగా వీరి వృత్తి యోగం చాలా భావాత్మకమైనది. కొన్ని జీవితాలతో కొన్ని సంఘటనలు సమయ సందర్భాలు కాకతాళీయంగా ఎదురౌతుంటాయి. కొన్ని సంఘటనలు బయట పడక కాలగర్భంలో కలసి పోతుంటాయి. అట్లాంటి కాలగర్భ జ్ఞానాలలో మూలకు పడి ఉన్న చారిత్రాత్మక స్వర్ణ పుంజములను ఏరి రచయిత తన మనో మూసలో కరిగించి పోసిన "పోత" నే ఈ నవల.

చారిత్రాత్మకంగా చూస్తే అన్నభీమోజు మదనాచార్యులు వెలుగుచూడక వెలికి తీయక పోతే కాల గర్భంలో కలిసి పోతుండె. నిజానికి ఉద్యమాలకు పురిటి గడ్డలు కొన్నున్నాయి. వాటిలో మొదటిది నల్లగొండ జిల్లా (పాతది) ఆ గడ్డమీది గాలి, నీరు అక్కడి పరిస్థితులతో ప్రతి మనిషిని సామాజికంగా పదును పెట్టి పంపుతుంది. అట్లాగా గడ్డమీద పురుడు పోసుకున్న జీవి మన అన్నభీమోజు మదనాచార్యులు గారు.

ఈ నవల పరిశీలించిన తరువాత "ఆచారి" జీవితంలో ప్రత్యేక జీవిత కోణాలు వాటిని సమయానుసారంగా, సందర్భోచితంగా, ఎదురీదవటం చాల గమనార్హం. వీటిని వాటిని చాలా భావాత్మకంగా రాయటం రచయిత చమత్కారం. తెలంగాణాలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడి ఊపిరి వదిలిన ఉద్యమకారుల జీవితం అడుగున పడకూడదని మా భావన.

ఇట్లాంటి చారిత్రాత్మక, సత్య భావ రసాత్మక నవలలు చదవటం వలన జీవితంలో ఓపిక ఎంతో అవసరం అనేది అర్థమౌతది. నవల అనేది సమాజానికి స్ఫూర్తి నియ్యాలె. అన్నభీమోజు మదనాచార్యుల చరిత్ర సమాజానికి ఒక మంచి స్ఫూర్తి దాయకం.

ఈ నవల రచనా సందర్భంగా అన్నభీమోజు మదనాచార్యుల కుటుంబ సభ్యులను మరియు రచయితైన మఠ శిష్యవర్యులు.



# శ్రీశ్రీశ్రీ శ్రీకాంతేంద్ర గురుస్వాములు
## గాయత్రీ పీఠం, నందికొండ.

తాటికొండ రమేష్ బాబు గారిని శ్రీమత్ నందికొండ జగద్గురు పీఠ అధిష్టాన దేవతలైన శ్రీమద్విరాట్ విశ్వకర్మ పరబ్రహ్మ, మరియు జగద్గురు పీఠ ప్రత్యక్ష వాసిని శ్రీ మత్ కాళికా కమఠేశ్వర స్వాముల మంగళాశాసనములు తెలుపుతూ మహదాశీర్వాద శ్రీముఖం పంపనైనది.

స్వామత పీఠం నుండి
తేది: 16-8-2024
శ్రావణ శు॥ ఏకాదశి, శుక్రవారం.
మూలా నక్షత్రము.

ఇట్లు.
జగద్గురు
శ్రీ శ్రీకాంతేంద్ర
గురుస్వాములు
16/8/24

# సమస్యలపై పోరాటం - పరిష్కారాల కోసం ఆరాటం



సమాజాన్ని పట్టి పీడిస్తున్న అనేక సమస్యలకు ఆచరణ యోగ్యమైన పరిష్కారాలు సూచించేవారిలో బహుజనులే అత్యధికులు. బహుజనేతర వర్గంనుంచి చాలామంది నాయక గణం ఉన్నప్పటికీ అత్యధిక జనం ఆమోదించే నాయకత్వం బహు స్వల్పమనే చెప్పాలి. బహుజన వర్గాల్లోంచి వచ్చిన సంస్కర్తలే ఈ సమాజ గమనం మీద తమదైన ముద్ర వేశారు. వారు నిర్దేశించిన సమాజ సూత్రాలే నేటికీ మార్గదర్శకాలవుతున్నాయి. అయితే ఇంత గొప్ప మేధా సంపత్తి ఉన్న బహుజనవర్గాల కు అనేక ఆటంకాలు ఎదురవుతుండడం ఓ చర్చనీయాంశం. దేశంలో అనేక చట్టాలు బహుజనుల రక్షణ కోసమే ఉన్నా... ఆ చట్టాలను, వాటి ప్రయోజనాలను ఈ అగ్రవర్ణ నాయక గణం వారికి చెందనీయడం లేదు.

ప్రబలమైన శక్తులుగా ఆవిర్భవించిన అగ్రవర్ణం బహుజన నాయకత్వాన్ని ఎదగనీయకుండా సర్వ శక్తులూ ఒడ్డుతోంది. పార్టీల సిద్ధాంతాలు ఏవి ఉన్నా, ఎలా ఉన్నా రాజకీయ, సామాజిక ప్రయోజనాల విషయంలో వారంత ఒక్కటిగానే వ్యవహరిస్తున్నారు. అదే విషయం ఆచారి రాజకీయ చరిత్రలో కూడా స్పష్టంగా కనిపిస్తుంది.

బహుజన వర్గాల అభ్యున్నతి కోసం వారి ప్రయోజనాల కోసం అదే బహుజన వర్గీయులు చేసే పోరాటాలను చాలా తెలివిగా ఈ ఉన్నత

వర్గాలు అణచివేస్తున్నాయి.

సీపీఎం, కాంగ్రెస్ పార్టీల కుట్రలు, వారి కుట్రలకు వైశ్య సామాజిక వర్గం తెరచాటుగా వంత పాడటం... అసలైన సామాజిక కుట్ర కోణాన్ని ఆవిష్కరిస్తున్నాయి. **"జన హృదయనేత"**గా నిలిచిన ఆచారి దూరదృష్టిని, సామాజిక చిత్తశుద్ధిని నేటి తరానికి అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇక్కడ మరో విషయం కూడా చెప్పుకోవాలి. సమాజ సంస్కర్తలుగా ఆవిర్భవించి విజయవంతం అయినవారిలో బహుజనుల నుంచి ఉన్నా... అందులో చాలా మంది ''ఆచార్యు''లే కావడం గమనార్హం. విశ్వబ్రాహ్మణులు ఎప్పుడూ తమ వర్గ ప్రయోజనాల కోసం పని చేయలేదు. యావత్ సమాజ చక్రానికే వారు ఇరుసులుగా మారారు.

దేశ స్వాతంత్ర్య పోరాటంలో గానీ, తెలంగాణ పోరాటంలో గానీ, విప్లవ పంథాలో సాగి అమరులైన వారిలో గానీ బహుజనుల పాత్రను, అందునా ఆచార్యుల పాత్రను విస్మరించలేం. కానీ విచిత్రంగా వారి చిరునామా లేకుండా చేసే కుట్రలు మాత్రం పాలక ప్రభుత్వాల పాలసీల్లో అడుగడుగునా కనిపిస్తున్నాయి.

నాయకుడి మీద నమ్మకం ఉంటే ప్రజలు ఆయన వెంట ఎందాకైనా సాగుతారు అనేందుకు ఆచారి నాయకత్వమే ఓ ఉదాహరణ. ఆచారి అలియాస్ మదనాచారి **"జన హృదయనేత"** అనడంలో ఎలాంటి సందేహము అక్కర్లేదు.

**ఎ. పద్మాచారి**

చైర్మన్,

తెలంగాణ ఉద్యోగుల సంఘం,

అడ్వకేట్, సుప్రీంకోర్టు

# తెలంగాణ తొలి ఉద్యమకారుడి గాథ



మనం ఉద్యమించి ప్రత్యేకంగా సాధించుకొన్న తెలంగాణాలో గత వంద, వంద ఇరవై ఏళ్ళ చరిత్రను ఒక్క సారి వెనక్కి తిరిగి పునః పరిశీలిస్తే ఎన్నో సామాజిక ఉద్యమ చరిత్రలు దాగి ఉన్నాయి. 1920 నుండి 1948 పోలీస్ చర్యతో సహా దాదాపుగా 1956 వరకు సాగిన తెలంగాణ నిజాం విముక్త సాయుధ రైతాంగ పోరాటం, కమ్యూనిస్టుల పోరాటం, సమాంతరంగా సాగిన జాతీయ స్వాతంత్రోద్యమ పోరాటం, 1969 నాటి తెలంగాణా తొలి ఉద్యమం, తదుపరి వరుసగా వచ్చిన నక్సల్స్, రైతు ఉద్యమ పోరాటాలు, 1972 నాటి జై ఆంధ్రా ఉద్యమం (తెలంగాణాకి వ్యతిరేకంగా), కరువు కాటకాలు, 2000-2014 వరకు కొనసాగిన తెలంగాణా మలిదశ ఉద్యమం వంటి దశలు ఉన్నాయి. ఇవన్నీ సమగ్ర సామాజిక సాహిత్య చరిత్రలుగా తెలుగు భారతీయ సాహిత్యంలో రికార్డ్ కావల్సి యున్నవి.

అంతేకాక కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అగ్గికి ఆజ్యం పోసినట్లుగా, సుదీర్ఘ ప్రత్యేక తెలంగాణా ఉద్యమాన్ని పక్కనబెట్టి, 2000 సంవత్సరంలో ఉత్తరాఖండ్, జార్కండ్, ఛత్తీస్ గఢ్ వంటి ప్రత్యేక రాష్ట్రాలను ఏర్పాటు చేయడం వల్ల తిరిగి మలి తెలంగాణా దశ ఉద్యమ వ్యాప్తికి, ఊపుకు బీజాలు రాజకీయంగా గట్టిగా పడ్డాయి. అప్పటికీ ఉమ్మడి బిజెపి రాష్ట్ర పార్టీ కూడా ఆమోదించిన కాకినాడ తీర్మానం ప్రత్యేక

తెలంగాణా ఏర్పాటుకై మరింతగా ఊపు నిచ్చింది.

మరోవైపు పోలీసులు, తీవ్రవాద యువత మధ్యన తెలంగాణ ప్రాంతం అట్టుడికి పోయింది. నిరుద్యోగ యువత గాయపడింది. తెలంగాణ ఉద్యమ చైతన్యం బలోపేతం చేయడానికి సబ్బండ వర్ణాలు బలిదానాలు చేయాల్సి వచ్చింది. ఈ సత్యాల ఆవిష్కరణతోనే తెలంగాణ వాద రచనలు రావాల్సిన అవసరం ఉంది.

జాతీయ స్వాతంత్ర్య ఉద్యమానికి ముందు జరిగిన నిజాం విముక్తి, సాయుధ రైతాంగ పోరాటాలపై ఎంతో సాహిత్యం వివిధ ప్రక్రియల్లో వచ్చింది. ఉద్యమ నేపథ్యంలో ఉద్యమ స్వరూపాలు, కథ, నవలా, వ్యాసాలు, జీవిత చరిత్రలు, ఆత్మకథలు, స్వీయ చరిత్రలు వంటివి పుస్తకాల రూపంలో వచ్చింది. 1969 నాటి తొలి తెలంగాణ ఉద్యమం ఓ దశాబ్దం వరకు కొనసాగింది. ఈ ఉద్యమం మీద రావాల్సినంతగా సాహిత్యం వెలుగులోకి రాలేదు. ఎందుకంటే అప్పటి ఉద్యమానికి నాయకత్వం వహించిన డా.మర్రి చెన్నారెడ్డి, మేల్కొటే, మదన్ మోహన్, మల్లికార్జున గౌడ్, మేర్నేని సత్యనారాయణరావు, జి.వెంకటస్వామి, ఉద్యోగ సంఘాల నాయకులు ఆమోస్ వంటి పెద్దలు తెలంగాణ ప్రజా సమితిని ఏర్పాటు చేసి పోరాడారు.

1971లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో పదకొండింటిలో పది పార్లమెంట్ సీట్లను పొందారు. అయినా ఈ ఉద్యమం నీరు కారడానికి ప్రధాన కారణం పదవుల ఆశపై అప్పటి కొంతమంది నాయకులు కుట్ర చేసి అధికార కాంగ్రెస్‌లోకి ఫిరాయించి వెళ్ళిపోవడమే. ప్రత్యేక తెలంగాణా ఏర్పాటు ఆశయాన్ని నీరు కార్చేలా వ్యవహరించడమే.

ఇంతటి వివరాల్ని నెమరు వేసుకోవడానికి కారణం సీనియర్ జర్నలిస్ట్ తాటికొండ రమేష్ బాబు రాసిన జనహృదయ నేత అన్నభీమోజు

ఆచారి అనే పుస్తకమే. ఆచారి జీవిత చరిత్రను లిఖించడానికి గల కారణాలను రచయిత స్పష్టంగా తమ అభిప్రాయంలో వివరించారు. రచయిత మలి విడత ఉద్యమాన్ని చవిజూచాడు. జర్నలిజం, సామాజిక, రచనా వ్యాసాంగాల్లో అపార అనుభవం ఉండడం వల్ల ఈ పుస్తకం రాయడానికి రమేష్ బాబు ముందుకు వచ్చాడు.

1969 నాటి తెలంగాణా ఉద్యమంతో ముడిపడి ఉన్న అన్నభీమోజు కుటుంబ చరిత్ర, ఉద్యమంలో అన్నదమ్ముల పాత్రతో పాటుగా, వారి వ్యాపారాలు, అప్పటి పరిస్థితులు, రాజకీయాలు అనగా దాదాపు ఓ యాభై ఏళ్ళు వెనకటి చరిత్రాంశాలు కూడా ఇందులో రికార్డయి కనిపిస్తాయి.

తాటికొండ రమేష్ బాబు గారిది సొంత ఊరు ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంథనికి సమీపంలోని కమాన్ పూర్. సీనియర్ జర్నలిస్ట్. ప్రింట్, ఎలక్ట్రానిక్స్ మీడియాలో రమారమి గత రెండున్నర దశాబ్దాల నుండి పని చేస్తున్న అపార అనుభవం ఉంది. వార్తాంశాలు, ప్రత్యేక కథనాలే కాక, కథలు, వ్యాసాలు రాయడంలో చేయి తిరిగిన పాళీ వారిది.

ఈ దేశానికి మూలస్తంభాలుగా పాత్రను పోషించిన వారిలో బహుజనులే ఎక్కువ. కానీ వారికి దక్కాల్సిన ప్రాధాన్యత కోసమే, ఈ బృహత్తర లక్ష్యసాధనలో భాగంగానే తాను ఈ స్ఫూర్తిని సమాజానికి కల్గించడానికే ఈ రచన చేసినట్లుగా రచయిత చెప్పుకోవడం సముచితం, అభినందనీయం.

ఇహ పుస్తకంలోకి వెడితే రచయిత సులభమైన వచన శైలిలో రాశాడు. వ్యావహారిక భాషను వినియోగించాడు. అక్కడక్కడ ఆంగ్ల పదాలున్నా పుస్తకం రచన ఆద్యంతం ఆసక్తి కల్గిస్తుంది. పాఠకుడిని రచనాశైలి ఆకట్టుకుంటుంది.

అన్నభీమోజు మదనాచారి జీవితం కాకతాళీయం కాదని, ఆత్మస్థైర్య చిహ్నంగా, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా చూడాల్సి ఉంటుందని నిర్వచిస్తాడు. అమరుల జాబితాలో చేరిన మదనాచారి హీరోయిజం ఉమ్మడి నల్లగొండ జిల్లా నల్లసరమని, ఇటువంటి మహనీయులకు కాల చరిత్రే తగిన గుర్తింపు ఇస్తుందన్న ఆత్మ విశ్వాసాన్ని రచయిత ప్రకటిస్తాడు.

అన్నభీమోజు కుటుంబం మొక్కగా ఉన్న టిపిఎస్‌ను పోషించిన కృతజ్ఞతకు సరైన గిఫ్ట్ దక్కకుండా చెన్నారెడ్డి హ్యాండ్ ఇచ్చిన అంశం పాఠకులను విస్మయపరుస్తుంది.

ఆచారి హత్య పట్ల ప్రజల్లో ప్రతీకార, ఆగ్రహావేశాలతో విషాద యాత్ర విప్లవ యాత్రగా మారడం, యావత్ తెలంగాణ జనసముద్రం కదలి వచ్చినట్లుగా మారిందని, ఆచారి గారు సంపాదించుకొన్న వెలలేని ప్రజాభిమాన ఆస్తులని, బలమైన బహుజన నేతగా ఆచారి స్థానం ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయిందని చెప్పేలా రచయిత గగుర్పాటు కలిగేలా సన్నివేశాలను రూపకల్పన చేసి రాస్తాడు.

రచయిత తాటికొండ రమేష్ బాబు సమర్థుడు, రిసోర్స్ పర్సన్స్ గా ఉండి పుస్తకానికి సహకారం అందించిన ఆచారి కొడుకులు హితేందర్, జితేందర్‌లు అభినందనీయులు. ఉద్యమ నేతగా ఆచారి గారి నాయకత్వ పటిమ అపూర్వం. ఈ పుస్తకం తెలంగాణ తొలి, మలి ఉద్యమాలకు మార్గదర్శనంగా, తెలంగాణా ఉద్యమాలను రాసే సాటి, ఇతర రచయితలకు ఒక స్ఫూర్తిగా నిలిచి పోతుందని నేను విశ్వసిస్తున్నాను. కరీంనగర్‌కు చెందిన అప్పటి ఉద్యమకారుడు వావిలాల భూపతిరెడ్డి గారు మరెంతో మంది తొలి తెలంగాణా ఉద్యమ దశలను వివరిస్తూ రచనలు

చేశారు. మా స్థానీయ మిత్రుడు, సీనియర్ జర్నలిస్ట్ కూర సంతోష్ ద్వారా నా అభిప్రాయం ప్రకటించే అవకాశం రావడం సముచితంగా, ఆనందంగా ఉంది. వీరందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ... గట్టి విత్తులతో ఈ పుస్తకం రాసిన రచయిత తాటికొండ రమేష్ బాబుకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉందని ఆశిస్తున్నాను.

**కృతజ్ఞతలతో**

**సంకేపల్లి నాగేంద్రశర్మ**

సీనియర్ జర్నలిస్ట్,

హిస్టోరియన్, రచయిత

కరీంనగర్

**సెల్: 8074826371**

# మైలురాళ్లు సరే..
# పునాదిరాళ్ల మాటేంటి?



చరిత్ర వర్తమానానికి పునాది. భవిష్యత్తుకు నాంది. చరిత్ర సాపేక్షమైంది. అందుకే చరిత్రను అధ్యయనం చేయడం, తెలుసుకోవడం చాలా అవసరం. చరిత్ర తెలుసుకుంటే ఎన్నో లాభాలు ఉన్నాయి. చరిత్ర వల్ల మన మూలాలు తెలుస్తాయి. దీనిద్వారా వర్తమానం, భవిష్యత్తులో ఎలా మసలుకోవాలో తెలుస్తుంది. చరిత్ర వల్ల జీవన పరిణామ క్రమం తెలుస్తుంది.

తెలంగాణ ఉద్యమం ప్రపంచ చరిత్రలో ఒక మహోజ్వల ఘట్టం. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఎందరో మహానుభావులు తమ ప్రాణాలు త్యాగం చేశారు. అయితే తెలంగాణ ఏర్పడి 10 ఏళ్లు గడిచినా వీరి గురించి సరైన అధ్యయనం జరగలేదని చెప్పాలి. ముఖ్యంగా బడుగు బలహీనవర్గాల నుంచి ఆత్మార్పణం చేసుకున్న వారి చరిత్ర బయటకు రాలేదు. చాలా మందికి, ముఖ్యంగా నేటి తరానికి మలిదశ ఉద్యమం గురించే తెలుసు. కానీ ఈ మలి దశ ఉద్యమానికి పునాది తొలిదశ ఉద్యమం. అందులో ప్రత్యేక తెలంగాణ గురించి కలలు కన్న ఎందరో యోధులు అసువులు బాశారు. వీరిలో కొందరి గురించే తెలుసు. చరిత్ర పుటల్లో ఎందరో మహానుభావులు ఉన్నారు. వారిలో ఒకరు అన్నభీమోజు మదనాచారి. ఈయన గురించి నేటి తరానికే కాదు... తెలంగాణ ఉద్యమకారులకు తెలిసింది తక్కువేనని చెప్పక తప్పదు. అయితే నాకు

అత్యంత ఆప్తుడు, సీనియర్ జర్నలిస్ట్ తాటికొండ రమేశ్ బాబు... అన్నభీమోజు మదనాచారి అలియాస్ ఆచారి చరిత్రను అక్షరీకరించడం చాలా సంతోషంగా ఉంది. తెలంగాణ ఉద్యమంలో మదనాచారి కీలక పాత్ర పోషించాడు. ఆయన నేపథ్యాన్ని, జీవితంలోని ముఖ్య ఘట్టాలను, ఉద్యమ ప్రవేశాన్ని, రచయిత రమేశ్ బాబు చాలా చక్కగా, కళ్లకు కట్టినట్టుగా ఆవిష్కరించాడు. 1961లోనే ఆర్మీకి సెలక్ట్ అయినా ఆయన తెలంగాణ ఉద్యమంలో ఎలా చేరాడో వివరించాడు. (నిజానికి ఇప్పటికీ సైన్యంలో తెలంగాణ పాత్ర చాలా స్వల్పం. 1961లో ఆర్మీకి సెలక్ట్ కావడం చాలా గొప్ప విషయం). ప్రజాసేవకు కొత్త నిర్వచనం ఇచ్చి, నేటి తరపు రాజకీయనేతలకు ఆదర్శనీయం, మార్గదర్శకుడు అన్నభీమోజు మదనాచారి చిరస్మరణీయుడు. ఆయన గురించి భావితరాలకు చెప్పాలన్న ఉద్దేశంతో ఈ పుస్తకం రాసినందుకు రచయిత రమేశ్ బాబుకు అభినందనలు. ఈయనను స్ఫూర్తిగా తీసుకొని మరికొందరు ముందుకు వచ్చి మనకు తెలియని తెలంగాణ యోధుల చరిత్రను గ్రంథస్తం చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఇది చాలా అవసరం కూడా.

ఇక్కడ రమేశ్ బాబు గురించి కొన్ని మాటలు చెప్పాలి. సాధారణంగా రాజకీయ వార్తలు రాసే సబ్ ఎడిటర్లకు నవలలు, ఫీచర్స్ రాయరాదనే అపవాదు ఉంది. కానీ రచయిత రమేశ్ బాబు అలా కాదు. సాధారణ రాజకీయవార్తలతో పాటు ఫీచర్స్ అద్భుతంగా రాయగలడు. సులభమైన శైలిలో తాను చెప్పదలుచుకున్న విషయాన్ని అద్భుతంగా వివరించగలడు. అందుకు... ఈ పుస్తకమే నిదర్శనం. పుస్తక రచనలో చాలా మంది గ్రాంథిక పదాలను వాడుతారు. ఎందుకంటే తాము పండితులమని చాటుకోవడానికి. కానీ రమేశ్ బాబు అలా కాదు. తన పాండిత్య ప్రదర్శన కంటే విషయానికి, ముఖ్యంగా మదనాచారి జీవిత చరిత్రకే ప్రాధాన్యం ఇచ్చాడు. నిజానికి కష్టంగా రాయడం సులభం.

వాడుక భాషలో సాధారణ పదాలతో రాయడం చాలా కష్టం. ఈ పనిని చాలా అవలీలగా పూర్తి చేశాడు రమేశ్ బాబు. మదనాచారి జీవితాన్ని చాలా అద్భుతంగా రచించాడు. ఆవిష్కరించాడు అన్నా అతిశయోక్తి ఉండదేమో. వాడుక భాషలో, సులభ శైలిలో ఆయనను నేటి తరం రచయితలు అనుసరిస్తే చదువరుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందని నా అభిప్రాయం.

రమేశ్ బాబు కలం చాలా పదునైనది. అది సూటిగా ప్రశ్నిస్తుంది. నిజాన్ని నిగ్గు తేలుస్తుంది. న్యాయం కోసం ఎంతటి వారినైనా ధిక్కరించే స్వభావం, మొండితనం రమేశ్ బాబుది. కొన్నిసార్లు ఆయన స్వభావం జీవితంలో ఇబ్బందులు తెచ్చి పెట్టి ఉండవచ్చు. కానీ జీవితంలో ఆటుపోట్లకు ఎదురీదాడు. సుఖాలతో పాటు కష్టాలను చిరునవ్వుతో స్వీకరించాడు. దేనికీ తొణకలేదు, బెనక లేదు. స్థితప్రజ్ఞుడిగా నిలబడ్డాడు. మరుగునపడ్డ మహాయోధుడిని పరిచయం చేస్తున్నందుకు మరొక్కసారి రమేశ్ బాబుకు అభినందనలు. ఆయన కలం నుంచి ఇలాంటి మరిన్ని రచనలు, గ్రంథాలు, నవలలు రాయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

**సహచర ఉద్యమకారుడు రమేశ్ బాబుకు**

**ఉద్యమాభినందనలతో**

**కూర సంతోష్**

MA, MCom, MCJ, LLM, MSc (Psychology)

**సీనియర్ జర్నలిస్ట్, హైదరాబాద్.**

సెల్ : **8686883188**

# మరణం లేని యోధుడు

**"తన కోసం జీవిస్తే బతికున్నా చనిపోయినట్టే లెక్క.. సమాజం కోసం జీవిస్తే చనిపోయినా బతికున్నట్టే లెక్క.." – డాక్టర్ బిఆర్ అంబేద్కర్**



ఇతిహాసపు చీకటి కోణం అట్టడుగున పడి కన్పించని కథలన్నీ కావాలిప్పుడు, దాచేస్తే దాగని సత్యం అంటాడు శ్రీశ్రీ.

చరిత్ర మరుగున అనేక పునాది రాళ్లు పునాదుల్లోనే మిగిలిపోయాయి. తెలంగాణ పోరు తొలి దశ ఉద్యమంలో వీరోచిత పోరు సాగించిన వీరుల జాడ కొత్త తరానికి తెలియకుండా పోయింది. తుపాకులకు ఎదురొడ్డి నిలబడి, తగిలిన తూటాలను కాటాలుగా పీకిపారేసిన తోట రాములెందరో.. పంటి బిగువున బాధను భరిస్తూ వాటిని కళ్లల్లో కూడా కనబడకుండా ఉబికివచ్చే కన్నీరును దిగమింగిన యోధుని గాథ గ్రంథస్తం చేసిన తాటికొండ రమేష్ బాబు అభినందనీయుడు. మలిదశ ఉద్యమం, ఆ తర్వాత రాజభోగాలు అనుభవించిన వారిగురించి పక్కనబెడితే 69వ దశకం నాటి వీరులను భవిష్యత్ తరాలకు పరిచయం చేయకపోతే చరిత్ర క్షమించదు. భవంతుల అడుగుల్లో పడివున్న పునాది రాళ్ల సాహసాన్ని కొత్త తరానికి పట్టి చూపించే సాహసాన్ని రచయిత కళ్లకు కట్టినట్టు చూపించాడు. నిజంగానే ఈ కాలపు యోధుడు అన్నభీమోజు ఆచారి పోరాట పటిమను, సమాజం కోసం

ఆయన చేసిన సాహసాలను, త్యాగాలను చరిత్రలో నిలిపే ప్రయత్నం ముదావహం. సాకారమైన తెలంగాణ అసలు ఆకారం తెలియాలంటే జనహృదయనేత పుస్తకం చదవాల్సిందే. 369 మంది యోధుల బలిదానాలను కూడా ఏర్చికూర్చి మాలగా పేర్చివుంటే తెలంగాణ సమాజం ఎంతగానో హర్షించేది.

అంతా తానే అనుకునే సమాజంలో వీరులను తెరపైకి రానిస్తారా? మూర్ఖులు ముంచాలనుకున్నా ఎన్నో ఏళ్లుగా పుడమిలో పడివున్న విత్తులు ఒక తొలకరికి మొలకెత్తక మానవు. ఈ మట్టినే తొలుచుకుని ఉద్యమాలు, విప్లవాలు చిగురిస్తూనే ఉంటాయి. యోధుల గాథలు ఎప్పటికైనా తిరిగి ప్రజలకు పరిచయమవుతాయి. అందులో భాగమే ఈ పుస్తకం.

**ఎం ఎం రహమాన్**

**సీనియర్ జర్నలిస్టు**

**అధ్యక్షుడు**

**తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల సంఘం**

**సెల్ : 9848328698**



## తెలంగాణ తొలిదశ ఉద్యమకారుడు

# అన్నభీమోజు ఆచారి

# 1. ఉపక్రమణిక

**తెలంగాణ పోరాటాల చరిత్రలో చాలా పేజీలు ఈ అనంత కాలగర్భంలో కలిసిపోయాయి. ఇదే క్రమంలో చరిత్రలోని కొన్ని పేజీలు వాటి ఆనవాళ్లు లేకుండా అదృశ్యమై పోయాయి, పోతున్నాయి కూడా. 2014లో ప్రత్యేక తెలంగాణ ఆవిర్భవించిన తరువాత, ఉద్యమం ఊపిరి పోసుకున్న 1969 నాటి తొలి తెలంగాణ ఉద్యమ వీరులను స్మరించుకునే తీరిక ఓపిక ఇప్పుడెవరికీ లేకపోవచ్చు. అయితే ఉద్యమమే ఊపిరిగా అధికారంలోకి వచ్చిన కొందరి బాధ్యతను మాత్రం ఈ పోరాటాల గడ్డ ఎప్పుడూ మనకు గుర్తు చేస్తూనే ఉంటుంది.**

ఉద్యమం నవనవోన్మేషంగా నడుస్తున్న కాలంలో ఉద్యమమే ఊపిరిగా తమ జీవితాన్ని కొనసాగించిన వారికి తెలంగాణలో లెక్కే లేదు. అలాంటివారి చరిత్రను, వారి త్యాగాలను ఈ ప్రపంచం చిరస్థాయిగా గుర్తుంచుకొనేలా చేస్తామన్నవారు దారి మార్చుకున్నారు. దారి మార్చుకున్నవారికి, వారిని గాడిలో పెడతామని తొడ గొట్టి సవాల్ చేస్తున్న వారికి మధ్య రాజకీయ ఘర్షణ తీవ్రమై దుమ్ము దుమారం రేపుతోంది. ఆ లేచిన రాజకీయ దుమారంలో కళ్లు ఎంత నులుముకొని చూసినా సగటు మనిషి

ప్రయోజనాల జాడలేవీ కనిపించడం లేదు.

మరి నిన్నటి ఉద్యమకారులంతా నేడు రాజకీయ చదరంగంలో ఎత్తులకు పైఎత్తులు వేస్తూ పదవుల పందేరంలో తల మునకలైతే మొన్న వెలుగులీనిన కాగడాలను, ఆ కాగడాలు ఆరిపోయిన తరువాత కల్లోలమైపోయిన కొన్ని కుటుంబాలను, చితికిపోయి ఛిద్రమైన లేలేత బతుకులను కనీసమాత్రంగానైనా పరామర్శించలేకపోతే ఈ మట్టి ఎన్నటికీ క్షమించదు. ఈ గడ్డకు ఉన్న పోరాటాల చరిత్ర ఎవరికీ ప్రశాంతతను కలుగనివ్వదు.

పేరుకోసం పోరాటాలను వాడుకున్నది కొందరైతే, ఆ పేరు కోసం పోరాడినట్లు నటించింది మరికొందరు. అందుకు భిన్నంగా అచ్చంగా ఊరికోసం, ప్రజా ప్రయోజనాల కోసమే పోరు సాగించిన అరుదైన వ్యక్తులు ఇంకొందరు. **అలాంటి వారిలో ఓ ఆణిముత్యమే అన్నభీమోజు మదనాచారి అలియాస్ ఆచారి.**

రాబందుల రెక్కల చప్పుళ్లలో ఊర పిచ్చుకల కిచకిచలను వినిపించేందుకు పడే తాపత్రయమే ఈ ప్రయత్నం. మూడు బజార్ల తెలంగాణ నుంచి ఢిల్లీలోని కోట గుమ్మం దిశగా తోకలు జాడించి విచిత్రమైన సకిలింపులతో సవారీ రాజకీయ గుర్రాలు సాగిపోతుంటే, అవి లేపే ధూళి మేఘాలలో తెలంగాణ మట్టి రేణువుల జాడను పదిలం చేసే ప్రయత్నమే ఈ చిరు పుస్తకం.

ఈ పుస్తకంలో అన్నభీమోజు మదనాచారి అలియాస్ ఆచారి అనేది కాకతాళీయంగా ఓ క్యారెక్టర్ కావచ్చు. కానీ ఆ క్యారెక్టర్‌ను

అంటిపెట్టుకున్న అంశాలన్నీ మాయమైపోయిన తల్లి తెలంగాణ జాడను మళ్లీ ఒకసారి గుర్తు చేస్తాయి. అలా బడుగు బలహీన వర్గాల ఆత్మస్థైర్య సంకేతానికి చిహ్నంగా భావించడం వల్లే ఈ పుస్తక రచనకి ఉపక్రమించాం.

తెలంగాణ ఉద్యమం అనగానే పాత తరానికైనా, కొత్త తరానికైనా సాక్షాత్కరించే నిండైన విగ్రహం ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్. అయితే కాళోజీ నారాయణరావు లాంటి బక్క పలుచటి దేహాలు కత్తుల్లాంటి కవితా వస్తువులను అందిస్తే, జయశంకర్ సార్ లాంటి విద్యావంతులు, మేధావులు తెలంగాణ ఆత్మకు చిరునామాలుగా మాత్రమే కాదు ప్రతిబింబాలుగా కూడా అవతరించారు. తన ఆత్మార్పణతో మలి దశ ఉద్యమంలో నిప్పుల నెగళ్లు ఎగదోసి ఉద్యమాల చరిత్రలో ధ్రువతారగా మిగిలిపోయిన కాసోజు శ్రీకాంతాచారి లాంటి ఎందరో యువకిశోరాల బలిదానాల ఫలితమే ఈనాడు రంగుల రాజకీయం చిందిస్తున్న చిద్విలాస వంతమైన తెలంగాణం.

ఈనాటి విలాసవంతమైన తెలంగాణ కోసం మలిదశ పోరాటంలో 1200 మందికి పైగా యువకిశోరాలు ఆత్మార్పణ చేసుకొని అమరులైతే, 1969 నాటి తొలిదశ పోరాటంలో 369 మంది ఉద్యమకారులు, విద్యార్థి నాయకులు పోలీసు కాల్పుల్లో అమరులయ్యారు. తెలంగాణ సాధించుకున్నాక ఆ 1200 మంది పేర్లు గానీ, కనీస వివరాలను గానీ అధికారికంగా ప్రకటిస్తారని ప్రజలంతా భావించారు. కానీ దాదాపు అందులో సగం కన్నా

తక్కువ మందికి మాత్రమే అమరులు అనే గుర్తింపు దక్కింది. మిగతా వారికి అమరులు అన్న గుర్తింపు దక్కకపోయినా కనీసం వారి పేర్లయినా తెలుసుకుందామనుకున్న ప్రజల ఎదురు చూపులు కూడా ఫలించలేదు. తెలంగాణలో అమరులకే దిక్కు లేకపోతే ఇక పోలీసులనే సవాల్ చేసి, వారి తుపాకులకు సైతం తలవంచక వాటినే తుత్తునియలు చేసి జల సమాధి చేసిన అన్నభీమోజు మదనాచారి అలియాస్ ఆచారి లాంటి నిప్పు కణాల గురించి మాట్లాడుకునేది ఎవరు? వారి గురించి చర్చించుకునేది ఎవరు? వారి గురించి ప్రస్తావించకపోతే అడిగేదెవరు?

అయితే చరిత్ర విసిరే ప్రశ్నలకు చరిత్రే సమాధానం చెబుతుంది. చెప్పుకోవాలి కూడా. చాలా మందికి తెలియని, కొందరికి తెలిసినా బయటకు ప్రకటించని, మరికొందరికి మరోరకంగా కనిపించి ఎందరో కళ్లు జిగేల్ మనిపించి మాయమైన చెకుముకి రాయి నల్లగొండ నల్లసరం మన ఆచారి. ఉద్యమాల ఖిల్లా నల్లగొండ జిల్లాలో ఆచారి తనకు తానుగా సృష్టించుకున్న ఓ పేజీని చిరిగిపోకుండా, చెదలు పట్టకుండా భద్రం చేసే ప్రయత్నమే ఈ పుస్తకం.

# ౭. మిర్యాలగూడలో నిప్పై రగిలిన చెకుముకి రాయి

ప్రాంతీయ న్యాయం కోసం వెల్లువెత్తిన ప్రజా ఉద్యమాలు ఒకే దగ్గర ఆగిపోవు. ఒక వేళ ఆగిపోతే అవి ప్రజా యుద్ధాలు కాదన్న కిందే లెక్క. ఖమ్మం రైల్వే స్టేషన్ గుమ్మంలో మొదలైన తెలంగాణ ఆకాంక్షల నిరాహారదీక్ష అక్కణ్నించి తెలంగాణ అంతటా నిప్పు రాజేయాలని చూసింది. అలా ఖమ్మం తరువాత తెలంగాణలో మొదలైన రెండో ఉద్యమ కేంద్రమే మిర్యాలగూడ.

ఉద్యోగుల్లో వివక్షకు వ్యతిరేకంగా 1969లో ఖమ్మంలో రవీంద్రనాథ్ నిరాహారదీక్షకు కూర్చున్నారు. ఆ స్ఫూర్తి మిర్యాలగూడ మట్టికి సోకింది. ఇక్కడ మిర్యాలగూడలో తెలంగాణ ఉద్యమ కాగడాను అన్నభీమోజు కుటుంబం అందుకుంది. ఆనాటి రాజకీయాలను, సామాజిక సమీకరణాలను ఎంతో గణనీయంగా ప్రభావితం చేసిన తెలంగాణ ప్రజా సమితి (టి.పి.ఎస్.) మిర్యాలగూడలో ప్రారంభమైంది అన్నభీమోజు కుటుంబంతోనే.

1969 జూన్, మిర్యాలగూడ పట్టణంలో ఉద్యోగ నియామకాల్లో తెలంగాణ ప్రజల పట్ల ఆంధ్రా సర్కారు చూపుతున్న

వివక్షకు నిరసనగా నిరాహార దీక్ష మొదలైంది. సీడీ నాయుడు, ఇరుగు చందు మరి కొందరు యువకులు ప్రస్తుత సమితి ఆఫీసులోనే నిరాహార దీక్షకు పూనుకున్నారు. మిర్యాలగూడలో తెలంగాణ ప్రజా ఉద్యమం మళ్లీ మొదలైంది అప్పుడే. అంతకు ముందు నిజాం సర్కారు జమానాలో రజాకార్ల రాక్షస కృత్యాలకు వ్యతిరేకంగా జరిగిన భారీ ఉద్యమ నేపథ్యం కూడా మిర్యాలగూడ గడ్డకు ఉందన్న విషయం మరువరాదు. అయితే విశాలాంధ్ర ఏర్పాటు తరువాత ఆంధ్రా కుటిల పాలకుల వివక్షపై రగల్ జెండా ఎగిరింది మళ్లీ ఇప్పుడే. అయితే సీడీ నాయుడు, చందుల నిరాహార దీక్ష మొదలై రెండు రోజులు అవుతోంది. నిరాహార దీక్ష రెండోరోజు కూడా కొనసాగుతుందంటే త్వరలోనే ఆ తెలంగాణ నిప్పు దావానలమై దహించడం ఖాయమన్న విషయాన్ని ఆనాటి కాంగ్రెస్ పాలకులు సులభంగానే అంచనా వేశారు. కాంగ్రెస్‌లో ఈనాడే కాదు ఆనాడు కూడా గుంట నక్కల్లాంటి నాయకులకు కొదువలేదు. ఉద్యమాన్ని చాప చుట్టేసి నిద్ర పుచ్చాలనే అత్యంత పేలవమైన కిటుకు ప్లే చేశారు. సీడీ నాయుడు ఆంధ్రాకు చెందిన వ్యక్తి అని, అతను తెలంగాణ ఉద్యమంలో పాల్గొనడం ఏంటని వివాదం లేవదీశారు. తెలంగాణ ప్రజానీకం ముందు, మిర్యాలగూడ ప్రజల ముందు ఉద్యమకారులను తెలంగాణ ద్రోహులుగా చూపించాలని కక్కుర్తి పడ్డారు. ఉద్యమంలోని నిజాయతీని, డిమాండ్లలోని స్వచ్ఛతను బాగా ఆకళింపు చేసుకున్న సీడీ నాయుడు తన పంథాను మార్చుకోవడానికి సిద్ధంగా లేడు. కాకపోతే తాను ఆంధ్రా

మూలాలున్న వ్యక్తి కాబట్టి స్థానికంగా బలమైన వ్యక్తులు గనక ముందుకు వస్తే ఉద్యమాన్ని విస్తరించాలని ఆయన భావిస్తున్నాడు.

సీడీ నాయుడు మిర్యాలగూడలో మంచి విలువలు ఉన్న వ్యక్తిగా పేరుంది. పేరు, ప్రతిష్టలున్న వ్యక్తుల్లో నిజాయితీ పరుడిగా అందరూ గుర్తిస్తారు. ప్రఖ్యాత న్యాయవాదిగా కీర్తి పొందారు. ఆర్థికంగా బాగా స్థిరపడ్డారు. సీడీ నాయుడి కొడుకే సీడీ రవికుమార్. సీడీ రవికుమార్ యొక్క పెళ్లిని అనంతర కాలంలో ఆచారిగారు తండ్రి బాధ్యతలు తీసుకొని దగ్గరుండి జరిపించారు. సీడీ రవికుమార్ తరువాత కాలంలో టీడీపీలో చేరి జడ్పీ చైర్మన్‌గా కూడా పని చేశారు.

రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ తానేం చెబితే అదే జరుగుతుందని, తనకు వ్యతిరేకంగా చీమ చిటుక్కుమన్నా అక్కడే నలిపివేయాలని హైకమాండ్ నుంచి ఆదేశం. ఆదేశాలకు అనుకూలంగానే కొందరు స్థానిక నాయకులు సీడీ నాయుడు అనే "ఆంధ్రావాలా" పెత్తనంపై అక్కసు వెళ్లగక్కారు. స్థానిక ప్రజల మద్దతు లేకుండా ఇతర ప్రాంతాలకు చెందిన ఎంత గొప్ప నాయకుడైనా చేయగలిగింది ఏమీ ఉండదు. అయితే నిండైన ప్రజాకాంక్షతో రగులుకొంటున్న తెలంగాణ ఉద్యమం తనను తాను విస్తరించుకునే క్రమంలో అన్నభీమోజు ఫ్యామిలీని నాయుడుకు జత చేసింది.

సీడీ నాయుడుకు అన్నభీమోజు సైదయ్యకు మంచి స్నేహ

సంబంధాలున్నాయి. అది ఉద్యమానికి పనికొచ్చింది. కాంగ్రెస్ కపటనీతిపై అప్పటికే కాలు దువ్వుతున్న తెలంగాణ ప్రజాసమితి మిర్యాలగూడలో శాఖను ఏర్పాటు చేసింది. అన్నభీమోజు వంశంలో పెద్దవాడైన అన్నభీమోజు సైదయ్య, చిన్నవాడైన జనార్దనాచారి, సీడీ నాయుడు కలిసి టీపీఎస్ మిర్యాలగూడ విభాగాన్ని ఏర్పాటు చేశారు. టీపీఎస్‌లో క్రియాశీలంగా సీడీ నాయుడుతో కలిసి అన్నభీమోజు ఫ్యామిలీ దూకుడుగా వెళ్తోంది. అన్నభీమోజు కుటుంబం అప్పటికే కలప వ్యాపారం, స్టీలు వ్యాపారంలో స్థిరపడింది. వీరు నల్లగొండ జిల్లా కనగల్లు నుండి దాదాపు వందేళ్ల క్రితమే మిర్యాలగూడ వచ్చి స్థిరపడ్డారు. ఊళ్లోని ధనిక వర్గాలకే గాక అన్ని ఇతర బలహీన వర్గాల్లోనూ “అన్నభీమోజు” ఫ్యామిలీకి మంచి పేరు ప్రఖ్యాతులున్నాయి. ఆ కుటుంబానికి ఉండే పట్టు, పలుకుబడి మిర్యాలగూడలో ఉద్యమానికి బాగా అక్కరకొచ్చింది.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర అవసరం ఇక్కడ బడుగు, బలహీనులకే ఎక్కువగా ఉంది. ఆ విషయాన్ని గుర్తించిన టీపీఎస్ అధినాయకుడు మర్రి చెన్నారెడ్డి రోజుకొక సామాజికవర్గం నిరాహారదీక్షలో పాల్గొనేలా స్థానిక నాయకత్వం ప్రణాళికలు వేసుకోవాలని సూచించాడు.

అందులో భాగంగా మిర్యాలగూడలో వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో వరుస నిరసనలు జోరుగా నడుస్తున్నాయి. హమాలీ సంఘం ఒక రోజు, దర్జీల సంఘం ఒక రోజు, వ్యాపారస్తుల

సంఘం ఒకరోజు, కార్పెంటర్స్ అసోసియేషన్ ఒక రోజు... ఇలా వంతుల వారీగా వేసుకొని నిరసనోద్యమాలు నడిపిస్తున్నారు. ఆ పరంపరలో ఒకరోజు వడ్రంగి వృత్తి సంఘం, తాపీ మేస్త్రీ సంఘం వారి వంతు వచ్చింది. అయితే రోజూ జరుగుతున్న తంతుకు భిన్నంగా మిర్యాలగూడ చరిత్రలో ప్రముఖంగా నిలిచిపోయే ఘటన ఆ రోజు జరిగింది.

రోజూ జరుగుతున్న రిలే నిరాహార దీక్షకు 50 నుండి 60 మందికి మించకుండా వచ్చేవారు. కానీ ఆరోజు 500 మందికి పైగానే నిరాహార దీక్షకు తరలి వచ్చారు. మిర్యాలగూడ వీధులు 'జై తెలంగాణ' నినాదాలతో దద్దరిల్లాయి. పనిముట్లు భుజాల మీద వేసుకొని ఆయా కార్మిక సంఘాలు, ఉద్యమకారులు కవాతుచేస్తూ... ఉద్యమస్థలికి చేరుకున్నారు. ఆ సంఖ్యను చూడగానే పోలీసుల కళ్లు కుట్టాయి. కాంగ్రెస్ శిబిరంలోని కొందరు కలవర పడ్డారు. ఆ రోజు జనాన్ని చూస్తే ఏం జరుగుతుందోనన్న అనుమానాలు పోలీసుల్లో ముసురుకున్నాయి. అటు ఉద్యమకారులు బస్టాండులోకి బస్సులు వెళ్లకుండా పెద్ద పెద్ద కర్రమొద్దులు తెచ్చి అడ్డంగా పడేశారు. అన్నభీమోజు సైదయ్య నడిపిస్తున్న కట్టెకోత మిషన్ (టింబర్ డిపో) అక్కడే ఉంది. అందులోని కర్రమొద్దులే ఇలా రోడ్డుకు అడ్డంగా చేరిపోయాయి.

నిరసన దీక్షా శిబిరాన్ని విచ్ఛిన్నం చేయాలని పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించారు. దీక్షాస్థలానికి చేరుకుంటున్న

కార్మికులను, సంఘాల నాయకులను పోలీసులు నిరోధించే ప్రయత్నం చేస్తున్నారు. వారేమో గోడ కట్టినట్టుగా ఉన్న పోలీసులను ఛేదించుకొని పోవాలని ముందుకు కదులుతున్నారు. జై తెలంగాణ నినాదాలతో ఉద్యమకారులు గర్జిస్తున్నకొద్దీ దీక్షా శిబిరంలో ఉత్సాహం పెరుగుతోంది. అటు అంతే స్థాయిలో పోలీసుల్లో పంతం పెరుగుతోంది. వాహనాలు రోడ్డుకు రెండువైపులా నిలిచిపోయాయి. ఇక్కడ ఇద్దరి మధ్య తోపులాట పెరుగుతోంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు లాఠీలకు పని చెప్పారు. ముందున్నవారి మీద లాఠీలు నాట్యం చేశాయి. అయినా సభాస్థలి నుంచి ఎవరూ పారిపోయేందుకు ప్రయత్నించడం లేదు. స్టేజీ వైపు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న వారిని పోలీసులు తుపాకులనే బ్యారికేడ్లుగా మార్చి నిరోధిస్తున్నారు. అప్పుడే ఎవరూ ఊహించని సంఘటన ఒకటి జరిగింది.

ఉద్యమంలో చురుగ్గా పాల్గొంటున్న అన్నభీమోజు మదనాచారి అలియాస్ ఆచారి ఆ రోజు కూడా యథాప్రకారం ముందు వరుసలోనే ఉండి నినాదాలు ఇస్తున్నాడు. ఈ క్రమంలో తుపాకులు అడ్డంగా పెట్టి ఆపుతున్న పోలీసులపై ఆచారి అసహనం ప్రదర్శిస్తున్నాడు. నినాదాల జోరు మరింత పెరిగింది. గోడ కడుతున్నట్టుగా తుపాకుల సంఖ్య కూడా పెరగడం ప్రారంభమైంది. ఉడుకు రక్తం ఉరకలేస్తూ పోలీసుల అణచివేత, తెలంగాణ బంధవిముక్తి అనే పరస్పర ఘర్షణ భావాల పోరాట బాటలో

పయనిస్తున్న ఆచారి కట్టలు తెగిన ఆవేశంతో తన ఎదురుగా ఉన్న పోలీసు చేతుల్లోని తుపాకీ లాక్కున్నాడు. 303 తుపాకిని రెండుచేతులతో పట్టుకుని తన కుడి తొడను పైకెత్తి, ఆ తొడమీద తుపాకిని రెండు ముక్కలుగా విరగ్గొట్టాడు. అలాంటి దృశ్యాన్ని ఎవరూ ఊహించలేదు. పోలీసులు ఏం జరుగుతుందో గ్రహించేలోపే సేనాని యొక్క ఆదేశాన్ని సైనికులంతా పాటించినట్టు ఆచారి చర్యను అక్కడున్న ఉద్యమ కారులంతా అమలు చేశారు. పోలీసులకు అర్థమయ్యేలోపే ఉద్యమ కారులంతా పోలీసుల చేతుల్లోని తుపాకులు లాక్కున్నారు. ఆచారి లాగా తొడలమీద విరగ్గొట్టే దేహదారుఢ్యం వారికి లేకపోవచ్చు. కానీ ఆవేశంతో ఉన్న సహచరులందరు ఆచారిని అనుసరించారు.

అయితే ఆచారి కొనసాగించిన మరోచర్యను తు.చ. తప్పకుండా అనుసరించారు. తుపాకీని రెండు భాగాలుగా విరగ్గొట్టిన ఆచారి ఆ ముక్కలైన తుపాకీని ఆ పక్కనే ఉన్న పాత బస్టాండ్ బావిలో పడేశాడు. మిగిలిన ఉద్యమకారులంతా తాము లాక్కున్న తుపాకులను సైతం అదే బావిలో పడేశారు. దీంతో పోలీసులు వెనక్కి తగ్గారు. కాదు కాదు... పలాయనం చిత్తగించారు. ఇది అనూహ్య పరిణామం.

ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం నింపిన జోష్‌లో వారేం చేస్తున్నారో వారు గ్రహించలేకపోయారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసుల చేతుల్లోని తుపాకులు లాక్కుంటే ప్రభుత్వం ఎలా పరిగణిస్తుందో

బహుశా వారు అంచనా వేసి ఉండకపోవచ్చు. అలాంటి పరిణామమే చోటు చేసుకుంది. ఆత్మ రక్షణకోసం అంటూ ఉద్యమకారుల మీదికి పోలీసులు కాల్పులు జరిపారు. కాల్పుల ఘటనతో కార్యకర్తల గుంపు చెల్లాచెదురైంది. అంతా పారిపోయారు. ఒక ఉద్యమకారుడు కాల్పుల్లో చనిపోయాడు. కొందరికి గాయాలయ్యాయి. తెలంగాణ ఉద్యమకారులను పోలీసులు సంఘ విద్రోహ శక్తులుగా ప్రకటించారు. ఉద్యమకారుల్లో విచ్ఛిన్నకర శక్తులు చొరబడ్డాయని, ఉద్యమం పేరు చెప్పి ఎవరు ముందుకొచ్చినా ఉపేక్షించేది లేదని పోలీసులు ప్రకటించారు. మిర్యాలగూడ పట్టణంలో కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు జారీ చేయబడ్డాయి.

* * *

మిర్యాలగూడలో పోలీసుల తుపాకులు లాక్కొని కాల్పులకు కారకులైన ఆచారి అండ్ కో అక్కణ్నించి చాకచక్యంగా తప్పించుకొని హైదరాబాద్ చేరుకున్నారు. పోలీసులకు దొరక్కుండా హైదరాబాద్‌లో అజ్ఞాత జీవితం గడుపుతున్నారు. వారిలో ఆచారితో పాటు షేక్ మహబూబ్ అలీ ఉన్నాడు (ఇతన్నే పుంగ మహబూబ్ అలీ అంటారు). పుంగ మహబూబ్ అలీకి ఆ పేరు తన వాక్చాతుర్యం వల్ల వచ్చింది. ఏ సభలోనైనా అతను మైక్ పట్టుకున్నాడంటే సభికులంతా ఆయన ఉపన్యాసంలోని ప్రవాహ ఉధృతిని మరియు వాచామృత వైభవాన్ని ఆస్వాదించాల్సిందే. ఆ రోజుల్లో మైక్‌సెట్లు

ఉండేవి కావు. పుంగను చేతపట్టి వాటి రీసౌండ్ ఆధారంగా పబ్లిక్ మీటింగ్‌లు, పార్టీ ప్రచారాలు జరిగేవి. అలాంటి ప్రచారాలకు కాంగ్రెస్ పార్టీ నుంచి మహబూబ్ అలీనే సారథ్యం వహించేవాడు. ఆ విధంగా ఆయనకు ఆ పేరు వచ్చింది. ఆయన కుమారుడే మంచి పేరున్న ఇంగ్లిష్ టీచర్ హమీద్. ఆయన్ని స్టూడెంట్స్ అంతా ఆప్యాయంగా హమీద్ సర్ అని పిలిచేవారు.

ఆయనతో పాటు కె. సర్వేశ్వరరావు, నాగుబండి పాండురంగయ్య, గంధం మట్టయ్య, బుల్లెట్ మెకానిక్ జలాల్ వంటివారు హైదరాబాద్‌లో అజ్ఞాత జీవితం గడుపుతున్నారు.

బుల్లెట్ మెకానిక్ జలాల్ అప్పటి మిర్యాలగూడ తాలూకాలోనే పేరున్న బైక్ మెకానిక్. అలాగే జలాల్ ఆచారి లాగానే షార్ప్ షూటర్. తుపాకీ పేల్చడంలో దిట్ట. మోటార్ సైకిల్ బీటింగ్‌ని బట్టి దాని పుట్టు పూర్వోత్తరాలు చెప్పేవాడు. ఆ సౌండ్‌ని బట్టే దాని సమస్యేంటో, దానికి మిగిలి ఉన్న ఆయుష్షు ఎంతో లెక్క కట్టి చెప్పేవాడు. అంతటి పేరున్న మెకానిక్ జలాల్.

ఈ కేసులో వారందరికీ షెల్టర్ ఏర్పాట్లు, తినడానికి, ఉండడానికి, తిరగడానికి అయ్యే ఖర్చులన్నీ అన్నభీమోజు సైదయ్యే సమకూర్చాడు. కోర్టు ఖర్చులు ఇలా అన్నీ అన్నభీమోజు కుటుంబమే భరించింది. అందరూ ఆర్థికంగా వున్నా ఆచారి కోసం వారు చేసిన సాహసం దృష్టిలో వుంచుకొని, అన్న సైదయ్య అన్ని ఖర్చులూ భరించాడు. ఆ రోజుల్లో అంటే 1969లో వెయ్యి రూపాయల

ఫైన్ కోర్టుకు కట్టాల్సి వచ్చింది. తమ్ముడు మదనాచారిని పోలీసులకు దొరక్కుండా జాగ్రత్తలు తీసుకున్న సైదయ్య... తన పలుకుబడిని ఉపయోగించి కోర్టులో సరెండర్ చేయించాడు. ఈ విషయంలో పూర్తిగా సహకరించిన వ్యక్తి లాయర్ సీడీ నాయుడు. న్యాయవాద వృత్తినుంచి విరమించుకున్న నాయుడు తనకు ఆప్తమిత్రుడైన సైదయ్య తమ్ముడి కోసం మళ్లీ నల్లకోటు ధరించాడు.

* * *

మిర్యాలగూడలో జరిగిన ఘటనను పోలీసులు చాలా తీవ్రంగా పరిగణించారు. సాయుధులైన పోలీసుల మీద అంతటి స్థాయిలో సగటు మనుషులు, సాధారణ కూలీలు ఉద్యమకారులుగా మారి ఎలా తిరగబడ గలిగారు? ఆ ధర్నాలో పాల్గొనడానికి ప్రేరేపించిందెవరు? వారి నేపథ్యం ఏమిటి? తెలంగాణ ఉద్యమాన్ని వెనుక ఉండి నడిపిస్తున్న చోదక శక్తులు ఏమిటి? అనే కోణం ఒకటి. మరోవైపు అందులో పాల్గొన్న వారి నేపథ్యం సామాజిక స్థాయి, స్థితిగతులతో సంబంధం లేకుండా, ఇక ముందు ఎవ్వరైనా సరే తెలంగాణ నినాదాన్ని ఎంచుకోకుండా ఉండాలంటే అందుకోసం అమలు చేయాల్సిన పోలీస్ ట్రీట్‌మెంట్ మరోకోణం. ఈ రెండు వ్యూహాలను ఏకకాలంలో అమలు చేసిన పోలీసులు మిర్యాలగూడలో విరుచుకుపడ్డారు.

వారికి ఉన్న సమాచారం ప్రకారం ధర్నాలో, రాస్తారోకోలో, నిరాహార దీక్షా శిబిరంలో పాల్గొన్నవారు ఎవరు అనే కూపీ లాగుతూ సోదాలు చేశారు. అనుమానం ఉన్న ప్రతి ఇంటిపైనా దాడి చేశారు. కాస్త తల బిరుసుగా కనిపించిన ప్రతి యువకుడి ఇంటినీ గాలించారు. ఏమైనా వారు కోరుకుంటున్న "సాహిత్యం" దొరుకుతుందా? తమకు పట్టుబడిన వ్యక్తుల వివరాలను ఉన్నతాధికారులకు సమర్పించి ప్రమోషన్ కొట్టేయడమెలా? ఈ విధంగా పోలీసులకు భిన్నమైన ఆలోచనలు కూడా కొనసాగాయి. వరి పంటకు కేంద్రంగా భాసిల్లుతున్న మిర్యాలగూడలో సెర్చ్ ఆపరేషన్ స్టార్ట్ అయింది. మహిళలు కనిపిస్తే బండబూతులు తిట్టడం చేశారు. వరి ధాన్యాన్ని బావుల్లో పడేశారు. ఉద్యమ కారులకు కనీసం తిండిగింజలు కూడా లేకుండా చేయడం వారి కుట్రలో భాగం. వామపక్ష ఉద్యమాన్ని అణచివేసేందుకు పోలీసులు ఎంచుకున్న వ్యూహంలో అదో కీలక భాగం. ఉద్యమ అణచివేతకు అటు పోలీసులు, ఇటు ప్రభుత్వం ఎంచుకున్న సాకు ఏంటంటే ఆ ఉద్యమంలో "అసాంఘిక శక్తులు" చొరబడ్డాయని, అసాంఘిక శక్తుల అణచివేతకు పోలీసులు ఏ చర్యలకు పూనుకున్నా అడిగేవారు ఉండరని. ఆ ఒక్క కారణం చూపి అసలు సిసలు ఉద్యమకారులతో పాటు ఉద్యమ కారులతో సంఘీభావంగా ఉండే సామాన్యజనాన్ని కూడా లోపల వేసేయవచ్చు. తమకు నచ్చనివారి తడాఖా కూడా చూడవచ్చు. ఆ విధంగా ఆనాటి మిర్యాలగూడ తిరుగుబాటులో ఉద్యమకారులు ఎదుర్కొన్న కష్టాలను, వారి కుటుంబాలు చవిచూసిన

నష్టాలను ఏ తెలంగాణ చరిత్రకారుడు కూడా బహుశా గుర్తించిన దాఖలాలు లేవు. ఎక్కడా నమోదు కాలేదు.

మిర్యాలగూడలో జరిగిన నిరసనల్లో 500 మంది దాకా పాల్గొనడం ప్రభుత్వాన్ని కలవరపాటుకు గురి చేసింది. ఉద్యమం మరింత విస్తరించకుండా చూడాల్సిన సవాలుగా పోలీసులకు మారింది. ఈ క్రమంలో పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న మదనాచారి బృందాన్ని తక్షణమే అరెస్టు చేయాల్సిందిగా మెజిస్ట్రేటు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల రూపంలో అసాంఘిక శక్తులు చొరబడ్డాయని ప్రభుత్వం "కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు" జారీ చేసింది.

అప్పటికే అన్నభీమోజు మదనాచారి హమాలీల సంఘం, రిక్షా పుల్లర్ల సంఘం, తాపీమేస్త్రీ సంఘం, కార్పెంటర్స్ అసోసియేషన్‌తో పాటు ఇతర బడుగు, వృత్తి సంఘాలకు నాయకుడుగా ఉన్నాడు. అందుకే ఆ రోజు జరిగిన నిరసనకు తెలంగాణ కార్మికులు, కర్షకులు, కూలీలు పోటెత్తారు. అలాంటి పరిస్థితుల్లో పోలీసులకు కీలకమైన వ్యక్తిగా కనిపిస్తున్నది మదనాచారి, ఆయనతో పాటు మరో నలుగురైదుగురు. అందుకే ఆ జట్టు మొత్తాన్ని ఆ సమయంలో పోలీసులకు చిక్కకుండా కాపాడాడు అన్నభీమోజు సైదయ్య. ఒకవేళ ఏ కారణం చేతనైనా సైదయ్య ఆ పని గనక చేసి ఉండకపోతే పోలీసులు అల్లే ఏ

ఎన్‌కౌంటర్ కథలోనో వారంతా చిన్నపాటి పాత్రధారులుగా మిగిలి ఉండేవారు. సైదయ్య తన పలుకుబడి ఉపయోగించి ముందుచూపుతో వ్యవహరించిన కారణంగా మదనాచారిని కోర్టులో లొంగిపోయేలా చేశాడు. కోర్టు విచారణ అనంతరం మదనాచారి అండ్ టీమ్‌ను జడ్జి దోషులుగా నిర్ధారించారు. మదనాచారికి 9 నెలలు జైలు శిక్ష పడింది.

తెలంగాణ ఉద్యమంలో సైదయ్య, జనార్ధనాచారి వంటివారు నాయకత్వ స్థానంలో ఉన్నారు. వివిధ సంఘాలు వంతులవారీగా దీక్షలు చేస్తున్న క్రమంలో లాఠీచార్జ్ జరిగింది. అందులో గాయాలపాలైన వారిలో మదనాచారి, షేక్ మహబూబ్ అలీ (పుంగ మైబెల్లి), గంధం కోటయ్య, బుల్లెట్ మెకానిక్ జలాల్‌కు గాయాలయ్యాయి. అక్కడ మదనాచారి చేసిన సాహస కృత్యమే ఆయనలోని నాయకున్ని ప్రపంచానికి పరిచయం చేసింది. ఆ మిగతా ఐదుగురు ఆచారితోనే ఎంతో నమ్మకంగా చివరిదాకా ఉన్నారు.

# 3. ఆ ఆవేశం వెనుక స్వరాష్ట్రం మీద ప్రేమ- అందుకే జైలు జీవితం

మదనాచారి జైలుకు వెళ్ళడం తన అనాలోచిత, ఆవేశపూరిత తొందరపాటు చర్యగానే బయటికి కనిపిస్తుంది. కానీ తరచి చూస్తే ఆచారిలోని సామాజిక స్పష్టత, ప్రాంతానికి జరుగుతున్న అన్యాయం మీద తిరుగుబాటు ధోరణి వంటి అంశాలతో పాటు అన్నభీమోజు కుటుంబమే కీలక పాత్రధారిగా నడిపిస్తున్న స్వరాష్ట్ర ఉద్యమం మీద అకుంఠితమైన భక్తి, విశ్వాసాలు కనిపిస్తాయి. ఆ ఇంటికి పెద్దవాడైన సైదయ్య ఎంత బాధ్యతగా తన కుటుంబం యొక్క బరువు మోశాడో ఈ పుస్తకంలో ముందు ముందు తెలుస్తుంది.

మిర్యాలగూడలో జరిగిన నిరసన దీక్షలో తాపీ మేస్త్రీల, కార్పెంటర్స్ అసోసియేషన్‌ల వంతు వచ్చిన రోజు ఆ శిబిరంలో అన్నభీమోజు సైదయ్య పాల్గొన్నాడు. ఆయన పాల్గొనడం కాదు, అసలు ఆ ఉద్యమానికి నాయకత్వం వహించిందే సైదయ్య. డబ్బు, పేరు ప్రతిష్టలు, సామాజిక కుల సంఘాల్లో పలుకుబడి ఉన్న సైదయ్య పట్ల గౌరవ మర్యాదలు మిర్యాలగూడలో మెండుగా ఉండేవి. ఆ రోజున ఆయన పిలుపు నందుకునే కూలీ జనం

అందరూ మిర్యాలగూడ వీధుల్లో కదం తొక్కారు. ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తున్న నాయకుడిగా సైదయ్యను గుర్తించిన పోలీసులు అతని మీద లాఠీలు ఝళిపించారు. ఆ పోలీసుదాడిలో సైదయ్య గాయాలపాలయ్యాడు. అన్న గీసిన గీత దాటని వ్యక్తి మదనాచారి. ఆ రోజున అన్నభీమోజు ఫ్యామిలీ నేతృత్వం వహిస్తున్నందున మదనాచారి మరింత క్రియాశీలంగా ఉన్నాడు. అన్నమీద పడ్డ పోలీసు లాఠీ దెబ్బలను కళ్లారా చూసిన మదనాచారి మనసు చలించి పోయింది. పట్టరాని ఆవేశంతో ఊగిపోయాడు. వెనకాముందు ఏమీ ఆలోచించలేదు. ఆ తరువాత ఎదురయ్యే పరిణామాలు ఎలా ఉంటాయెూ అతని మస్తిష్కంలోకి చూచాయగానైనా తొంగి చూడలేదు. పోలీసులు తుపాకులతో తమను నెట్టేస్తుంటే అప్పుడు అలా బయట పడింది ఆయన ఆవేశం. ఆయన పూనుకున్న ఆనాటి చర్యలో ధీరత్వం, దృఢ సంకల్పం, అన్న మీద ప్రేమ స్పష్టంగా కనపడతాయి.

*　　*　　*

## నల్లగొండ జైలు

ప్రతి మనిషి వ్యక్తిత్వానికి రెండు పార్శ్వాలు ఉన్నట్టే ప్రభుత్వ వ్యవస్థలోనూ బొమ్మా బొరుసులు కనిపిస్తాయి. జైళ్లలో అవి మరింత ఎక్కువగా ప్రస్ఫుటిస్తాయి. మన న్యాయస్థానాలు కూడా అందుకు

అతీతమేం కాదు. నల్లగొండ జైల్లో మదనాచారి గడిపిన ఆ 9 నెలల కాలం చాలా ప్రత్యేకమైంది. జైలు జీవితం కొందరికి నరకప్రాయం. శిక్షలో భాగంగా జైలుకెళ్లినవారు అక్కడ పడేయాతన అంతా ఇంతా కాదు. అయితే మదనాచారి విషయంలో జైలు జీవితం అందుకు పూర్తిగా భిన్నమైనది. అతనికి నల్లగొండ జైల్లో సకల సౌకర్యాలు సమకూరాయి. ఇంటికి దూరంగా ఉండడం తప్ప ఖానా పీనా విషయంలో జైలు అధికారులు మదనాచారికి ప్రత్యేకమైన వెసులుబాట్లు కల్పించారు. ఆ తొమ్మిది నెలల కాలంలో అతను ఏనాడూ జైలు కూడు తిని ఎరుగలేదు. ప్రతిరోజూ ఇంటినుండే భారీ క్యారేజ్ వచ్చేది. ఆ క్యారేజీలో ఐదారుగురికి సరిపడా భోజనం ఉండేది. అన్నభీమోజు కుటుంబంలో ప్రతిరోజూ కూలీలు, పనివారు, కట్టెమిషనులో పనిచేసే కార్మికులు భోజనం చేసేవారు. వంట చేసేటప్పుడే వారందరికీ కలుపుకొని ప్రిపేర్ చేసేవారు. బయటి వ్యక్తులకు భోజనం పెట్టడం ఆ ఇంటికి కొత్త కాదు. పండుగలు, పబ్బాలు వచ్చినప్పుడు ఇల్లు, కార్ఖానాలు అంతా ఒక జాతరను తలపించేవి. 24 గంటలూ పనివాళ్లు అందుబాటులో ఉండేవారు. పనివాళ్లతో, కస్టమర్లతో సందడిగా ఉండేది. అలాంటి ఇంటినుంచి జైలుకెళ్ళిన మదనాచారి సాధారణ ఖైదీ ఎలా అవుతాడు? అందుకే ప్రతిరోజూ భారీ క్యారేజీ క్రమం తప్పకుండా వెళ్లేది. ఐదుగురిలో చిన్నవాడైన జనర్ధనాచారి ఉదయం 11 గంటలకల్లా మోటార్‌సైకిల్ మీద వెళ్లి ఇచ్చేవాడు. మదనాచారికి ఆ రోజుల్లో బిఎస్ఎ మిలటరి బుల్లెట్ సైకిల్

ఉండేది. అది మిలిటరీ నుంచి రిటైర్ అవుతూ తిరిగొచ్చిన ఓ ఆర్మీ ఆఫీసర్ నుంచి కొనుగొలు చేసింది కావడం విశేషం. ఆ బండిమీదే జనార్ధనాచారి క్యారేజీ సరఫరా చేసేవాడు. నాలుగోవాడైన మదనాచారి కోసం మిగిలిన అన్నదమ్ములంతా రోజుకొకరు చొప్పున వంతులు వేసుకొని క్యారేజీ పంపేవారు. అన్నభీమోజు కుటుంబంలో మిగిలిన నలుగురు ఒక ఎత్తు. మదనాచారి ఇంకోఎత్తు.

పాండవుల్లో రెండోవాడైన భీముడు ఎలాంటివాడో వీరి కుటుంబంలో నాలుగోవాడైన మదనాచారి కూడా అలాంటివాడే. భారీ ఆకారం, చూడగానే మనసులో చెరగని ముద్ర పడే స్ఫురద్రూపం, మాట్లాడితే హృదయంలోకి సూటిగా దూసుకెళ్లే గంభీరమైన గళం, ఆకారానికి తగినట్టుగా పౌరుష పరాక్రమాల ప్రదర్శనలోనూ ఆయనది ప్రత్యేకమైన తరహా. అందుకే ఆయన భోజనం ఎలా ఉండాలో ఇంట్లో అందరికీ తెలుసు.

అందుకు తగినట్లుగానే ప్రతిరోజూ అతనికి మాంసాహార భోజనమే వండి పంపించేవారు. మాంసం లేకపోతే ముద్ద దిగేదే కాదు. కూరగాయలు, పెరుగు, పచ్చడిలాంటివి ఉన్నా మటన్ కూడా తప్పనిసరిగా ఉండాల్సిందే. దీనికితోడు మదనాచారి సంఘజీవి. ఆయన ఏనాడూ ఒంటరిగా భోజనం చేసి ఎరుగడు. అది ఇల్లయినా, జైలైనా. అందువల్ల ఆయనకు జైల్లో కొద్దికాలంలోనే ఫ్యాన్స్, ఫాలోవర్లు తయారయ్యారు.

జైల్లో పప్పు, పులుసు ప్రతిరోజూ తినలేక నాలుక మీది

రుచిమొగ్గలు చచ్చుబడిపోయిన మాంస ప్రియులకు మదనాచారి రాక పసందైన పంచభక్ష్య పరమాన్నాలు మోసుకొచ్చినట్లయింది. ఘుమఘుమలాడే భోజనాన్ని అందరూ కలిసి ఆరగించేవారు. ఒక రాజకీయ ఖైదీ అనుభవించే అన్ని సదుపాయాలు మదనాచారి అనధికారికంగా అనుభవించాడు.

అందుక్కారణం, దానికి నేపథ్య ఏర్పాట్లన్నీ సైదయ్య సంపాదించిన పరపతి ఫలితం అని వేరే చెప్పాల్సిన అవసరం లేదు కదా.

# 4. జైల్లో రూపుదిద్దుకున్న నాయకత్వం

నాయకులు ఆవిర్భవిస్తారు. తయారు కారు. ఆ రెండు వాక్యాల స్వరూప స్వభావాల్లో చాలా తేడా ఉంది. అందులోని మొదటి వాక్యం మదనాచారికి సరిగ్గా సరిపోతుంది. అన్నభీమోజు కుటుంబ నేపథ్యం, సైదయ్య సమకూర్చుకున్న పేరు ప్రతిష్టలు, అన్నభీమోజు కుటుంబానికి వారి తండ్రి సాంబయ్య నుంచి వారసత్వంగా సంక్రమించినవే. ముఖ్యంగా మదనాచారి 9 నెలల కాలం పాటు గడిపిన జైలు జీవితం, దాన్నుంచి ఆయనకు వచ్చిన ఫాలోయింగ్ వంటివన్నీ అన్నభీమోజు కుటుంబ పరపతిని బాగా పెంచాయి. జైలు శిక్ష తరువాత ఆయన బయటకు అడుగు పెట్టేనాటికి ప్రజల్లో ప్రత్యేకమైన అభిమానం, ఒక గుర్తింపు ఏర్పడ్డాయి. మదనాచారి వెంట మాస్ ఫాలోయింగ్ బాగా పెరిగిపోయింది.

అప్పటి వరకు అన్న చాటు తమ్ముడిగా బయటి ప్రపంచానికి పెద్దగా తెలియని మదనాచారి జైలు నుంచి బయటకొచ్చాక "అన్న చాటు తమ్ముడి" మార్కు అదృశ్యమైపోయింది. మిర్యాలగూడ తెలంగాణ ఉద్యమంలో అన్నభీమోజు సైదయ్య అండ్ బ్రదర్స్ కీలక పాత్ర వహించారని ఇప్పటికే చెప్పుకున్నాం కదా. అయితే

మిర్యాలగూడ టి.పి.ఎస్. (తెలంగాణ ప్రజా సమితి) స్థాపకుల్లో అన్నభీమోజు కుటుంబం నుంచి చివరివాడైన జనార్ధనాచారి ఉన్నాడు. సీడీ నాయుడుతో కలిసి పార్టీని ఏర్పాటు చేసిన వారిలో జనార్ధనాచారి రెండోవ్యక్తి. అయితే కుటుంబ పెద్దగా సైదయ్యకు పాపులారిటీ రావడం సహజమే. జనార్ధనాచారి కుమారుడు నాగార్జునాచారి ఇప్పుడు టి.ఆర్.ఎస్. లో క్రియాశీలంగా కొనసాగుతున్నాడు. ఆయనకు అటువంటి రాజకీయ భూమికను ఏర్పాటు చేసింది మదనాచారే. అయితే కాలవశాత్తు మదనాచారి తాను సృష్టించిన అనూహ్యమైన కీర్తిని అందుకొని ముందుకు తీసుకెళ్లాల్సిన పాత్రధారులు ఆ కుటుంబంలో కరువైపోయారు.

1969 లో సిడీ నాయుడుతో కలిసి జనార్ధనాచారి టి.పి.ఎస్. ఏర్పాటు చేసినా, జైలు జీవితం తరువాత ఆ బాధ్యతలన్నీ మదనాచారి వెంట నడిచివచ్చాయి. అప్పటి వరకు అన్నభీమోజు కుటుంబంలో పెద్దన్న చెప్పిందే అంతిమ నిర్ణయం. కుటుంబ వ్యవహారాలు, వ్యాపారాలు వంటి బాధ్యతలు అన్నగారు ఎవరికి ఏది అప్పగిస్తే దాన్ని వారు పూర్తి చేసేవారు. ఈ క్రమంలో మదనాచారి ఎదుగుతున్న దశలోనే కుటుంబ బాధ్యతలు పంచుకోవడంలో మునిగిపోయాడు. 16, 17 ఏళ్ల ప్రాయంలోనే సెంట్రింగ్ వర్క్‌లోకి వెళ్లిపోయాడు. భవన నిర్మాణ రంగంలో సెంట్రింగ్ వర్క్ అనేది చాలా కీలకమైంది. ఆ రోజుల్లో మిర్యాలగూడలో సెంట్రింగ్ పనులు ప్రారంభం చేసిన, దాన్ని ఇక్కడ పరిచయం చేసిన కుటుంబం అన్నభీమోజు వంశీకులదే.

1954 నుంచి మదనాచారి జీవితాన్ని అనూహ్యమైన మలుపులు తిప్పిన 1969 వరకు దాదాపు 15 ఏళ్లపాటు ఆయన సివిల్ కాంట్రాక్ట్ పనులే చూసుకున్నాడు. సైదయ్య అప్పటికే ఎ1 కాంట్రాక్టర్‌గా ఉండడం, తమ్ముడు సెంట్రింగ్, సివిల్ వర్క్ బాధ్యతలు చూసుకుంటూ ఉండడం కారణంగా చాలా సందర్భాల్లో మదనాచారి, అన్న పురమాయించిన ఇతర కాంట్రాక్ట్ వ్యవహారాలు కూడా చక్కబెడుతూ వచ్చేవాడు. ఇది మిర్యాలగూడలో వీరిని క్లాస్ అండ్ మాస్ ప్రజానీకంలో పరిచయమే అక్కర్లేని కుటుంబంగా మార్చింది. సెంట్రింగ్ పనికోసం సుతారి పనివారు, మేస్త్రీలు, కూలీలు, అటు కాంట్రాక్ట్ వర్క్‌కు అవసరమైన కార్పెంటర్ మేస్త్రీలు, కూలీలు... వంటి శ్రామిక వర్గంతో పాటు రాజకీయ పలుకుబడి గల నాయకులందరితో ప్రత్యక్ష సన్నిహిత సంబంధాలు పుష్కలంగా ఏర్పడ్డాయి.

ఇలాంటి నేపథ్యంలో మదనాచారికి జైల్లో పరిచయమైన ఇతర ఖైదీలు, వారి సమస్యలు, వారి కుటుంబాల స్థితిగతులు ఇలా అనేక అంశాలపై అవగాహన పెరిగింది. పైగా ఆయన వెళ్లి వచ్చింది సాధారణ కేసులో కాదు. పోలీసు తుపాకులను లాక్కొని బావిలో గిరాటేసిన "అసాంఘిక" శక్తుల కార్యకలాపంగా దానికి పేరొచ్చింది. దీంతో తెలంగాణ ప్రజాసమితి పేరు ఖమ్మం తరువాత ఒక్కసారిగా మిర్యాలగూడలో మారుమోగిపోయింది. ఆ రాజకీయ వేడిని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు అప్పుడు కాంగ్రెస్, టి.పి.ఎస్. నాయకులు పోటీలు పడ్డారు. రగులుతున్న ఉద్యమ

ప్రభావం ఏమాత్రం లేదని చూపేందుకు కాంగ్రెస్, లెఫ్ట్ పోరాటాల నేపథ్యం కారణంగా తెలంగాణ ప్రత్యేక ఉద్యమం మరింత విస్తరిస్తుందని చాటేందుకు ప్రజా సమితి పోటీ పడ్డాయి. అలా అన్నభీమోజు ఫ్యామిలీ, మరీ ప్రత్యేకంగా మదనాచారి ఓ భావి రాజకీయనేతగా ఆవిర్భవించడానికి అవసరమైన అన్ని దినుసులూ ఈ విధంగా సమకూరాయి. ఇక్కడి నుంచి మదనాచారి పూర్తికాల రాజకీయ నాయకుడిగా కొత్త అవతారంలోకి మారిపోయాడు.

# 5. మదనాచారి కుటుంబ నేపథ్యం

అన్నభీమోజు సాంబయ్య సొంతూరు నల్లగొండ జిల్లాలోని కనగల్లు గ్రామం. సాంబయ్య పిల్లాపాపలతో 90 ఏళ్ళ క్రితమే మిర్యాలగూడకు వలస వచ్చాడు. సాంబయ్య భార్య కాంతమ్మ. ప్రస్తుత కనగల్లు మండలం పగిడిమర్రి నుంచి కాంతమ్మను వివాహం చేసుకున్నాడు. వారికి 10 మంది పిల్లలు. వారిలో ఐదుగురు మగ సంతానం, ఐదుగురు ఆడ సంతానం. వారి పేర్లు వరుసగా 1. లక్ష్మి, 2. జగదాంబ, 3. లలితాంబ, 4. సైదయ్య, 5. నాగభూషణం, 6. గోపయ్య, 7. కమలమ్మ, 8. మదనాచారి, 9. జనార్దనాచారి, 10. శారదాంబలు. సాంబయ్య, కాంతమ్మల 8వ సంతానమైన మదనాచారి 4వ కుమారుడిగా జన్మించాడు.



4. సైదయ్య,



5. నాగభూషణం,



6. గోపయ్య,

 

8. మదనాచారి, 9. జనార్దనాచారి,

అయితే సాంబయ్య మిర్యాలగూడ రావడానికి కారణం కనగంటి ఈశ్వరమ్మ కుటుంబం. ఈశ్వరమ్మ సాంబయ్యకు వరుసకు చెల్లెలు అవుతుంది. ఈశ్వరమ్మ భర్త కాలం చేయడంతో తనకు బాగా నమ్మకస్తుడైన సాంబయ్య సాయాన్ని అర్థించింది. ఆమె మీద ఉన్న అభిమానంతో అన్నభీమోజు సాంబయ్య అన్నీ వదులుకొని అలా 90 ఏళ్ల క్రితమే మిర్యాలగూడకు వచ్చేశాడు. వచ్చేముందు తనకున్న కొద్దిపాటి వ్యవసాయ భూమిని అన్నదమ్ములకు వదిలి వచ్చేశాడు. సాంబయ్య వృత్తి వడ్రంగం పని. ఆయన కనగల్లులో ఉన్నప్పుడే ముగ్గురు ఆడపిల్లలు పుట్టారు. మిగతా ఏడుగురు పిల్లలు మిర్యాలగూడలో పుట్టినవారే.

ఈశ్వరమ్మకు పెళ్లైన కొద్దికాలానికే భర్త చనిపోవడం. దాంతో తనకు పిల్లలు లేకపోవడంతో అన్నభీమోజు రాములును దత్తత తీసుకుని పెంచుకుంది. అయితే రాములు చాలా చిన్నవాడు. ఇంకా పని చేయడానికి ఎదగని లేలేత వయసు.

ఆ రోజుల్లో నిజాం నవాబు వ్యవసాయ వృత్తులైన వడ్రంగం,

కమ్మరం చేసేవారికి భూములు ఇనాంగా ఇచ్చేవాడు. ఆ భూముల్లో వారి పోషణ కోసం వ్యవసాయం చేసుకుంటూ ఏయే ఊళ్లకు రైతు పనులు చేయాలో అధికారికంగా ఆదేశించేవారు. ఆయా ఊళ్లన్నింటికీ రైతుల వ్యవసాయ పనులన్నీ వీరే చేసేవారు. గ్రామంలోని ప్రజల ఇళ్లకు ముగ్గులు పోయడం, తలుపులు, దర్వాజాలు చేయడం, ఇళ్లలో అవసరమైన వస్తు సామాగ్రులు తయారు చేసి వారి అవసరాలు తీర్చడం వృత్తిధర్మంగా ఉండేది. ఈ క్రమంలో ఈశ్వరమ్మ కుటుంబానికి కూడా నిజాం నవాబు నుంచి వ్యవసాయ భూమి ఇనాంగా దక్కింది. అయితే ఇనాంగా వచ్చిన భూముల్లో పనులు చేయించడం, ఈశ్వరమ్మ కుటుంబ, ఆస్తి వ్యవహారాలు చక్కబెట్టేందుకు సాంబయ్యను ఆశ్రయించడంతో ఆ భూములు, వృత్తి పనులపై సాంబయ్యకు హక్కు (వతన్) సంక్రమించింది. ఆ విధంగా ఈశ్వరమ్మ వెంట సాంబయ్య కుటుంబం మిర్యాలగూడకు చేరుకుంది.

తొలుత మిర్యాలగూడలో ఈశ్వరమ్మ ఇంటి ఎదురుగా ఉన్న ఒక ఇంట్లో సాంబయ్య కుటుంబం నివాసం ఉండేది. ఆ పక్కనే ఆంజనేయస్వామి దేవాలయం ఇప్పటికీ ఉంది. సాంబయ్య ఉన్న ఇంటిని కూడా ఊరి పెద్ద ఇనాంగానే ఇవ్వడం జరిగింది. ఆ కాలంలో ఒక ఊరి అవసరాలు తీర్చేందుకు విశ్వబ్రాహ్మణుల ఆవశ్యకత ఎంత ఉండేదో సాంబయ్య ఉదంతమే చిన్న ఉదాహరణ. మిర్యాలగూడ లాంటి ఒక పెద్ద గ్రామం అవసరాలు తీరాలంటే ప్రజలందరికీ కావలసిన అన్ని పనులు బాగా వచ్చి ఉన్న వృత్తి

నిపుణుల అవసరం ఉండేది. విశ్వబ్రాహ్మణుల వృత్తి పనులే గ్రామ సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడేవి. అందుకే ఈశ్వరమ్మ తనకు వచ్చిన అవకాశాన్ని వదులుకోకుండా నమ్మకస్తుడైన సాంబయ్యను వెంటపెట్టుకొని మిర్యాలగూడకు రావడం జరిగింది.

ఇనాంగా వచ్చిన ఆ ఇంటి తరువాత మరో ఏడేళ్ళకు సీతారాంపురంలో సొంతంగా కొంత భూమిని కొనుగోలు చేసి తనకు నచ్చిన విధంగా ఇల్లు కట్టుకున్నాడు సాంబయ్య. సాంబయ్య కనగల్లులో ఉన్నప్పుడే ముగ్గురు ఆడపిల్లలకు పెళ్లిళ్ల అయిపోయాయి. అప్పట్లో 12 ఏళ్లు దాటకుండానే అమ్మాయిల పెళ్లిళ్లు చేసేవారు. ఆ ముగ్గురి తరువాత మిర్యాలగూడలో పెద్దకుమారుడైన సైదయ్య పెళ్లి జరిగింది. గడగోజు లక్ష్మయ్య మూడో సంతానం అయిన సక్కుబాయితో సైదయ్య పెళ్లి జరిగింది. అప్పట్లో ఇప్పటిలాగా మోయలేని కట్నకానుకల భారం ఉండేది కాదు. ఆడపిల్లల తల్లిదండ్రులు పెళ్లి ఖర్చులు భరించి లాంఛనాలతో సాగనంపేవారు. సైదయ్యది అలాగే కట్నం లేకుండా జరిగింది. ఆ తరువాత కమలమ్మ వివాహం రథం సత్యనారాయణతో, నాగభూషణం వివాహం లలితాంబతో, తరువాత గోపయ్య పెళ్లి లింగమ్మతో జరిగింది. ఆ తరువాత సాంబయ్య ఆఖరు కూతురు శారదాంబ, కొడుకు మదనాచారిల వివాహం కొప్పోజు వీరయ్యగారి కొడుకు కృష్ణమూర్తి, కూతురు ధనమ్మతో కుండమార్పిడి పద్ధతిలో ఒకేసారి జరిగాయి. ఆ తరువాత

దాదాపు నాలుగేళ్లకు 1963లో జనార్ధనాచారి పెళ్లి పగటిమర్రి జోగయ్యగారి మొదటి సంతానం అయిన గోవిందమ్మతో జరిగింది. జనార్ధనాచారి పెళ్లి జరిగేనాటికే సాంబయ్య కాలధర్మం చెందాడు. ఈ ఒక్కటి మినహా మిగతా పెళ్లిళ్లన్నీ సాంబయ్య చేతుల మీదుగానే జరిగాయి. సాంబయ్య 1961 లో స్వర్గప్రాప్తి పొందాడు.

సాంబయ్య తరువాత కుటుంబ బాధ్యతలన్నీ సైదయ్యే తీసుకున్నాడు. ఉమ్మడి హిందూ కుటుంబంలో పెద్ద కుమారుడు పోషించే బాధ్యతను సైదయ్య సంపూర్ణంగా తలకెత్తుకున్నాడు. తండ్రి మొదటి సంవత్సరీకం వరకు బంధువుల రాకపోకలు, ఊరి పెద్దల పలకరింపులు, వారి పరామర్శలతో ఆ ఏడాది కాలమంతా విషాదపు ఛాయల్లోనే గడచిపోయింది.

ప్రథమ సంవత్సరీకం పూర్తయ్యాక అన్నభీమోజు కుటుంబం ఆధ్వర్యంలో ఉమ్మడిగా ఓ టింబర్ డిపోను ప్రారంభిచారు. అది ఇప్పుడు పాత బస్టాండు ఎదురుగా ఉన్న ముక్కా భిక్షమయ్య బట్టల షాపులో ఉండేది. 1965 వరకు ఆ టింబర్ డిపోనే అన్నభీమోజు కుటుంబానికి ఆధారంగా ఉండేది. అన్నదమ్ములు ఐదుగురు కలిసి వ్యాపార వ్యవహారాలన్నీ చక్కబెట్టుకునేవారు. కుటుంబ బాధ్యతలు మోస్తున్న సైదయ్యపై మిగతా నలుగురికీ అమితమైన గౌరవం ఉండేది. సైదయ్య అందరికీ సమాన ప్రాధాన్యత ఇచ్చేవాడు. అన్న అప్పగించిన పనిని తమ్ముళ్లంతా శ్రద్ధతో చేసేవారు. అలాంటి ఉమ్మడి కుటుంబాల గురించి ఇప్పుడు చెప్పుకుంటే అదొక ప్రపంచ

వింతగా గోచరిస్తుందంటే అతిశయోక్తి కాదు.

ఆ రోజుల్లోనూ అన్నదమ్ములకు పొసగక విడిపోయిన కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. కానీ ఉమ్మడి కుటుంబాలు కూడా ఆ కాలంలోనే ఎక్కువగా ఉన్నాయి. ఇప్పుడు అలాంటి ఉదాహరణలు చాలా అరుదు. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ ఆప్యాయతలు ఉంటే చాలు. అదే అన్ని వ్యవహారాలను చక్కబెట్టేది. ఎవరికి ఏ రంగంలో ఆసక్తి ఉందో, ఏ పనులు ఎవరు సులువుగా, కష్టం లేకుండా చేయగలరో అలాంటి పనులనే ఆ కుటుంబ పెద్దలు అప్పగించేవారు. అందువల్ల ఎలాంటి పనులైనా, ఎంత క్లిష్టమైనవి అయినా సానుకూలంగా పూర్తయ్యేవి. కుటుంబ సభ్యుల మధ్య అనురాగంతోనే వంశాభివృద్ధి జరిగేది. అలాంటి కుటుంబాలు ఆయా గ్రామాల్లో అనుసరణీయాలుగా చెప్పుకునేవారు. మిగతా ఊరంతా సైదయ్య కుటుంబం గురించి, ఆయన పోషించిన పాత్ర గురించి, ఫలితంగా అది ఎదిగిన క్రమం గురించి ఒక నమూనాగా చెప్పుకునేవారు. కుటుంబంలో ఏ ఒక్కరికి సమస్య వచ్చినా అది ఆ కుటుంబ సమస్యగా భావించేవారు. అందువల్ల ఎంతటి జటిలమైన సమస్య అయినా ఉమ్మడి కుటుంబం యొక్క బలం ముందు ఆ సమస్యలు చాలా చిన్నవైపోయేవి. కుటుంబ కట్టుబాటే దానికి శ్రీరామ రక్షగా నిలిచేది.

ఏడాది తిరిగే సరికి మొదటి టింబర్ డిపోకు తోడు మరో టింబర్ డిపో వెలసింది. మొదటిదాని వెనకాల టాకా రోడ్‌లో సిక్కులు ఉండే వీధిలో "వేంకటేశ్వర టింబర్ డిపో" ను ఏర్పాటు

చేశారు. ఇప్పుడక్కడ జేసీ భవన్ కాంప్లెక్స్ నిర్మించారు. కొత్త డిపో బాధ్యతలను అందరికంటే చిన్నవాడైన అన్నభీమోజు జనార్ధనాచారికి అప్పగించారు. ఆ మరుసటి సంవత్సరమే అంటే 1966 లో ఇప్పుడున్న జేసీ భవన్ పక్కనే మరికొంత స్థలం తీసుకున్నారు. అప్పటికే అన్నభీమోజు ఫ్యామిలీకి ఉన్న ఐరన్ ఇంజినీరింగ్ వర్క్‌షాప్‌ను అక్కడ ఏర్పాటు చేసి దానికి వేంకటేశ్వర ఇంజినీరింగ్ వర్క్‌షాప్‌గా నామకరణం చేశారు. దాని నిర్వహణ బాధ్యతలను నాగభూషణంకు అప్పగించారు. ఇక్కడితో అన్నభీమోజు విజయాల పరంపర ఆగిపోలేదు. పాత బస్టాండ్ ఎదురుగా ఏర్పాటు చేసిన తొలి టింబర్ డిపోను తొలగించి ఆ స్థలంలో రెండు షాపులు కట్టించారు. అందులో ఒకదాంట్లో ఐరన్ & హార్డ్‌వేర్ షాపును ప్రారంభించారు. ఆ షాపు యొక్క బాధ్యతలను సైదయ్యే స్వయంగా చూసుకునేవాడు.

ఇక్కడ కీలకమైన విషయం చెప్పుకోవాలి. ఒక కుటుంబం ఎదుగుదలకు ఆ కుటుంబ ఐక్యత, సభ్యుల మధ్య పరస్పర అనురాగాలు ఎంత అవసరమో కొంత మంది బయటి వ్యక్తుల సహకారం కూడా అంతే అవసరం. అలాంటి కనీసం కొంతమంది బయటివారి సహకారం, ప్రోద్బలం లేకుండా ఏ ఒక్క కుటుంబం కూడా ఎదగజాలదు. ఇదే సమాజ పురోగతికి ఉండే అద్భుతమైన లక్షణం.

కొంతమంది తమ ఎదుగుదలకు తాము మాత్రమే కారణం అనుకుంటారు. అందిపుచ్చుకున్న ఆపన్నహస్తాల తోడ్పాటును

కనీసం ఉచ్చరించరు. అది వేరే విషయం. అయితే సైదయ్య ఎదుగుదలలో తోడ్పాటును అందించిన ఒక మూడు కుటుంబాల గురించి కూడా చెప్పుకోవడం ఉచితంగా ఉంటుంది. సైదయ్య శ్రమజీవన సౌందర్యం, ఆయన పలుకుబడి, నీతి నిజాయతీలతో పాటు ఆయన బావమరిది గడగోజు భిక్షపతి, వైశ్య వర్గం నుంచి మిర్యాలగూడలో బడా సేఠ్‌గా చెప్పుకునే కర్నాటి రత్నయ్య, రెడ్డి వర్గం నుంచి అనిరెడ్డి రాఘవరెడ్డి, ఈ ముగ్గురూ సైదయ్యకు, ఆయన కుటుంబానికి ఎల్లవేళలా వెన్నంటి ఉన్నారు. ఈ నలుగురూ మిర్యాలగూడ ప్రముఖుల్లో నాలుగు స్తంభాలుగా పేరు సంపాదించుకున్నారు. ఒకరి మాట ఒకరు తీసేవారు కాదు. ఒక కొత్త వ్యాపారం కలిసి ప్రారంభం చేయాలన్నా, మరో దాంట్లో భాగస్వామిగా చేరాలన్నా వారిలో ఏ ఇద్దరు అనుకున్నా జరిగి పోయేది. గడగోజు భిక్షపతి గురించి ఈ రోజుకైనా తెలియని వారు ఉండరు. కలప, స్టీల్, సిమెంట్ వ్యాపారంలో బాగా పేరున్న కుటుంబం. అలాగే భాగస్వామ్యాల మధ్య వ్యాపార సూత్రాల విషయంలో నైతిక విలువలు పాటించేవారు. భాగస్వామ్యంలో వ్యాపారం చేసినా, భాగస్వామ్యం విడిపోయినా వ్యక్తిగత, కుటుంబ బంధాలు దూరం కాకుండా చూసుకునేవారు. ఇప్పటిలాగా వ్యాపారం కోసం దగ్గరవ్వడం, వ్యాపారం రద్దయిపోతే పరిచయమే లేనట్టు యాంత్రికంగా ఉండిపోవడం జరిగేది కాదు.

అలాగే మిత్రులలో ఒకరు చేసే వ్యాపారంలో మరొకరు ఎంటర్ అయ్యేవారు కాదు. మిత్రుడు సక్సెస్ బాటలో కొనసాగితే





**నాగార్జున సాల్వెంట్ ప్రారంభోత్సవం, ప్రారంభకులు**
**గౌ॥ మోహన్‌లాల్ సుఖాడి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్**

ఆ సక్సెస్‌ను ప్రభావితం చేసే ఏ నిర్ణయమూ తీసుకునేవారు కాదు. అందుకే వారి స్నేహ సంబంధాలు అంత పటిష్టంగా ఉండేవి. ఇలాంటి పటిష్టమైన స్నేహ సంబంధాల వల్లే గడగోజు భిక్షపతి 1976లో నాగార్జున సాల్వెంట్ ఆయిల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్





**నాగార్జున సాల్వెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంతీయ సంఘాధ్యక్షులు శ్రీ సి జగన్నాథ రావు గారు, కార్మిక మంత్రి శ్రీ టి. అంజయ్యగార్లతో**

లిమిటెడ్‌ను స్థాపించగలిగారు. దాని ప్రారంభోత్సవానికి నాటి గవర్నర్ కీ.శే. మోహన్‌రావు సుఖాడియా హాజరయ్యారు. ఆయనే కంపెనీని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. నాటి కార్యక్రమానికి



**మిర్యాలగూడలో 'రాజీవ్ భవన్' ప్రారంభోత్సవం**
**కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా బిల్డింగ్ ప్రారంభించారు.**

ఆచారితో పాటు తనకు ఆప్తుడైన అప్పటి కార్మికశాఖ మంత్రి టి. అంజయ్య, అప్పటి కాంగ్రెస్ ప్రముఖ నాయకుడు సి. జగన్నాథరావు హాజరయ్యారు. మరో విశేషమేంటంటే మిర్యాలగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కూడా గడగోజు భిక్షపతి కట్టించారు.

ఇక కర్నాటి రత్నయ్య ఆ రోజుల్లో నల్లగొండ జిల్లాలోనే కాకుండా ఇతర జిల్లాలకూ తన వ్యాపార కార్యకలాపాలు విస్తరించిన బడా సేఠ్. ఆర్యవైశ్య సమాజంలో అత్యంత ప్రముఖుడిగా ఉన్నారు. రైస్ మిల్లులు, ఇతర వ్యాపార వర్గాలు ఆయన కనుసన్నుల్లో మెలిగేవారు. రాజకీయ నాయకుల కార్యక్రమాలను కూడా నిర్దేశించే స్థాయికి ఎదిగారు రత్నయ్య.

ఇక అనిరెడ్డి రాఘవరెడ్డిది పేరుమోసిన జమీందారీ కుటుంబం. అప్పట్లో వంద ఎకరాలకు పైనే ఉండేది. మిర్యాలగూడలో భూస్వాముల కుటుంబంగా అనిరెడ్డి ఫ్యామిలీ గురించే చెప్పుకుంటారు.

ఇలా మిర్యాలగూడలోని ప్రముఖమైన ముగ్గురు వ్యక్తులతో కలిసి వారి బృందంలో ఒకడిగామారి వారితో సమాన సామాజిక స్థాయిని, గుర్తింపును అందుకున్నాడు సైదయ్య. వీరంతా ఒకే బళ్లో చదువుకోవడం విశేషం. అందుకే ఆ మూడు కుటుంబాలకూ అన్నభీమోజు ఫ్యామిలీలో ఆ కృతజ్ఞత, గర్తింపు ఇప్పటికీ ఉండడం విశేషం. ఇక్కడ ఆసక్తికరమైన ఇంకో విషయం కూడా చెప్పుకోవాలి. మిర్యాలగూడలో అప్పటికే ఉన్న పాత టాకీసులో గడగోజు భిక్షపతి సోదరుడు జనార్ధనాచారి బాధ్యతలు చూసేవాడు. అయితే ఓ సందర్భంలో జనార్ధనాచారి మనసు చివుక్కుమంది. ఆయన ఇగో దెబ్బతింది. దీంతో ఆ విషయాన్ని అన్న భిక్షపతికి చెప్పుకుంటే అదే క్షణం ఈ మిత్రులంతా కలిసి ఓ కొత్త టాకీసు కట్టాలని నిర్ణయించుకున్నారు. వెంటనే పనులు మొదలుపెట్టారు. అలా ఏర్పడిందే శ్రీనివాస టాకీస్.

తమ మిత్రుని ఇగోను సంతృప్తిపరచడం కోసం మిగతా ముగ్గురు కూడా గడగోజు భిక్షపతి ప్రతిపాదనకు ఓకే చెప్పారు. వెంటనే ఆ బాధ్యతను ఆచారికి అప్పగించారు. మిర్యాలగూలో పోటీగా మరో టాకీస్ ఎలా ఉండాలంటే మంచి నమూనా, అద్భుతమైన ఆడియో, అప్పుడున్న టెక్నాలజీని ఉపయోగించుకొని

సర్వహంగులతో కట్టాలని అనుకున్నారు. ఇందుకోసం ఆచారి మేలైన టాకీస్‌లను పరిశీలించి రావడానికి హైదరాబాద్‌తో పాటు ముంబై, చెన్నైలలో కూడా పర్యటించి వచ్చాడు.

శ్రీనివాస్ టాకీస్ ఆచారి చేతుల మీదుగానే దాదాపుగా రెండేళ్లకు పూర్తయింది. అది పూర్తిగా ఆచారి అభిరుచి మేరకేరూపు దాల్చింది అని చెప్పుకోవాలి. టాకీస్ ఆరంభం అదిరిపోయేలా జరిగింది.

ఆనాటి కాంగ్రెస్ ప్రముఖులంతా ప్రారంభానికి హాజరయ్యారు. హాల్లోనే తన కార్యకలాపాల కోసం ప్రత్యేకంగా ఓ గదిని తయారు చేయించుకున్నాడు ఆచారి. ప్రముఖులకు మర్యాదలు అక్కడే జరిగేవి. చిన్న చిన్న సమావేశాలు కూడా నిర్వహించుకునేవారు. ఇలా కొద్దికాలం పోయాక ఆ టాకీస్‌ను తానే నడుపుకోవాలని ఆచారి భావించాడు. కానీ సీడీ నాయుడు తాను టేకొవర్ చేస్తానని ముందుకు రావడంతో సైదయ్య, ఆచారి, భిక్షపతి, రాఘవరెడ్డి కూడా అందుకు సమ్మతించారు. వారి గ్రూపులో ఎవరు ఎలాంటి ప్రపోజల్ పెట్టినా అంగీకరించే సంప్రదాయం వారికి ఉండేది. శ్రీనివాస టాకీసు సీడీ నాయుడు చేతుల్లోకి వెళ్లిపోయింది. ఆ తర్వాత అనిరెడ్డి రాఘవరెడ్డి తనకంటూ ఒక టాకీసు ఉండాలనిపించడం, ఆ ఆలోచనను భిక్షపతి, రత్నయ్య, సైదయ్యకు చెప్పడం.. ఆ వెంటనే సైదయ్య, ఆచారి నిర్మాణానికి ముందుకు రావడం జరిగిపోయాయి. ఫలితంగా అనిరెడ్డి ఆకాంక్ష మేరకు మిర్యాలగూడ తాలూకలోనే అతిపెద్ద టాకీసు ఆవిర్భావం

జరిగిపోయింది. అలా రూపుదిద్దుకుందే శకుంతల టాకీస్.

అలా వృత్తి, వ్యాపారాలన్నీ ఇంతకు నాలుగింతలై అన్నభీమోజు వంశం పేరు ప్రతిష్టలు మిర్యాలగూడలోనే గాక నల్లగొండ జిల్లాలోనూ వ్యాపిస్తున్న దశ అది. ఈ క్రమంలోనే వ్యాపార కార్యకలాపాలు ఇతరుల భాగస్వామ్యం వైపు కూడా విస్తరించాయి. 1968లో ఇప్పటి శకుంతల టాకీస్ రోడ్డులో, రెడ్డికాలనీకి వెళ్లే దారిలో మరో టింబర్ డిపో తెరిచారు. దాసోజు మదనాచారి, కర్నాటి రత్నయ్యలతో కలిసి అన్నభీమోజు కుటుంబం విజయలక్ష్మి టింబర్ డిపోను ప్రారంభించారు. కొంత కాలానికి ఆ ఇద్దరు భాగస్వాములు తమ వాటాలు ఉపసంహరించుకోవడంతో అది అన్నభీమోజు వారికి సొంతమైపోయింది. దాని నిర్వహణ బాధ్యతలను గోపయ్యకు అప్పగించారు.

*　　*　　*

ఇలా ఐదుగురు అన్నదమ్ముల్లో నలుగురు నాలుగు వ్యవహారాల బాధ్యతలు తీసుకున్నారు. మిగిలింది మదనాచారి. ఈయనకు ప్రత్యేకంగా ఫలానా షాపు బాధ్యత, ఫలానా పని అనే పరిమితి లేకుండా అన్ని వ్యవహారాల్లో పెద్దన్న సైదయ్యకు తోడుగా ఉంటూ బయటి వ్యవహారాలు, కాంట్రాక్టు పనుల నిర్వహణ బాధ్యతలు చూసుకునేవాడు. దీంతో మదనాచారికి సంఘ జీవన వ్యవహార శైలి అలవడింది. ఎ1 కాంట్రాక్టు పనులకు టెండర్లు

వేసి దక్కించుకునే సైదయ్యకు, మదనాచారి కుడి భుజంగా మారాడు. పనులు, బాధ్యతలు వేర్వేరుగా అన్నదమ్ములు నిర్వహిస్తున్నా ఆస్తులు, వ్యవహారాలు అన్నీ ఉమ్మడిగానే నడుస్తున్నాయి. అన్నభీమోజు కుటుంబ చరిత్రలో ఇది చాలా ముఖ్యమైన విషయం.

ఇలా నడుస్తున్న క్రమంలో, సైదయ్య తమ్ముడిగా అందరి తలలో నాలుకలా అన్ని వ్యవహారాలు చక్కబెట్టుకొస్తూ, సమాజంలో తనదైన ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న క్రమంలో 1969 నాటి మిర్యాలగూడ కాల్పుల ఘటన జరిగింది. ఈ సంఘటనతో అప్పటి వరకు ఉన్న మదనాచారి వేరు. ఆ ఘటన తరువాత మదనాచారి ప్రొఫైల్ వేరుగా మారిపోయాయి. 1969 తెలంగాణ తొలి ఉద్యమం నాటి కాల్పుల ఘటనతో ఒక్కసారిగా మదనాచారిలోని రెండో పార్శ్వం బయటికొచ్చింది.

# 6. కొందరికి మదనాచారి- అందరికీ ఆచారి

మదనాచారిలోని రెండో పార్శ్వం ఇవాళ కొత్తగా ఆవిర్భవించిందేమీ కాదు. అది ఆయన పుట్టుకతోనే బీజరూపంలో ఉన్నదే. ఎలాగంటే గ్రీష్మంలో చెట్ల నుంచి రాలిన గింజలు గాలి దుమారానికి ఎగిరిపోయి ఎక్కడెక్కడి భూమిపొరల్లోనో అచేతనంగా కూరుకుపోయి, వర్షరుతువు రాగానే తొలకరి జల్లుచేత ప్రాణమొచ్చి మొలకెత్తినట్టు మదనాచారిలోని ఆ ప్రత్యేక లక్షణాలు 1969 ఘటనతో బయటపడ్డాయి. ఆ నాయకత్వ లక్షణాలేవీ తనకు అంతకు ముందు లేనివి కాదు. అయితే 1969 వరకు ఒక సాధారణ మనిషిలా, ఊళ్లో పలుకుబడి గల కుటుంబం నుంచి వచ్చిన మోతుబరి చేష్టలకు మాత్రమే పరిమితమయ్యాయి. ఆ ఘటనతో జైలు నుంచి బయటికొచ్చిన తరువాత ఆచారి నడక రాజకీయాలవైపు కొనసాగింది. అందుకే 1969కి ముందున్న మదనాచారి వేరు. ఆ తరువాత కనిపించిన ఆచారి వేరు.

అన్నభీమోజు మదనాచారి, మదనాచారిగా చాలా కొద్ది మందికే తెలుసు. ఆయన ఆచారిగానే అందరి హృదయాల్లో నాటుకుపోయాడు. ఆచారి అనే పేరు స్థిరం కావడానికి ఓ ఆసక్తికరమైన నేపథ్యం ఉంది.

తండ్రి అన్నభీమోజు సాంబయ్య మదనాచారిని చాలా ప్రత్యేకంగా పెంచాలనుకున్నాడు. అన్నభీమోజు కుటుంబం నుంచి అన్ని పనులూ చేయగలిగిన నైపుణ్యం ఉన్నవాడిగా తయారు చేయాలనుకున్నాడు. ఐదుగురు కొడుకుల్లో కనీసం ఒకరినైనా పౌరోహిత్యం వైపు నడిపించాలనుకున్నాడు. అందుకోసం ఆయన మదనాచారిని ఎంచుకున్నాడు. ఆయన రూపురేఖలు ముఖవర్చస్సు, గ్రహణ శక్తి, వాక్కులో ఉండే ఆకర్షణలను అంచనా వేసి 4వ కుమారుడైతే అందుకు సరిగ్గా సరిపోతాడని ఎనిమిదో ఏట వడుగు చేయించి ఓ విశ్వబ్రాహ్మణ పండితుడి వద్దకు శిష్యరికానికి పంపాడు. తండ్రి మాట మీద వెళ్లనైతే వెళ్లాడు గానీ, ఆ అబ్బాయికెందుకో అది రుచించలేదు. అక్కడి ఆచార వ్యవహారాలు, వేదపాఠశాలలో ఉండే నియమాలు, గురువు నిర్దేశించే ఆధ్యాత్మిక జీవనాపథం ఆయన్ని ఆకట్టుకోలేకపోయాయి. వేదాధ్యయనం కోసం ఇంటినుంచి వెళ్లిన 3, 4 నెలలకే తిరిగి ఇంటికి వచ్చేశాడు. ఒకవేళ ఆయన అక్కడే ఒక రెండేళ్లయినా ఉండి ఉంటే గనక మదనాచారి చరిత్రను మరోకోణంలో చెప్పుకునేవాళ్ళం. కానీ విధి చాలా బలీయమైనది కదా. దాన్ని ఎవరూ తప్పించజాలరు. దాన్నుంచి ఎవరూ తప్పించుకోనూ లేరు.

అద్భుతమైన శిల్పం చెక్కాలని శిల్పాచార్యుడు కూర్చున్నంత మాత్రాన శిల్పం తయారైపోతుందా? తండ్రి చెక్కాలనుకున్న ఓ అద్భుతమైన శిల్పం ఆకృతి దాల్చకుండానే వేదపాఠశాల నుండి శిల శిలగానే బయటకు వచ్చేసింది. కానీ ఆచారి అనే పేరు

మాత్రం స్థిరపడిపోయింది. ఏనాడూ ఆయన అర్చకత్వం చేయకపోయినా, ఆచార విధులు నిర్వహించకపోయినా ఆజీవన పర్యంతం ఆచారిగానే పిలువబడ్డాడు. చిన్నప్పుడే "ఆచారి" అయిపోయాడు. విశ్వబ్రాహ్మణులలో 'ఆచారి' అనే సమానంతర శబ్దం వారికి వంశ పారంపర్యంగా, యుగయుగాలుగా వస్తున్నదే.

ఆచారిది చాలా నిండైన విగ్రహం. ఎత్తు ఆరడుగుల పైనే ఉంటాడు. ఎత్తుకు తగిన విశాలమైన దేహం చామనఛాయతో చాలా ప్రత్యేకంగా కనిపిస్తాడు. ఆయన గుంపులో ఉన్నా, ఒంటరిగా ఉన్నా అందరి చూపులూ ముందుగా పడేది ఆయన మీదనే. ఆయనవెంట ఎంత పెద్ద లీడర్ ఉన్నా, ఆయన ఎంత పెద్ద లీడర్ వెంట వెళ్లినా ప్రథమ సత్కారం దక్కేది ఆయనకే. అలాంటి ఆకట్టుకునే రూపం కనుకనే బయట పనులన్నీ అవలీలగా పూర్తయిపోతూ ఉండేవి. ఆయనది కేవలం ఆకారమే అనుకుంటే పొరపాటే. స్నేహితులు, బంధువులు, కుల సంఘాల పట్ల ఎంత హృదయ వైశాల్యం ఉండేదో అవసరమైతే పది మందికైనా సమాధానం చెప్పేంత ధీశాలి, ధైర్యశాలి కూడా. ఆయనది పార్టీలకు అతీతమైన వ్యక్తిత్వం. సిద్ధాంతాలకు అతీతమైన వ్యవహారం. వ్యక్తులు, వ్యక్తుల్లోని మంచితనానికే విలువ ఇచ్చేవాడు తప్ప సైద్ధాంతిక నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకొని సంకుచితంగా ప్రవర్తించే నైజం కాదు.

* * *

1961 లో మిర్యాలగూడలో మిలిటరీ క్యాంపు జరుగుతోంది. అప్పటికే పాకిస్థాన్ విద్రోహ బుద్ధి బయటపడింది. చైనా నమ్మించి వంచిస్తోంది. వాటితో యుద్ధం జరిగే సూచనలు కనబడుతున్న క్రమంలో దేశవ్యాప్తంగా నూతన సైనికుల రిక్రూట్‌మెంట్ కోసం సన్నాహాలు జరుగుతున్నాయి. మిర్యాలగూడలో కూడా క్యాంపు జరుగుతోంది. సాహసోపేతమైన పనులు చేయాలని, దేశం కోసం పని చేయాలనే తపన ఆచారికి మెండుగా ఉండేది. అందులో భాగంగా మిలిటరీ క్యాంపులో చేరి సైనిక శిక్షణ తీసుకున్నాడు. అప్పటికే ఆచారికి పెళ్లయినా మిలిటరీకి వెళ్లడానికి నిర్ణయం తీసుకున్నాడు. అందుకోసం మిలిటరీ అధికారులు నిర్వహించే ట్రైనింగ్‌కి వెళ్లాడు. అందులో ఆయన చూపించే శ్రద్ధ, అంకితభావం క్యాంపు నిర్వహించే సైన్యాధికారికి నచ్చాయి. ఆ గ్రూపుకి ఆచారిని లీడర్‌ని చేశాడు. దేహ దారుఢ్య పరీక్షల్లో నెగ్గేందుకు అభ్యర్థులకు ఇచ్చే టాస్కులను ఆచారి ద్వారా పూర్తి చేయించేవాడు.

సిక్కు జాతీయుడైన ఆర్మీ ఆఫీసర్ బల్వీందర్‌సింగ్‌కి మదనాచారి బాగా నచ్చాడు. ఆచారికన్నా ముందే సైదయ్యతో బల్వీందర్‌కు మంచి స్నేహం ఏర్పడింది.ఆచారి అంకిత భావం, ధైర్యసాహసాలు, దేశభక్తి వంటి అంశాలన్నీ బల్వీందర్‌కు బాగా నచ్చాయి. అందుకే ఆచారికి గన్ లైసెన్స్ ఇప్పించడంలో చొరవ చూపాడు. లైసెన్స్‌తో పాటు ఒక రివాల్వర్ కూడా తెప్పించి ఇచ్చాడు. ఆచారి లాంటి వ్యక్తికి లైసెన్స్‌డ్ తుపాకి ఉండాలని

ఎందుకనిపించిందో ఎవరికీ తెలీదు. భారీ కాయంతో, గుబురు మీసాలతో, ఆదేశించే స్వరంతో, పూర్తి ఆత్మవిశ్వాసం తొణికిసలాడే ఆచారికి తుపాకీ కూడా చేతికి వస్తే ఎలా ఉంటుందో ఎవరైనా ఊహించుకోవాల్సిందే.

* * *

కొద్ది నెలల ట్రైనింగ్ తరువాత ఆచారి తుపాకీ కాల్చడంలో నైపుణ్యం సంపాదించాడు. ఆ నైపుణ్యం ఎంతటిది అంటే ఎగిరే పక్షిని గురిచూసి కొట్టడం, పరుగెత్తుతున్న అడవి కుందేలును గురి తప్పకుండా నేల కూల్చడం వంటివి అలవోకగా అబ్బినాయి. ఇలాంటి షార్ప్ షూటర్లు చాలా తక్కువ మందే ఉంటారు. అందుకే ఆచారి అంటే బల్వీందర్ సింగ్‌కు తెగ నచ్చేశాడు. ఆచారిపై అమితమైన ప్రేమ, ప్రత్యేకమైన అభిమానం ఏర్పడ్డాయి.

గన్ లైసెన్స్ తీసుకోవాలి అంటే జిల్లా ఎస్పీ పర్మిషన్, స్థానిక ఎమ్మెల్యే లేదా ఎంపీ సిఫారసు లాంటివి చాలా అవసరం. అయితే ఆచారికి అవన్నీ అవలీలగా జరిగిపోయాయి. 1961 లోనే 12 బ్యారెల్ లైసెన్స్‌డ్ గన్ ఆచారి చేతికొచ్చింది.

**ఆ రోజుల్లో తుపాకీ పట్టుకోవడం మామూలు విషయం కాదు. జిల్లా మొత్తంలో చూస్తే ఏ కొద్దిమంది భూస్వాముల దగ్గర మాత్రమే ఉండేది. అలాంటి సమయంలో ఆచారి లైసెన్స్‌డ్ గన్**

**పొందడం ఆచారి కుటుంబానికి ఉండే పరపతికి తిరుగులేని నిదర్శనం.**

ఓసారి ఆచారి, ఆయన అనుచరుడు కోదాడ వెళ్లి వస్తుండగా నమ్మశక్యం కాని ఓ సంఘటన జరిగింది. ఆయన ఎంత బలవంతుడో, ఎంత ధైర్యశాలియో చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ మాత్రమే.

వారు వెళ్తున్న బుల్లెట్ బండికి అతి సమీపం నుంచి పూర్తి లోడు గల లారీ ఓవర్ టేక్ చేస్తూ వెళ్లిపోయింది. వెంట్రుకవాసిలో ఘోర ప్రమాదం తప్పింది. అంత సమీపం నుంచి, అత్యంత ప్రమాదకరంగా లారీ నడిపిన డ్రైవర్ మీద పట్టరాని కోపమొచ్చింది ఆచారికి. అప్పటివరకు అనుచరుడితో కబుర్లు చెబుతూ నిదానంగా నడుపుతున్న ఆచారి ఒక్కసారిగా యాక్సిలేటర్ వెనక్కి తిప్పాడు. కళ్లెం లాగి వదిలిన గుర్రంలా జావా బండి గుడ.. గుడ.. గుడ.. గుడ.. శబ్దం చేస్తూ మూడు నిమిషాల్లో ఓవర్‌టేక్ చేసింది. లారీని ఛేజ్‌చేసి ముందుకెళ్లిన ఆచారి లారీకి అడ్డంగా బుల్లెట్‌ను తిప్పేశాడు. రోడ్డుకు అడ్డంగా నిలిపి సెంటర్ స్టాండ్ వేశాడు. బుల్లెట్ మీద అచ్చం భీమసేనుడిలా కనిపిస్తున్నాడు అనుచరుడికి. ఆయన చేతిలో ఉన్న రైఫిల్ కాటేయడానికి సిద్ధంగా ఉన్న నాగుపాములా ఉంది. ఇప్పుడేం జరుగుతుందో, ఆచారి ఏం చేస్తాడోనని ఊపిరి బిగపట్టి గమనిస్తున్నాడు. అటువైపు నుంచి లారీ వేగంగా వస్తోంది. లారీ డ్రైవర్‌కి రోడ్డు మీద అడ్డంగా

కనిపిస్తున్న దృశ్యం  అర్థం కాలేదు. కాసేపటికే తెలిసొచ్చింది వాడికి ఇంతకు ముందే తాను ఓవర్‌టేక్ చేసిన బుల్లెట్ విషయం. మరిప్పుడు ఏం చేయాలి? బండి ఆపాలా? అలాగే ముందుకు పోనియ్యాలా? తాను మామూలు మోటార్ సైక్లిస్టేనని ఓవర్ టేక్ చేశాడు. కానీ ఎదురుగా కనిపిస్తున్నది పోలీస్ ఆఫీసరా? అయ్యబాబోయ్ ఎంత పనైపోయింది? మఫ్టీలో ఉన్న ఎస్సై బండిని ఓవర్ టేక్ చేశానా? ఇఫ్పుడెలా ఈ గండం నుంచి ఎలా బయటపడాలి? తనను కాపాడేది ఎవరు? అనుకుంటున్నాడు లారీ డ్రైవర్. బుల్లెట్ దగ్గరకు రాగానే లారీని స్లో చేశాడు.

లారీ ఆగీ ఆగకముందే ఆచారి డ్రైవర్ డోర్ దగ్గరికి విసురుగా వెళ్లాడు. ఇంక తన పనైపోయిందని వణికిపోతున్న డ్రైవర్ వివరణ ఇచ్చుకునేలోపే ఆచారి బలమైన చేతులు డోర్‌ను లాగి పడేశాయి. “లం...కొడుకా” “బలిసినావురా” అంటూ డ్రైవర్ గల్లా పట్టుకొని అమాంతం సీటులోంచి బయటికి లాగి పైకెత్తాడు. పట్టరాని కోపంతో ఉన్న ఆచారి డ్రైవర్ని ఇంకా పూర్తిగా పైకెత్తి దూరంగా రోడ్డు మీద విసిరేశాడు. ఆ విసురుకు లారీ డ్రైవర్ జారిపోయి రోడ్డు పక్కనున్న కంకర కుప్పమీద పడిపోయాడు.

ఆ దెబ్బకు వాడి పైప్రాణాలు పైనే పోయాయి. శరీరానికి స్వల్ప గాయాలయ్యి, కొద్దిపాటి రక్తపు మరకలు ఏర్పడ్డాయి. “అయ్యా!  తప్పయ్యింది నన్ను క్షమించండి. మీరెవరో తెలియక ఓవర్ టేక్ చేశాను. ఇంకోసారి ఎప్పుడూ ఓవర్‌టేక్ చేయను.

దయచేసి విడిచిపెట్టండి" అంటూ ప్రాధేయపడుతున్నాడు. అప్పుడు ఆచారి ఆగ్రహ తీవ్రత శాంతించింది. ఆయన క్యారెక్టర్‌ను అర్థం చేసుకోవడానికి ఈ ఒక్క ఘటన సరిపోతుంది.

అలాంటి డైనమిక్ ఆచారికి మిర్యాలగూడ తాలూకాలో ఎలాంటి ఫాలోయింగ్ ఉండేదో అర్థం చేసుకోవచ్చు.

# ౭. కృష్ణారెడ్డి కుడిభుజం

**మిర్యాలగూడ ఆధిపత్య రాజకీయాలకు కేంద్ర బిందువుగా ఉండేది. కమ్యూనిస్టు సాయధ పోరాటాల నేపథ్యాన్ని తమ వారసత్వ రాజకీయాలకు ఆలంబనగా చేసుకొని ప్రజాక్షేత్రంలో రాణించాలని లెఫ్ట్ నాయకులు భావించేవారు. మరోవైపు తెలంగాణను అటు కమ్యూనిస్టు కబంధహస్తాల నుంచి విముక్తం చేసింది తామేననే బలమైన వ్యక్తీకరణలో కాంగ్రెస్ నేతలు ఉండేవారు.**

అందువల్ల ఈ రెండు ప్రధాన పార్టీల నడుమ ఆధిపత్య రాజకీయాలు మాత్రమే కాదు... హత్యా రాజకీయాలు కూడా నడిచాయి. అనేక సందర్భాల్లో కృష్ణారెడ్డి మీద కమ్యూనిస్టులు అటాక్ చేశారు. వారి నుంచి కృష్ణారెడ్డి చాలాసార్లు తృటిలో తప్పించుకున్నాడు.

తెలంగాణను విముక్తం చేసి కమ్యూనిస్టు పాలిత ప్రత్యేక ప్రాంతంగా (వీలైతే దేశంగా) ప్రపంచ పటంలో నిలబెట్టాలనే కాంక్ష కమ్యూనిస్టులది. ఎట్టి పరిస్థితుల్లోనూ హైదరాబాద్ సంస్థానాన్ని వదులుకునే ప్రశ్నే లేదని ఏఐసీసీ భావించేది. అయితే సైనిక చర్య తరువాత పాత కమ్యూనిస్టులు కొత్తగా పుట్టుకొచ్చారు.

భారత ప్రభుత్వం దృష్టి మరల్చడం, పాత సిద్ధాంతాలకు కొత్తగా రంగులద్ది, వర్గ పోరాటాలను నిర్వచించుకోవడం, కుల సంఘాల నుంచి నాయకత్వాన్ని ఎంపిక చేయడం వంటివి జరిగాయి. ప్రజాపోరాటాల నేపథ్యాన్ని కాస్తా ప్రజాక్షేత్రంలో ప్రాతినిధ్యంగా మలచుకోవాలన్న కాంక్షతో నూతన పార్టీల వ్యవస్థాపనం లాంటివి జరిగిపోయాయి. పాత వ్యవస్థను సీపీఐగా కొనసాగించింది కొందరైతే.... అధికారం అందుకోవాలనే తాపత్రయంతో సీపీఎం గూటికి చేరింది మరికొందరు. అవి కాకుండా ఎర్రరంగుతోనే మరికొన్ని చిన్నాచితకా పార్టీలు కూడా పుట్టుకొచ్చాయి. ఈ నేపథ్యానికి తగినట్టుగానే సీపీఎం – కాంగ్రెస్ నేతల మధ్య ఆధిపత్య రాజకీయాలు ఇప్పటికీ నడుస్తున్నాయి. 1960, 70 లలో మిర్యాలగూడలో తిప్పన కృష్ణారెడ్డి హవా నడిచింది. ఆయన వరుసగా మూడుసార్లు కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచాడు. ఆయన తరువాత మిర్యాలగూడలో వరుసగా మూడుసార్లు గెలిచిన ఎమ్మెల్యేలు ఇప్పటి వరకు ఎవరూ లేరనేది గ్రహించాలి. రాజకీయాల్లోకి వచ్చేముందు కృష్ణారెడ్డి ఆర్మీలో పని చేశాడు. పూర్తికాలం పని చేసి రిటైర్ అయ్యాక రాజకీయాల్లోకి వచ్చాడు. మంచి కుటుంబ నేపథ్యం, ఆస్తిపాస్తులు, ఉన్నత విద్య, ఆర్మీలో పని చేసిన అనుభవం, అదే క్రమశిక్షణను రాజకీయాల్లో కూడా కొనసాగించడం వల్ల కృష్ణారెడ్డి ప్రజల మనిషిగా పేరు తెచ్చుకున్నాడు. తరువాత ఆయన కొడుకు తిప్పన విజయసింహారెడ్డి ఒకసారి కాంగ్రెస్ నుంచి ఎమ్మెలేగా పని చేశాడు. ఇప్పుడు బీఆర్ఎస్‌లో క్రియాశీలకంగా ఉన్నాడు.



**మిర్యాలగూడ శాసనసభ్యులు తిప్పన కృష్ణారెడ్డి గారిని ప్రత్యేకంగా సన్మానిస్తున్న ఆచారిగారు**

తెలంగాణ విషయంలో చిత్తశుద్ధి ప్రదర్శించిన వ్యక్తిగా కృష్ణారెడ్డి మాటంటే నియోజకవర్గంలో విపరీతమైన గౌరవం, అభిమానం ఉండేవి. నియోజకవర్గం అభివృద్ధిని మాత్రమే గాక ప్రజల వ్యక్తిగత కుటుంబ సమస్యలు కూడా కృష్ణారెడ్డి పరిష్కరించేవాడు. అలాగే అతను ఆర్మీ ఆఫీసర్ కావడం వల్ల ప్రజల్లో ఒకింత భయం, అతను మెతక మనిషి కావడం వల్ల ప్రజల్లో ఆయనంటే ఆదర భావం మెండుగా ఉండేవి. ప్రజలకు ఏ రాత్రి, ఎలాంటి అవసరం వచ్చినా అందు బాటులో ఉండేవాడు. ఎప్పుడూ ఆయన ఇల్లంతా వచ్చే పోయేవారితో సందడిగా ఉండేది. ఊళ్ల మధ్య తగాదాలు, కుల పంచాయతీలు, కుటుంబ తగాదాలు ఇలా ఏదో ఒక అంశం మీద ఎప్పుడూ బిజీగానే ఉండేవాడు కృష్ణారెడ్డి.

# కృష్ణారెడ్డితో ఆచారికి పరిచయం ఎలా?

కృష్ణారెడ్డి తొలిసారిగా 1962లో ఎమ్మెల్యేగా గెలిచాడు. ఆ తరువాత 1967, 1972 లలోనూ వరుసగా గెలిచి హ్యాట్రిక్ సాధించాడు. అయితే 1961 ప్రాంతంలో భారత్ సరిహద్దుల్లోకి చైనా చొచ్చుకొని వచ్చి యుద్ధానికి కాలు దువ్వుతోంది. ఆ సమయంలో దేశమంతటా ఆర్మీ క్యాంపులు జరుగుతున్నాయి. యువకుల్ని రిక్రూట్ చేసుకొని చైనాతో పోరాడటానికి ఇన్‌స్టంట్‌గా రిక్రూట్‌మెంట్ చేపట్టింది ఆనాటి భారత సైన్యం. ఆ ఆర్మీ రిక్రూట్‌మెంట్‌కు ఆచారి అటెండ్ అయ్యాడు.

**ఆర్మీలో చేరడానికి ముందే ఆయన మిర్యాలగూడలో ఆర్ఎస్ఎస్ శాఖకు ముఖ్యశిక్షక్‌గా ఉండేవాడు. ప్రతిరోజూ తెల్లవారుజామునే శాఖకోసం యూత్‌ను లేపడం, నెక్కరు, షూ, టోపీ ధరించి పూర్తి గణవేషతో శాఖకు హాజరు కావడం ఆచారి దినచర్యలో భాగం.** శాఖలో, శాఖకు ముందు యూత్‌ను మేల్కొల్పడానికి ఆచారి శంఖనాదం చేసేవాడు. అది పలికించాలంటే "దమ్ము" బాగా ఉండాలి. గాలి బాగా పీల్చి చాలా ఎక్కువ ఒత్తిడి పెట్టి వాదన చేస్తే తప్ప శంఖనాదం బయటకురాదు. మిర్యాలగూడ ఆర్ఎస్ఎస్‌లో శంఖనాదం చేసే దమ్ము ఆచారికి మాత్రమే ఉండేది. మిగతావారు కర్రసాము, కరాటే లాంటివి ఏదో ఒకటి చేసేవారు. ఆచారి అన్నిట్లోను

ప్రతిభావంతుడు. ఇలా ఆర్ఎస్ఎస్ శాఖ కార్యకలాపాలను కమాండర్ బల్వీందర్ సింగ్ గమనించాడు. ఆచారి వ్యవహార శైలి ఆయన్ని ఎంతగానో ఆకర్షించింది. ఇప్పుడు ఆధికారికంగా సైనికుడిగా సెలెక్ట్ అయి ఉన్నాడు ఆచారి.

అన్ని యుద్ధ విద్యల్లో ఆచారి ప్రతిభ అద్భుతంగా ఉండేది. మరోవైపు ఆచారికి పెళ్లయి 3 ఏళ్లు కూడా దాటలేదు. అలాంటి యౌవన తేజంతో నిజాయతీగా, క్రమశిక్షణగా ఉండే ఆచారి... తాను ప్రత్యేక చొరవ తీసుకున్న ఆచారి ఆఖరుకు సైన్యంలోకి రాకపోతే ఎలా ఉంటుందని బల్వీందర్ సింగ్ ఒత్తిడికి గురయ్యాడు. ఇతను ఆర్మీలో చేరితే కచ్చితంగా పైకి ఎదుగుతాడు అన్న అభిప్రాయంతో బల్వీందర్ ఉన్నాడు. అందుకే ఆచారి షరతును పరిగణనలోకి తీసుకున్నాడు. తనంతట తాను లైసెన్స్‌కి సిఫారసు చేసే అధికారం ఒక మిలిటరీ అధికారిగా తనకు ఉన్నా... స్థానిక ప్రజాప్రతినిధి అభిప్రాయం తీసుకోవాలనుకున్నాడు. అందుకు ఆయన ఎమ్మెల్యే తిప్పన కృష్ణారెడ్డి అభిప్రాయం కోరాడు.

అన్నభీమోజు సైదయ్యకు ఉండే పలుకుబడి, ఆయనతో ఉన్న స్నేహం తెలంగాణ ఉద్యమంలో ఆ కుటుంబ భాగస్వామ్యం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకున్న కృష్ణారెడ్డి ఆచారికి గన్ లైసెన్స్ ఇవ్వాల్సిందిగా సిఫారసు చేశాడు. ఆ లెటర్‌ను ఊతంగా చేసుకొని కమాండర్ బల్వీందర్ సింగ్ కలెక్టర్‌కు జాబు రాశాడు. ఆ విధంగా ఆచారి మిలిటరీలో చేరకుండానే లైసెన్స్‌తో కూడిన తుపాకీ చేతికొచ్చింది.

గన్ విత్ లైసెన్స్ చేతికొచ్చిన ఆచారి మరి సైన్యంలో చేరాడా? ఒకవేళ చేరి ఉంటే ఆచారి చరిత్ర మరో రకంగా ఉండేదే. కానీ అలా జరగలేదు. తనకు కుడిభుజంగా ఉన్న తమ్ముడిని మిలిటరీకి పంపించడం అన్న సైదయ్యకు ఇష్టం లేదు. తల్లి ససేమిరా అంది. "మొన్నమొన్ననే పెండ్లి చేసుకున్నవ్, పిల్లలను, భార్యను ఇడ్సిపెట్టి ఆర్మీలకు పోతవా?" వద్దే వద్దు అని భీష్మించుక కూర్చుంది తల్లి. భార్య కూడా వద్దని పోరుపెట్టింది. దీంతో ఎంపికైన టీమ్ మొత్తం ఢిల్లీకి పోయే రెండురోజుల ముందే ఆచారిని బలవంతంగా అజ్ఞాతంలోకి పంపించారు కుటుంబ సభ్యులు.

ఆ విధంగా ఆచారి ఆర్మీ డ్రెస్సు కల ఆవిరైపోయింది. పోలీసు డిపార్టుమెంటులో చేరాలనుకున్నా కుదరలేదు. ఆర్మీలోకి వెళ్లాలనుకున్నా కుదరలేదు. అయితే సహజంగా వచ్చిన నాయకత్వ లక్షణం నిశ్శబ్దంగా ఉండదు కదా.

ఆచారిలోని చురుకుదనం, ఉద్యమ స్వభావం, నాయకత్వలక్షణం, అటు సైదయ్యతో స్నేహం ఇలాంటి అంశాల కారణంగా ఆచారిని తనతో పాటుగా తిప్పుకోవాలని భావించాడు కృష్ణారెడ్డి. తెలంగాణ ప్రజా సమితిలో క్రియాశీలంగా ఉన్న ఆచారి తనకు చేదోడుగా ఉంటే బాగుంటుంది అనుకున్నాడు. 1971 లోకసభ ఎన్నికల తరువాత కాంగ్రెస్ – టీపీఎస్ విలీనం కావడంతో ఆచారి కృష్ణారెడ్డికి కుడుభుజంగా మారిపోయాడు. ఆచారి చేత జై కాంగ్రెస్ పలికించి, కండువా కప్పేసి ఆచారి అండ్ టీమ్‌ను కాంగ్రెస్‌లో కలిపేసుకున్నాడు కృష్ణారెడ్డి. ఇలా పార్టీ పరంగా,

అధికారికంగా పూర్తి కాంగ్రెస్ వాదిగా మారిపోయాడు ఆచారి. ఎవరైనా తనవాడు అనిపించాలంటే ఆ మనిషి చేత జై కాంగ్రెస్ అనిపించి, జెండా ఎగరేయించిన తరువాతనే ఆయన్ని తన మనిషిగా గుర్తించడం కృష్ణారెడ్డి పాటించే సంప్రదాయం.

# 8. కమ్యూనిస్టుల కవ్వింపులకు ఫుల్‌స్టాప్

అన్నభీమోజు కుటుంబం మీద ఉన్న అభిమానంతో పాటు తన ముందున్న అనేక అవసరాలు ఎమ్మెల్యే తిప్పన కృష్ణారెడ్డిని చాలా ముందుకు నడిపించాయి. కృష్ణారెడ్డిది ఒకరికి భయపడే నైజం కాదు. అవతల ఎంతమంది వచ్చినా సమాధానం చెప్పగల సత్తువ, శిక్షణ ఉన్న వ్యక్తి. కానీ మిర్యాలగూడలో నడుస్తున్న కక్షా రాజకీయాలు వేరు. సైద్ధాంతిక ఆధిపత్యం, ప్రజామద్దతును ప్రదర్శించుకునేందుకు కమ్యూనిస్టు నాయకులు వేసే ఎత్తుగడలు, అందుకు వారు అనుసరించే పద్ధతులు భిన్నంగా ఉండేవి. అందువల్ల రాజకీయ నాయకుడికి నమ్మకమైన ప్రైవేటు వ్యక్తుల అండ అవసరమైంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి దగ్గర నమ్మిన బంటుల్లాంటి ముగ్గురు , నలుగురు వ్యక్తులు ఉండేవారు. వారి ఆసరాతోనే ప్రజల సమస్యలను పరిష్కరించేవాడు. వారిలో పహిల్వాన్లు కూడా ఉండేవాళ్లు. వారంతా కృష్ణారెడ్డి చెప్పింది చేసే అనుచరులే. అంతకు మించి ఒక్క అంగుళం అదనపు ప్రయోజనం వారితో ఉండేది కాదు. అయితే ఆచారి అందుకు పూర్తిగా భిన్నం. ఈయన చెప్పింది చేసే యంత్రం కాదు. స్వతహాగానే ఆయనలో నిండైన నాయకత్వ లక్షణాలు ఉన్నాయి.

ఈ విషయాన్ని కృష్ణారెడ్డి బాగా గ్రహించాడు. అందుకే తన కోటరీలోకి తీసుకున్నాడు. ప్రథమ స్థానం కల్పించాడు. ఆచారి రాకతో కృష్ణారెడ్డి తలమీద భారం 80 శాతానికి పైగా దిగిపోయింది. అనేక సమస్యలు, అనేక సెటిల్‌మెంట్లు ఆచారికి అప్పగిస్తున్నాడు. ఎలాంటి జటిలమైన సమస్య అయినా ఆచారి ఒకసారి సిట్టింగ్ వేస్తే దాన్నుంచి మళ్లీ ఫిర్యాదులే వచ్చేవి కావు. వ్యక్తులను బట్టి ట్రీట్‌మెంట్ ఇవ్వడం, వ్యక్తుల అవసరాలు గుర్తించి పరిష్కారం చూపడంలో రాటుదేలి పోయాడు ఆచారి. అప్పటికే అన్న సైదయ్యకు కుడి భుజంగా అనేక వ్యవహారాలు, ప్రభుత్వ కాంట్రాక్టులు, అధికారులతో మాట్లాడి బిల్లులు క్లియర్ చేయించడాలు వంటి అంశాల్లో అనుభవం గడించిన ఆచారికి ఇప్పుడు ఎమ్మెల్యే అండదండలు దొరకడంతో ప్రజాక్షేత్రంలో దూసుకుపోతున్నాడు. కుల పంచాయతీ అయినా కుటుంబ పంచాయతీ అయినా ఆచారి దగ్గరకు వస్తే అది నిమిషాల్లో పూర్తయ్యేది. మహా అయితే కొన్ని గంటలకు మించి పట్టేది కాదు.

ఆచారి బిఎస్ఎ మిలటరి బుల్లెట్ మీద బయల్దేరాడని, ఆ వస్తున్నది ఆచారేనని ఆ బండి శబ్దమే ముందుగా చాటింపు వేసినట్టుగా ఉండేది. ఆ బండి వస్తుందంటే మిర్యాలగూడ, దాని చుట్టుపక్కల పల్లెల్లో ప్రజలంతా పక్కకు తప్పుకునేవారు. పాతకాలపు బుల్లెట్ బండిమీద ఆచారి గుబురుగా పెరిగి, వంకీలు తిరిగిన మీసాలతో భీమసేనుడిలా కనిపించేవాడు. బండి వెనకాల ఎప్పుడూ తనకు నమ్మకస్తుడైన ఓ అనుచరుణ్ని ఉంచుకునేవాడు. అది తనకు

స్టేటస్ సింబల్‌గా కనిపించేది.

ఆచారిలో ఉండే అలాంటి స్వతంత్ర ప్రతిపత్తి కృష్ణారెడ్డిని అమితంగా ఆకర్షించింది. సాధారణంగా ఒక ప్రజా నాయకుడి దగ్గర పనిచేసేవారు ఆయన్ని మించి ఎప్పుడూ కనిపించరు. అలా కనిపించడాన్ని ఏ నాయకుడూ ఒప్పుకోడు. కానీ కృష్ణారెడ్డి తరహా వేరు. ఆయనది సంకుచితమైన ధోరణి కాదు. ఆచారి ముందు కెళ్తున్న కొద్దీ కృష్ణారెడ్డి ప్రోత్సహిస్తూ పోయాడు. ఇందులో కృష్ణారెడ్డి స్వార్థం కూడా ఉంది. ఎందుకంటే ఆచారి తన గూటికి వచ్చాక కమ్యూనిస్టు కార్యకర్తల ఆగడాలు, అరాచకాలు ఆగిపోయాయి. కొండముచ్చు కనిపించగానే అల్లరిచేసే కోతులన్నీ తల వంచుకొని నిశ్శబ్దంగా వెళ్లిపోయినట్టు అయింది మిర్యాలగూడలో.

ఈ క్రమంలో ఆచారికి చుట్టుపక్కల అనేక పల్లెల్లో పరపతి బాగా పెరిగిపోయింది. అయినా కృష్ణారెడ్డిని ఎక్కడా ఓవర్‌టేక్ చేయలేదు ఆచారి. వారి మధ్య ఈ అనుబంధం కృష్ణారెడ్డి మూడోసారి ఎమ్మెల్యే అయ్యేదాకా కొనసాగింది. 1972 లో కృష్ణారెడ్డి హ్యాట్రిక్ ఎమ్మెల్యే అయ్యాడు. కృష్ణారెడ్డి మూడోసారి గెలిచిన తరువాత ఆచారిని మరింతగా ప్రమోట్ చేశాడు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, వీకర్స్ సెక్షన్స్‌కు తాలూకా ప్రెసిడెంట్‌గా నియమించాడు.

కృష్ణారెడ్డి ఇచ్చిన అవకాశాన్ని ఆచారి మరింత సద్వినియోగం చేసుకున్నాడు. అప్పటిదాకా వీకర్స్ సెక్షన్ నుంచి


A. Madana Chary.
TALUKA PRESIDENT
Minorities and Weakers Section
MIRYALGUDA.
Dist. Nalgonda. (A.P.)

**1972 లో ఆచారిగారు తాలూక అధ్యక్షులుగా ఉన్నప్పుడు చేయించుకున్న విజిటింగ్ కార్డు**

పలు సంఘాలు ఏర్పాటై ఉన్నాయి. కానీ ప్రభుత్వాధికారులతో మాట్లాడటానికి గానీ, మంత్రులకు ఒక మెమొరాండం ఇవ్వాలన్నా గానీ అవకాశం ఉండేది కాదు. ఇక్కడే ఆచారి చాలా కీలకమైన నిర్ణయం తీసుకున్నాడు. సాధారణంగా ఇలాంటి అంశాల్లో కమ్యూనిస్టులు ఎంతో ముందుచూపుతో వ్యవహరిస్తారు. అందుకే వీకర్స్ సెక్షన్స్‌లో వారు మొదట్నుంచీ బలంగా పాతుకుపోయారు. ఇప్పుడు కమ్యూనిస్టుల ప్రాభవానికి గండి కొడుతూ హమాలీల సంఘం దగ్గర నుంచి అన్ని కుల సంఘాలనూ రిజిస్ట్రేషన్ చేయించాడు ఆచారి. తాపీ మేస్త్రీ అసోసియేషన్, కార్పెంటర్స్ అసోసియేషన్, రిక్షా పుల్లర్స్ అసోసియేషన్, మార్కెట్ కమిటీ అసోసియేషన్ ఇలా... శ్రమజీవనమే సంస్కృతిగా గల అన్ని వర్గాలకూ వేర్వేరు అసోసియేషన్స్ ఏర్పాటు చేయంచాడు. అన్నింటికీ ఆచారినే అధ్యక్షుడిగా పెట్టుకున్నారు ఆ సంఘాల ప్రతినిధులు. ఈ పలుకుబడి, ఈ హెూదాతోనే 1974లో సెయింట్ మేరీ స్కూల్ కమిటీ చైర్మన్‌గా ఎంపికయ్యాడు మదనాచారి.

మరోవైపు కమ్యూనిస్టుల్లోనూ ఆచారి అత్యంత ఆప్తుడైపోయాడు. అందుక్కారణాలు ఆయన స్వతంత్ర వ్యక్తిత్వం, నిర్భీతి, ప్రజల్లో పలుకుబడి ఆయన ఒక మాట చెబితే గీత దాటని వందలాది మంది కుల సంఘాల నాయకులు, కార్యకర్తలు తయారయ్యారు. వారంతా ఆచారి ఎంత చెబితే అంత. ఆచారి కోసం ప్రాణాలైనా ఇవ్వడానికి సిద్ధంగా ఉండేవారు. ఆచారి కూడా అంతే. నమ్మిన వాళ్లకోసం ఎందాకైనా పోయేవాడు. ఇలా కృష్ణారెడ్డి దగ్గర ఉన్న అనుచరులు క్రమంగా ఆచారికి అనుచరులుగా మారిపోయారు.

# ౨. ఆచారికి అపురూప కానుక: 1975

1975 ఆచారి జీవితంలో ఓ ప్రత్యేకమైన సంవత్సరం. ప్రజా క్షేత్రంలో ముందున్న ఆచారిని కాంగ్రెస్ నేతలు ప్రమోట్ చేశారు. అప్పటికే కృష్ణారెడ్డి చొరవతో కాంగ్రెస్‌లో చేరి దూసుకు పోతున్న ఆచారిని మిర్యాలగూడ మార్కెట్ కమిటీ చైర్మన్‌ని చేస్తూ కాంగ్రెస్ హైకమాండ్ నియామక పత్రాన్ని జారీ చేసింది.

అప్పట్లో ఆచారికి ఉండే కనెక్షన్స్ కేవలం మిర్యాలగూడ వరకే పరిమితం కాలేదు. ఆయన హైదరాబాద్ సెక్రటేరియట్‌లో కూడా చాలా సులువుగా పనులు చేసుకొచ్చేవాడు. ఏ మంత్రినయినా కలిసి తాము చేసిన కాంట్రాక్టు పనులకు బిల్లులు క్లియర్ చేయంచుకొని వచ్చేవాడు. ఆ రోజుల్లో సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రిని కలవాలన్నా ముందుగా కార్మికశాఖ మంత్రి అంజయ్యను కలవాల్సిందే. ఆ రోజుల్లో కార్మికశాఖ మంత్రికి ఉండే పలుకుబడి అలా ఉండేది. ముఖ్యమంత్రికి లేని గౌరవ మర్యాదలు కార్మికశాఖ మంత్రికి లభించేవి. ఆ కార్మిక మంత్రి అంజయ్యతో ఆచారి అత్యంత సన్నిహితంగా ఉండేవాడు. మిర్యాలగూడ ఎమెల్యే కృష్ణారెడ్డితో ఎంత చనువుగా ఉండేవాడో ఇంకా అంతకన్నా ఎక్కువ ఆత్మీయానుబంధమే అంజయ్యతో

ఉండేది. మిర్యాలగూడలో ఆచారికి ఉండే ఫాలోయింగ్, పలుకుబడి, పార్టీకి ఆయన అందిస్తున్న సేవలను పరిగణనలోకి తీసుకొని ఆయన్ను మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించింది కాంగ్రెస్ పార్టీ. ఆ పదవీ నియామక పత్రాన్ని ఆయన నేరుగా ఢిల్లీ నుంచే తెచ్చుకోవడం విశేషం. నేరుగా ఇందిరాగాంధీని కలిసేంత పట్టు సంపాదించాడు. అలా ఆయనకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి పక్కా కాగానే నియామక పత్రం తెచ్చుకోవడానికి ఢిల్లీకి వెళ్లాడు. అక్కడే దాదాపు నెల రోజులు మకాం వేసి ప్రధాని ఇందిరను కలిశాడు.



**1975 జూలైలో ఢిల్లీకి వెళ్ళి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియామక పత్రాన్ని అందుకున్నాక ఆచారి గారు కాంగ్రెస్ నాయకులతో తాజ్‌మహల్ వద్ద దిగిన చిత్రం**

**అది 1975 ఆగష్టు 6వ తేదీ.**

ఇందిర చేతుల మీదగా నియామక పత్రం తీసుకున్నాడు. ఆచారి ఆనందానికి అవధుల్లేవు. మార్కెట్ కమిటీ చైర్మన్ అనేది ప్రజలతో, ముఖ్యంగా రైతులతో, కార్మిక సంఘాలతో సత్సంబంధాలు ఉండేవారికే ఇస్తారు. ఎన్నికై గెలిచిన ఎమ్మెల్యేకు సమానంగా, ఇంకా చెప్పాలంటే అంతకన్నా ఎక్కువ పలుకుబడితో కూడిన పదవే అది. కాంగ్రెస్ తనకు ఇచ్చిన ఆ ప్రాముఖ్యతకు ఆచారి ఎంతో మురిసిపోయాడు. అయితే అదేరోజు ఇక్కడ మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రిలో రెండో భార్య ప్రసవించింది. ఆ విషయం ఆచారికి తెలియదు. దైవావశాత్తు అదే సమయానికి ప్రధాని చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నాడు. ఆచారి మనసు ఆనంద డోలికల్లో తేలిపోతున్న సమయంలో మొదటి సంతానం మిర్యాలగూడ ఆస్పత్రిలో కేర్ మన్నాడు.

*　　*　　*

మార్కెట్ కమిటీ చైర్మన్ హోదాలో మిర్యాలగూడకు చేరుకున్న ఆచారికి కనీవినీ ఎరుగని రీతిలో స్వాగత ఏర్పాట్లు జరిగాయి. తన అనుచరులతో కలిసి ఆచారి మిర్యాలగూడ బస్టాండ్ చేరుకోగానే ఓపెన్ టాప్ జీపును మిత్రులు, కార్యకర్తలు సిద్ధంచేసి ఉంచారు.

**అది ఆగష్టు 9వ తేదీ.**

**భారీ ర్యాలీ ప్రారంభమయ్యే ముందు తనకు కొడుకు పుట్టాడన్న విషయం ఆచారికి తెలిసింది. ఆ వార్త తెలియగానే ముందుగా కొడుకును చూడాలని తన మనసు తహతహలాడింది. నేరుగా శోభాయాత్రను ఆస్పత్రికి వెళ్లాల్సిందిగా ఆదేశించాడు.**

*　　*　　*

భార్యను, కొడుకును చూడాలని ముచ్చట పడుతున్న ఆచారి భారీ కాన్వాయ్‌తో ఆస్పత్రివైపు బయలుదేరుతున్నాడు. అప్పుడు ఆ ర్యాలీకి ఎదురుగా వచ్చాడు కట్టెబోయిన రాములు యాదవ్. రాములు యాదవ్ మొహంలో ఆనందమే కనిపించడం లేదు. ఏదో విషాదఛాయలు, ఏదో ఆందోళన ఆయన మొహంలో కనిపిస్తోంది. రాములు ఆ ర్యాలీలోని జనాన్ని పక్కకు తోసుకుంటూ హడావిడిగా జీపును చేరుకున్నాడు. అటు డప్పు చప్పుళ్లు, జయజయధ్వానాలు, డ్యాన్సులు హోరెత్తుతుండగా ఆచారికి జరిగిన విషయం చెప్పాడు రాములు. తన జీవితంలో అతి ముఖ్యమైన ఘట్టంగా భావిస్తున్న సందర్భాన్ని ఏదో అదృశ్య జీవి వచ్చి పాడు చేస్తున్నదన్న ఫీలింగ్ కలిగింది ఆచారికి. పట్టరాని కోపంతో ఊగిపోయాడు. ర్యాలీని, జనాన్ని తీసుకొని జీపును ఆసుపత్రికి వెళ్లాలని ఆదేశించాడు.

*　　*　　*

ఆస్పత్రి ప్రాంగణంలోకి ఆచారి ఊరేగింపు రాగానే తల్లుల ఆర్తనాదాలు చెవిన పడుతున్నాయి. బాలింతలు వారి కుటుంబ సభ్యులు విషణ్ణ వదనాలతో తనను సమీపిస్తున్నారు. ఆచారి జీపు దిగగానే ఆయన కాళ్లమీద పడిపోయారు. అనేక మంది తండ్రులు, తల్లులు తమ బిడ్డలను  కాపాడాలని, ఆ దేవుడు నువ్వేనని విలపిస్తున్నారు.

మిర్యాలగూడ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో గత నాలుగైదు రోజుల నుండి జన్మజాత శిశువులు చనిపోతున్నారు. ఇంకా చాలామంది పరిస్థితి   ఇప్పుడో అప్పుడో అన్నట్టుగా ఉంది. అలాంటి శిశువుల వరుసలోనే ఆచారి కొడుకు కూడా ఉన్నాడు. ఈ తరుణంలో బిడ్డలను కోల్పోయిన తల్లులు, బిడ్డలను కోల్పోవడానికి సిద్ధంగా ఉన్న తల్లులు, వారి బంధువులు, పక్క ఊళ్లకు చెందిన పదులకొద్దీ ప్రజానీకం ఆచారిని చుట్టుముట్టారు. బిడ్డల్ని కోల్పోయిన కొందరు మహిళలు ఆచారి కాళ్లను పట్టుకున్నారు. వారి రోదనల్లో బిడ్డల్ని కోల్పోయిన ఆక్రందన ప్రతిధ్వనిస్తోంది. వారి ఏడుపులు, శోకాల నుంచే ఆస్పత్రిలో ఏం జరిగిందో ఆచారికి మొత్తం అర్థమైపోయింది.

కేవలం వైద్యుల నిర్లక్ష్యమే తప్ప పసిబిడ్డల మరణాలకు మరో కారణమేదీ కనబడలేదు. వారి నిర్లక్ష్యం కారణంగా అప్పటికే ముగ్గురు, నలుగురు ముక్కుపచ్చలారని పసిప్రాణాలు రాలి పోయాయి. మరికొన్ని పసిప్రాణాలు కూడా అలాంటి పరిస్థితినే ఎదుర్కొబోతున్నాయి. అందులో ఆచారి బిడ్డ కూడా ఒకడు.

ఆ ఆగ్రహంతో ఆచారి కళ్ళు ఎరుపెక్కాయి. పిడికిళ్లు బిగుసుకున్నాయి.

“ఎవడ్రా? ఆ డాక్టరు? అని గర్జిస్తూ ఆస్పత్రిలోనికి దూసుకెళ్లాడు.

డాక్టర్ దశరథ్ బాబు (పేరు మార్చడం జరిగింది) కుర్చీలో కూర్చొని కనిపించాడు.

పట్టరాని ఆగ్రహంతో డాక్టర్ దగ్గరికి వెళ్లాడు. ఒక ప్రశ్న గానీ, వివరణ గానీ అడగలేదు. ఆ డాక్టర్ చొక్కా పట్టి పైకెత్తి జీపు దగ్గరికి తీసుకొచ్చాడు. ఆచారి భారీ కాయం ముందు డాక్టర్ పిట్టపిల్లలా కనిపించాడు. ఆయన్ని ఈడ్చుకొచ్చి జీపుకు కట్టేశాడు ఆచారి. ఆ జీపును తనే డ్రైవ్ చేస్తూ ర్యాలీ ఆగిన సెంటర్‌కి పోనిచ్చాడు. దారివెంట జీపుకు కట్టేసిన డాక్టరును చూస్తూ జనమంతా శాపనార్థాలు పెడుతున్నారు. పసిపిల్లల్ని పొట్టన పెట్టుకున్న ఆ డాక్టరుకు తగిన శాస్తే జరిగిందని అంతా చెప్పుకుంటున్నారు. ప్రజల ముందు దోషిగా నిలబడ్డాడు డాక్టర్ దశరథ్‌బాబు.

సెంటర్‌కు చేరుకునే సరికి అక్కడ వేలాది మంది జనం గుమిగూడి ఉన్నారు. ఒకవైపు డాక్టర్ జీపుకు కట్టబడి ఉన్నాడు. మరోవైపు ఆచారి కళ్లు పట్టరాని ఆవేశంతో నిప్పులు కురిపిస్తున్నాయి.

ఇప్పుడు ఆచారి ఏం చేస్తాడు?

ఆ డాక్టరును ఏం చేస్తాడు? ఏం జరుగుతుంది? ఊపిరి బిగబట్టి చూస్తున్నారు జనం.

"ఈ డాక్టరుగాన్ని ఏం జేయమంటరు?" అంటూ ఆచారి కంఠస్వరం మార్మోగింది. ఆయన గర్జనతో జనంలో ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరించింది. చుట్టూ పోగైన జనం, నడి బజారులో ఆచారి ఓపెన్‌టాప్ జీపు. ఆ జీపుకు పెడరెక్కలు విరిచి కట్టేసి ఉన్న డాక్టర్. కొందరికి ఆ దృశ్యం విపరీతమైన టెన్షన్‌కి గురి చేస్తూంటే మరికొందరికి, ముఖ్యంగా యువకులకు క్రూరమృగాన్ని బంధించి సర్కస్‌లో ప్రదర్శిస్తున్న మాదిరిగా కనిపించింది. అందుక్కారణం లేకపోలేదు.

డాక్టర్ దశరథ్ బాబు ఆంధ్రాకు చెందిన వ్యక్తి. విజయవాడ నుంచి వచ్చి ఇక్కడ విధులు నిర్వహిస్తున్నాడు. ఆంధ్రా ఉద్యోగులకు, అధికారులకు తెలంగాణ మీద ఉండే కుటిల వైఖరి వారి సేవల్లో కూడా కనిపించేది. ఆ ధోరణి వల్లే ప్రభత్వాసుపత్రుల్లో పేద ప్రజలు తీవ్రమైన వివక్షకు గురయ్యేవారు. ఆంధ్ర సెటిలర్లకు ఒకలాగా, తెలంగాణ ప్రజలకు ఒకలాగా వారి ట్రీట్‌మెంట్ ఉండేది. తెలంగాణలో కూడా డబ్బు, పలుకుబడి ఉన్న గొప్ప ఇంటివారికి ఒకలాగా కిందిస్థాయి వారికి మరోలాగా ట్రీట్‌మెంట్ జరిగేది. ఇది బహిరంగ రహస్యమే.

1969 ఉద్యమం తరువాత చెన్నారెడ్డి టీపీఎస్ కాంగ్రెలో విలీనం అయ్యాక ఈ వివక్ష మరింత పెరిగింది. ఆంధ్ర ఉద్యోగులు

ఏం చేసినా, ఎలా బిహేవ్ చేసినా తమను అడిగేవారు లేరనే అహంకార ధోరణి అడుగడుగునా కనిపించేది. అనేక సందర్భాల్లో ఈ అంశాలు ఎమ్మెల్యే దగ్గర, ఆచారి అనుచరుల సమక్షంలో చర్చకు వచ్చేవి. కానీ పార్టీగా ఒక నిర్ణయం తీసుకున్న తరువాత కాదనే దమ్ము, ధైర్యం ఎవరికీ లేకుండా పోయాయి. కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న ఆ నిశ్శబ్దాన్నే ఇవాళ ఆచారి ఊరందరి సమక్షంలో బద్దలు కొట్టాడు. ఈ నేపథ్యంలో నుంచి పెల్లుబికిన ప్రజాగ్రహమే ఆ డాక్టరుకు తగినశాస్తి జరగాలన్న ఆత్రుత వారి కళ్లల్లో కనిపిస్తోంది. ఆచారి ఏం చేస్తాడా అన్న ఉత్కంఠ, మరుక్షణంలో డాక్టరుకు ఏం  గతి పడుతుందో అన్న ఉద్విగ్నత అక్కడి ప్రజల్లో కనిపిస్తోంది. తీవ్రమైన తప్పుచేసి, అది నేరపరీక్షలో రుజువైన దోషిలా తలవాల్చేసి, అవమాన భారంతో, పాలిపోయిన మొహంతో నేలచూపులు చూస్తున్నాడు డాక్టర్ దశరథ్‌బాబు.

కట్టేసి ఉన్న దశరథ్‌ను కొడతాడా? లేక మరేమైనా శిక్ష విధిస్తాడా అనేది కాసేపట్లో తేలిపోతుందనగా అప్పుడొచ్చాడు హడావుడిగా ఆస్పత్రి సూపరింటెండెంట్. మరో ఇద్దరు సిబ్బందిని వెంట బెట్టుకొని చెమటలు కక్కుతున్న మొహంతో ఆచారిని సమీపించాడు సూపరింటెండెంట్.

“తప్పయిపోయింది ఆచారిగారూ, క్షమించండి. డాక్టరు తరఫున నేను క్షమాపణ అడుగుతున్నా. ఇకపై ఇలాంటివి జరగకుండా నేను చూస్తా. నాదీ హామీ. దయచేసి డాక్టర్ని వదిలేయండి. అతనిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. నాదీ

గ్యారంటీ.'' అంటూ ప్రాధేయపడ్డాడు. సూపరింటెండెంట్ విజ్ఞాపనతో ఆచారి ఆగ్రహం తేలికైంది. అక్కడి ప్రజారాశిలో వ్యక్తమవుతున్న నిశ్శబ్ద నిరసన జ్వాలలకు ఒక పరిష్కారం దొరికినట్లయింది.

ఆ ఘటనను ఆనాటి ఉమ్మడి ఆంధ్ర వైద్యశాఖ చాలా సీరియస్‌గా తీసుకుంది. ఉన్నపళంగా మిర్యాలగూడ ఆస్పత్రి సిబ్బంది మొత్తాన్ని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బహుశా ఇలాంటి ఘటన రాష్ట్రంలో ఎక్కడా జరిగి ఉండకపోవచ్చు. కేవలం వారం రోజుల్లోనే మిర్యాలగూడలోని ప్రభుత్వాసుపత్రికి కొత్తగా పూర్తిస్థాయి సిబ్బంది వచ్చేశారు. ఆ విధంగా ఆస్పత్రి ప్రక్షాళన జరిగిపోయింది. మిర్యాలగూడ నియోజకవర్గంలోని పేద ప్రజలకు అప్పటి నుంచి మెరుగైన వైద్యసేవలు అందడం మొదలైంది. ఇతర ప్రభుత్వాధికారులకు ప్రజల పట్ల సానుభూతి మరింత పెరిగింది.

మిర్యాలగూడ సెంటర్‌లో ఆస్పత్రి ప్రక్షాళన నిర్ణయం జరిగిన తరువాతనే ఆచారి తన మగబిడ్డను చూడటానికి వెళ్లి పోవడం గమనించాలి. ఆ విధంగా తన దగ్గరకు ఏ సమస్య వచ్చినా, అది ఎంతటిదైనా పరిష్కారం చూపిన తరువాతనే ఇతర అంశాలు ఆలోచించేవాడు ఆచారి. ఈ ఘటన మిర్యాలగూడ చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచిపోయిందని చెప్పుకోవచ్చు.

# 10. కృష్ణారెడ్డి అనుకున్నదొకటి చెన్నారెడ్డి చేసిందొకటి

1978లో కృష్ణారెడ్డి మిర్యాలగూడ ఎంపీగా గెలిచి ఢిల్లీకి వెళ్లిపోయి, ఇక్కడ ఆచారిని ఎమ్మెల్యేగా చేసుకోవాలి అనుకుంటున్నాడు. పార్టీ టికెట్ల కేటాయింపుపై కాంగ్రెస్‌పార్టీలో చర్చోపచర్చలు నడుస్తున్నాయి. ఆశావహులందరూ పీసీసీ చీఫ్ జలగం వెంగళరావు వద్దకు క్యూ కడుతున్నారు. ఆయనే అప్పుడు ముఖ్యమంత్రి కూడా. టికెట్ల కేటాయింపులో జలగం అప్పటికే ఓ అభిప్రాయానికి వచ్చి ఉన్నాడు. ఆశావాహులు ఎందరున్నా సామాజిక సమీకరణలు అనుసరించి పార్టీ గెలుపోటములకు ప్రాధాన్యతనిచ్చి బీ ఫాంలు ఇవ్వాలని జలగం నిర్ణయించుకున్నాడు.

ఇక్కడ జలగం గురించి రెండు మాటలు చెప్పుకోవాలి. కాంగ్రెస్‌కు వీరవిధేయుడు అన్న పేరు జలగంకు ఉండేది. నక్సలైట్ల అణచివేతలో ఉక్కుపాదం మోపిన వ్యక్తిగా పేరు తెచ్చుకున్నాడు. కమ్యూనిస్టుల ప్రభావం గణనీయంగా ఉండే మిర్యాలగూడను ఎట్టి పరిస్థితుల్లో జార విడుచుకోవద్దని, ఈసారి కూడా కాంగ్రెస్ అభ్యర్థి గెలిచి తీరాలని జలగం సంకల్పించుకున్నాడు. ఈ క్రమంలో

ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ప్రతిపాదనకు టాప్ ప్రియారిటీ ఇచ్చాడు. అందుకని ఈసారి మిర్యాలగూడ టికెట్‌ను బీసీలకు ఇవ్వాలనీ, ఆ వర్గాల్లో ఆచారికి తిరుగులేని పలుకుబడి ఉందని, టికెట్ ఇస్తే తప్పక గెలిచి వస్తాడని జలగం నిర్ణయించుకున్నాడు. ఆచారి అప్పటికే 50 గ్రామ పంచాయితీల సర్పంచులను సీపీఎం నుండి కాంగ్రెస్‌లోకి మార్పించాడు. ఇటు ఆచారికి, ఆయన కేడర్‌కు హైకమాండ్ నుంచి పాజిటివ్ ఫీలర్స్ అందుతున్నాయి. దీంతో ఆచారికి టికెట్ ఖాయమన్న ఆనందంలో వీరు ఉండిపోయారు. కానీ ఎలాంటి నిర్ణయాన్నయినా, ఎంతటి అంశాన్నయినా క్షణాల్లో మార్చగల సమర్థులు కాంగ్రెస్‌లో కోకొల్లలు. ఇక్కడ కూడా అదే జరిగింది.

దేశమంతా ఎమర్జెన్సీ వాతావరణం, దాని తాలూకు ప్రభావం ఒకవైపు ఉండగా ఇక్కడ ఉమ్మడి ఆంధ్రాలో తెలంగాణ ప్రజా సమితి స్థాపించి కాంగ్రెస్‌ను ఘోరంగా దెబ్బకొట్టిన చెన్నారెడ్డి అనుభవం ఆ పార్టీని వెంటాడుతోంది. 1971 పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ప్రాంతంలోని 11 సీట్లలో 10 సీట్లు టీపీఎస్ గెలుచుకుంది. అంతటి ప్రజా ఉద్యమ పార్టీని మర్రి చెన్నారెడ్డి నిర్దాక్షిణ్యంగా కాంగ్రెస్‌లో కలిపేశాడు. చెన్నారెడ్డి "త్యాగానికి" కాంగ్రెస్ రిటర్న్ గిఫ్ట్ ఇచ్చుకోవాల్సిన సందర్భం ఇప్పుడొచ్చింది. జలగం వెంగళరావును పీసీసీ నుంచి తప్పించి మర్రి చెన్నారెడ్డికి పగ్గాలు అప్పగించారు. దీంతో జలగం ముఖ్యమంత్రి పీఠం నుంచి దిగిపోయాడు. చెన్నారెడ్డి కాంగ్రెస్ సీఎంగా ప్రమాణస్వీకారం

చేశాడు. ఆట మారిపోయింది. ఆటగాళ్లు కూడా మారిపోయారు. తనకు ఎంపీ కావాలన్న కోరిక కృష్ణారెడ్డికి తీరలేదు. తన మనిషి అయిన ఆచారికి ఎమ్మెల్యే టికెట్ కూడా దక్కలేదు.

అసలు కృష్ణారెడ్డికి టికెట్ ఇవ్వక పోవడానికి బలమైన కారణం మరోటి ఉంది. అదేంటంటే టీపీఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేసే విషయంలో కృష్ణారెడ్డి చెన్నారెడ్డితో తీవ్రంగా విభేదించడమే. టీపీఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేసే అంశాన్ని కృష్ణారెడ్డి వ్యతిరేకించాల్సిన అవసరం ఏంటి? ఆ సంస్థ వ్యవస్థాకుడైన చెన్నారెడ్డికి లేని మమత్వం కృష్ణారెడ్డికి ఉందనుకోవాలా! నిజమే, టీపీఎస్‌ను చెన్నారెడ్డి స్థాపించవచ్చు. కానీ దాన్ని ఆకాశానికెత్తి హారతులు పట్టింది ప్రజలు, సబ్బండవర్ణాలు. అది వ్యక్తిగత అంశమైతే కృష్ణారెడ్డి మాట్లాడేవాడు కాదేమో. కానీ అది సామాజిక అంశం. తెలంగాణ ప్రజల ఉమ్మడి ఆస్తి. ప్రజల ఉమ్మడి ఆస్తిని, ఉమ్మడి ఆకాంక్షలను నిట్టనిలువునా కాంగ్రెస్‌లో ముంచబోతుంటే తెలంగాణను ఆపాద మస్తకం ఆవహించుకున్న కృష్ణారెడ్డి లాంటి దేశభక్తులకు అది జీర్ణమయ్యే విషయం కాదు. అందుకే విలీనం విషయంలో చెన్నారెడ్డితో కృష్ణారెడ్డి తీవ్రస్థాయిలో ఘర్షణ పడ్డాడు. తెలంగాణ ప్రజలను ఇంత దారుణంగా మోసం చేస్తావా? ఆ హక్కు నీకు ఎవరిచ్చారు? అంటూ ఆక్షేపించాడు. తన శరీరంలోని ఓ భాగాన్ని తన ప్రమేయం లేకుండానే అమ్మకానికి పెడుతున్నట్టు విలవిలలాడిపోయాడు కృష్ణారెడ్డి. తెలంగాణ అంశాన్ని తన

రాజకీయ స్వప్రయోజనాలకోసం తాకట్టు పెట్టే పక్కా వ్యాపార వేత్తగా చెన్నారెడ్డి మారిపోయాడు. దాన్ని అడ్డుకోవడానికి శాయశక్తులా ప్రయత్నించి విఫలమైన వ్యక్తిగా కృష్ణారెడ్డి మిగిలిపోయాడు. ఒకే సంస్థలో, ఒకే లక్ష్యం కోసం పని చేసిన వ్యక్తులు పరస్పర భిన్న ధ్రువాలుగా తయారయ్యారు.

తనను అంతగా విభేదించి, అంతగా నిలదీసిన కృష్ణారెడ్డి రాజకీయ భవిష్యత్తును నిర్దేశించబోయే అవకాశాన్ని విలీన ప్రక్రియ ద్వారా చెన్నారెడ్డి అందుకున్నాడు. పీసీసీ అధ్యక్షుడిగా ఎవరి తలరాత ఎలా ఉండాలో లిఖించే అవకాశాన్ని చెన్నారెడ్డి దక్కించుకున్నాడు. కాబట్టి కృష్ణారెడ్డికి టికెట్ ఇవ్వలేదు. కృష్ణారెడ్డితో పాటు ఆయనకు అత్యంత ఆప్తుడైన, రాజకీయ శిష్యుడిగా తయారైన ఆచారికి అందుకే టికెట్ దక్కలేదు. ఆ విధంగా గురుశిష్యుల రాజకీయ భవిష్యత్తును చెన్నారెడ్డి నిర్దాక్షిణ్యంగా నరికేశాడు.

మిర్యాలగూడలో ఉండే సామాజిక సమీకరణలు ప్రత్యేకమైనవి. ఇక్కడ వైశ్యుల జనాభా ఎక్కువ. కాంగ్రెస్‌కు వారు మొదట్నుంచి అండగా ఉంటూ వస్తున్నారు. వారు బలమైన ఆర్థిక శక్తులుగా రాజకీయాలను ప్రభావితం చేయగలరు. కానీ నేరుగా రాజకీయాలను శాసించే సమర్థత వారికి లేదు. అయితే గాయాల పాలై ఉన్న కాంగ్రెస్‌ను దారికి తెచ్చుకుంటే ఈసారి వైశ్యుల నుంచి ఎమ్మెల్యే అవడం ఖాయమని వారిలో కొందరికి అనిపించింది. బీసీల వైపు మొగ్గు చూపుతున్న కాంగ్రెస్‌కు అడ్డుపుల్ల వేశారు. బీసీలకు టికెట్ ఇస్తే తాము మద్దతిచ్చేది లేదని భీష్మించుకున్నారు.

వైశ్యులకే టికెట్ కావాలని కొత్త డిమాండ్ ముందుకు తెచ్చారు. పీసీసీ రథసారథి మారడంతో కృష్ణారెడ్డితో పాటు ఆచారికి కూడా టికెట్ రాకుండా పోయింది. కాంగ్రెస్ అభ్యర్థి ఎన్నిక అవకుండా ఉండటానికి కమ్యూనిస్టులు తెరచాటుగా ఆడిన నాటకం కాంగ్రెస్‌ను దెబ్బకొట్టింది. కమ్యూనిస్టులకు మేలు చేసింది. అందుకు కారణం మిర్యాలగూడలో ప్రధాన వ్యాపారవేత్తలైన వైశ్యులే. వారు కోరుకున్నట్టుగానే కమ్యూనిస్టు నాయకత్వంతో తెరచాటు ఒప్పందం చేసుకున్నారు. ఇద్దరూ రాజీపడ్డారు. అనధికారిక ఉమ్మడి అభ్యర్థిని వారు గెలిపించుకున్నారు. **విచిత్రం ఏమిటంటే తాను స్థాపించిన టీపీఎస్ అనే మొక్కను మిర్యాలగూడలో నాటి, దానికి నీళ్లు పోసి, శ్రమను, ధనాన్ని, సమయాన్ని ధారవోసిన సైదయ్య కుటుంబం పట్ల ముఖ్యమంత్రి చెన్నారెడ్డి కనీస కృతజ్ఞత చూపకపోవడం.** ఆచారి ఫ్రంట్‌లైన్‌లో ఉన్నాడని తెలిసి ఆనాటి కార్మికశాఖ మంత్రి అంజయ్య, జలగం వెంగళరావు, స్థానిక ఎమ్మెల్యే కృష్ణారెడ్డి లాంటివారు ఆచారి టికెట్ కోసం పట్టుపట్టినా చెన్నారెడ్డి మాత్రం తన నిర్ణయాన్ని సమీక్షించుకోలేదు. ఆచారి లాంటి వ్యక్తి ఎమ్మెల్యే అయితే ఆచారి మాటకు ఎదురు చెప్పడం, ఆయన అడిగిన దాన్ని కాదని చెప్పడం ఎవరికీ సాధ్యమయ్యేది కాదు. ఆయన్ని మరోలా చెప్పాలంటే రామాయణంలో వాలితో పోల్చుకోవచ్చంటారు ఆయన్ని దగ్గర నుంచి చూసిన వ్యక్తులు. వాలి ఎదురుగా ఎవరు ఉన్నా అవతలి వ్యక్తి బలం, ఆత్మవిశ్వాసం క్రమంగా తగ్గిపోతూ ఉంటాయి. వాలికి ఎవరు ఎదురు పడినా, ఎవరైనా వాలిని

ఎదుర్కొన్నా అవతలి వ్యక్తి బలహీనుడు కావాల్సిందే. అందుకే ఆయన్ని అంతటి రాముడైనా చెట్టు చాటుగా తుదముట్టించాల్సి వచ్చింది.

**అందుకే ఆచారిని అడ్డుకోవడంలో అన్ని శక్తులూ తెరచాటుగా పని చేశాయి. వ్యాపార వర్గాలు, అగ్రవర్ణ దురహంకార దుష్ట సమీకరణలు ఆచారి వైపు హైకమాండ్ మొగ్గు చూపకుండా చేశాయి. దాని ఫలితంగా అన్నభీమోజు కుటుంబానికి అంది వచ్చిన రాజకీయ అవకాశాన్ని చెన్నారెడ్డి మొగ్గలోనే శాశ్వతంగా సమాధి చేశాడు. బీసీల్లోని చైతన్యాన్ని, ధైర్య సాహసాలను, సమాజం పట్ల సామాజిక వర్గాల పట్ల బీసీలకు ఉండే అంకిత భావాన్ని దశాబ్దాలుగా, శతాబ్దాలుగా, సహస్రాబ్దాలుగా ధనిక వర్గాలు ఏ రీతిన స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారో ఆచారి ఉదంతమే ఓ తిరుగులేని సాక్ష్యం.**

అయితే కాంగ్రెస్ పార్టీ కోసం ఆచారి శక్తి సామర్థ్యాలను ఎంతగా వాడుకున్నారో రాష్ట్ర కాంగ్రెస్‌లోని కొందరు అగ్రనేతలు మాత్రం గుర్తుంచుకున్నారు. ఆచారికి టికెట్ ఇవ్వనందుకు చెన్నారెడ్డి మీద విమర్శలు వచ్చాయి. ఇతరులకు టికెట్ ఇచ్చినా ఫలితం దక్కిందా అంటే అదీ లేదు. ఆ సీటును చేజేతులా కమ్యూనిస్టులకు అప్పగించడంతో ఆనాటి పీసీసీ చాలా పశ్చాత్తాపపడింది. అందుకు కంటితుడుపు చర్యగా టి. అంజయ్య, తిప్పన కృష్ణారెడ్డి, పాల్వాయి గోవర్ధన్ రెడ్డిగారి చొరవతో పీసీసీ అధ్యక్షుడు మర్రి చెన్నారెడ్డిని

ఒప్పించి, ఆచారికి ఒక పెద్ద సివిల్ కాంట్రాక్ట్ లైసెన్సును ఇవ్వడం జరిగింది.

ఇక్కడ మరొక్క విషయం చెప్పుకోవాలి. ప్రాంతీయ రాజకీయ నాయకులు బలపడితే ఎంత బలమైన జాతీయ పార్టీలైనా ప్రేక్షక పాత్ర వహించక తప్పదని చెన్నారెడ్డి విషయంలోనే రుజువైంది. ఒప్పందం ప్రకారం పీసీసీ పగ్గాలను చెన్నారెడ్డి చేతుల్లో పెట్టాక కేంద్ర నాయకత్వం డూడూ బసవన్నలా తయారైంది. చెన్నారెడ్డి చెప్పినట్టల్లా ఆడాల్సి వచ్చింది. 1978 ఎన్నికల ప్రచారం కోసం ఇందిరాగాంధీ దేశమంతా పర్యటిస్తున్న క్రమంలో నల్గొండ జిల్లాకు కూడా వచ్చింది. అయితే ఆమె పర్యటనలో మిర్యాలగూడ తగలకుండా చెన్నారెడ్డి తెలివితేటలు ప్రదర్శించాడు.

కృష్ణారెడ్డి ఎంపీగా, ఆచారికి ఎమ్మెల్యేగా టికెట్‌లు ఇవ్వాలని, కనీసం ఆచారికైనా ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని అందరూ చెప్పి చూశారు. ఇదే విషయాన్ని కృష్ణారెడ్డి కూడా గట్టిగా చెప్పాడు. తనకు ఇవ్వకపోయినా ఫరవాలేదు. కానీ ఆచారికైనా టికెట్ ఇవ్వాలని మరీమరీ చెప్పాడు. కానీ చెన్నారెడ్డి ఒక నిర్ణయం తీసుకుంటే పునరాలోచించుకునే స్వభావం కాదు. అయితే కృష్ణారెడ్డి గురించి ఇంకో విషయం చెప్పుకోవాలి. వరుసగా మూడుసార్లు భారీ మెజారిటీతో గెలిచిన కృష్ణారెడ్డికి ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి పదవి ఎందుకు లభించలేదు? హాట్రిక్ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు లభించాయి. కృష్ణారెడ్డికి కూడా

మంత్రి పదవి ఖాయమైపోయింది. అందరూ దాని గురించి చర్చించు కుంటున్నారు. కానీ కృష్ణారెడ్డి మాత్రం మంత్రి పదవిని సున్నితంగా తిరస్కరించడం విశేషం.

కృష్ణారెడ్డి తన రాజకీయ జీవితంలో నీలం సంజీవరెడ్డి, దామోదరం సంజీవయ్య, కాసు బ్రహ్మానందరెడ్డి, పి.వి. నరసింహారావు, జలగం వెంగళరావు వంటివారితో పని చేశాడు. జలగం సీఎంగా ఉన్నప్పుడు ఆయన చాంబర్‌లోకి అపాయింట్‌మెంట్ లేకుండా వెళ్లగలిగిన నాయకుడు కృష్ణారెడ్డి ఒక్కడే అంటే అతిశయోక్తి కాదు. మరి కృష్ణారెడ్డికి మంత్రి పదవి, అందులోనూ మంచి పోర్టుఫోలియో రాకుండా ఎలా ఉంటుంది? అయితే ప్రజా జీవితంతో బాగా అనుబంధం పెంచుకున్న కృష్ణారెడ్డి ప్రజాసేవను ఆటంకపరిచే అంశాలకు ఎప్పుడూ దూరంగా



**19-8-1974న, మిర్యాలగూడ కొత్త బస్టాండ్ కొరకు భూమి పూజ నిర్వహిస్తున్న అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు గారితో ఆచారి.**




**గ్రామీణ సహకార బ్యాంక్ భవన నిర్మాణాని కొరకై భూమిపూజ నిర్వహిస్తున్న అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు గారితో ఆచారి.**

ఉండేవాడు. ఆయన మీద గాంధీజీ ప్రభావం బాగా ఉండేది. హరిజనులకు ఆలయ ప్రవేశం, వారి సామాజిక సమానత్వం కోసం పని చేయడం, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పనిచేయడం, మహిళా విద్య కోసం కార్యక్రమాల రూపకల్పన వంటివి ఆయన ఎజెండాలో ముఖ్యమైన అంశాలు. ఆయన తన నివాస గృహాన్ని కూడా ఆ కాలంలో హరిజన వాడకు ఆనుకునే కట్టించుకొని వారి ఆత్మగౌరవం పెంచడానికి కృషిచేశాడు. తాను మంత్రి పదవి తీసుకున్నట్టయితే తలపెట్టిన సామాజిక కార్యక్రమాలు ఎక్కడ ఆగిపోతాయోనని ఆయన ఫీలింగ్. అందుకే మంత్రి పదవికి ఆయన ప్రాముఖ్యత ఇవ్వలేదు. కానీ ఆచారికి టికెట్ ఇవ్వాలని మాత్రం పదే పదే అడిగాడు. కానీ పీసీసీ పీఠం మారాక ఆ




**ఆచారి హయాంలో 1976లో పూర్తైన మిర్యాలగూడ బస్టాండ్**

గురుశిష్యులు ఇద్దరికీ చెక్ పెట్టేశాడు చెన్నారెడ్డి. అందుకే ఇందిరాగాంధీ నల్లగొండ పర్యటనకు వచ్చినప్పుడు మిర్యాలగూడను ప్రోగ్రామ్ షెడ్యూల్ నుంచి తప్పించాడు. అందుకు బదులుగా ఇందిరా మీటింగ్‌కు దాదాపు 50 లారీల్లో జనాన్ని, ఓ పది జీపుల్లోకాంగ్రెస్ నాయకులను తరలించారట. ఇందిరను దేవరకొండలో కలుసుకొని వచ్చారు. అప్పుడే చెన్నారెడ్డి నిర్వాకం మీద ఇందిరకు కాంగ్రెస్ ముఖ్య నేతలంతా ఫిర్యాదు చేశారు. చెన్నారెడ్డి కక్ష సాధింపు రాజకీయాలు, రాజకీయ తప్పటడుగుల కారణంగా మిర్యాలగూడ సీటును కాంగ్రెస్ కోల్పోవాల్సి వచ్చింది. పరోక్షంగా కమ్యూనిస్టులు పుంజుకోవడానికి, భవిష్యత్తులో వారు మరింత ఎదగడానికి ఆ చర్య దోహదపడిందనే చెప్పాలి.

అయితే కృష్ణారెడ్డి, ఆచారి మధ్య పెనవేసుకున్న గురు శిష్య సంబంధం మిర్యాలగూడ ప్రగతిని పరుగులు పెట్టించింది. కృష్ణారెడ్డి తలపెట్టిన పనులు, ఆచారి తలపెట్టిన పనులు

నియోజకవర్గ రూపు రేఖలను మార్చేశాయంటే అతిశయోక్తి కాదు. మంత్రి కాగలిగే అవకాశం వచ్చినా తిరస్కరించిన కృష్ణారెడ్డి... ప్రభుత్వం దగ్గర అన్ని పనులకు ఆమోద ముద్ర వేయించాడు. 1975లో ఆచారి మార్కెట్ కమిటీ చైర్మన్ అయ్యాక అభివృద్ధి పనుల వేగం మహా జోరుగా సాగింది. 1974లోనే మిర్యాలగూడ షుగర్ ఫ్యాక్టరీ, మిర్యాలగూడ కొత్త బస్టాండులకు శంకుస్థాపన జరిగింది. కొత్త బస్టాండ్ నిర్మాణాన్ని పూర్తి చేయించింది ఆచారే. 1974లో మొదలుపెట్టిన పనులు 1976లో పూర్తయ్యాయి. కేవలం 2 ఏళ్లలోనే మిర్యాలగూడ కొత్తరూపం సంతరించుకుంది. ఇద్దరూ జోడెడ్ల లాగా తయారై మిర్యాలగూడను మార్చేశారు. ఆ కాలంలోనే సహకార బ్యాంకు ఏర్పాటు చేశారు.

ఇక గర్ల్స్ హైస్కూల్, మార్కెట్ గోడౌన్లు ఆచారి పూనికతో, శ్రద్ధతో రూపు దాల్చినవే.

ఆచారి గురువుతో కలిసి చేసిన పనులే కాక స్వయంగా పూనుకొని చేసిన పనులు చాలానే ఉన్నాయి. మిర్యాలగూడ మార్కెట్ యార్డులో ప్రతి నిత్యం దొంగతనాలు జరుగుతుండేవి. రైతులు తెచ్చిన ధాన్యాన్ని రాత్రి సమయాల్లో దొంగలు దోచుకుపోయేవారు. ఆచారి మార్కెట్ కమిటీ చైర్మన్ అయ్యే వరకు రైతులు పండించిన పంటను మార్కెట్‌లో అమ్ముకోవడానికి సరియైన వసతులు ఉండేవి కావు. కనీసం మార్కెట్‌యార్డు చుట్టూ ప్రహరీ గోడ గానీ, పంటను పెట్టడానికి షెడ్డులు గానీ ఉండేవి కావు. అంతేకాదు..

రైతులు విశ్రాంతి తీసుకునే కనీస సౌకర్యం లేదు. మరుగుదొడ్లు ఊహకైనా అందవు.

ఒకరోజు 500 వందల మంది రైతులు ఒక్కసారిగా మార్కెట్ ఆఫీసును చుట్టిముట్టి నినాదాలు చేయసాగారు. అనుకోని ఈ హఠాత్ పరిణామానికి మార్కెట్ ఆఫీసు సిబ్బంది కంగారు పడిపోయారు. ఏం జరిగిందని ఆరా తీస్తే, రైతు పండించిన పంటను అమ్మాలంటే చాలా మంది చేతులు మారాలి. ధాన్యాన్ని తూకం వేసే దడవాయిలు, వాటిని బస్తాలలో నింపే హమాలీలు, హమాలీలకు సహాయపడే ఆడ కూలీలు, చివరకు మార్కెట్ ఆఫీసు సిబ్బంది, ఆపై మిల్లు గుమాస్తా ఇలా అందరి చేతులు తడిపితేనే, విక్రయ ప్రక్రియ ముందుకు సాగేది. అది కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్న తంతు. ఆ రోజు ఆచారి ఆఫీసులో లేడు. రైతులందరూ రోడ్డు మీద కూర్చొని ధర్నా మొదలు పెట్టారు. ఆ విషయం తెలియడంతోనే ఆచారి బుల్లెట్ బండి మీద ఆ స్థలానికి చేరుకున్నాడు.

ఇటువంటి పంచాయతీలు చేయడంలో ఆచారి దిట్ట. ఒక్కసారిగా తన గంభీర గళంతో “మీలో ఎవరైనా ఐదారుగురు రైతులు ముందుకు వస్తే నేను మీ సమస్యలను వింటా” అని ప్రకటించాడు. దీంతో అక్కడ ఒక్కసారిగా నిశ్శబ్దం అలముకుంది. ముందుకొచ్చిన రైతుల సమస్యలు టైప్ చేయించి, అందరి దగ్గర సంతకాలు తీసుకుని వాటి పరిష్కారానికి హామీ ఇచ్చాడు ఆచారి.

వారి సమస్యల్లోంచి కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కారం చూపాడు. ధాన్యాన్ని కాంటాలకు ఎక్కించే దడవాయిలు, ధాన్యాన్ని బస్తాల్లోకి ఎక్కించే హమాలీల కూలీలను పెంచాడు. హమాలీలకు తోడుగా వుండే ఆడకూలీలకు ఇచ్చే కూలీని కూడా అదేరోజు పెంచేస్తూ నిర్ణయం ప్రకటించాడు.

ఇక ఆ తరువాత ధాన్యాన్ని దొంగిలించిన కొందరు దొంగలను పట్టుకొని ఆచారి తన వెంట ఎప్పుడూ ఉండే రూల్ కర్రతో దండించాడు. ఆ సమస్యను అంతటితో ఆపకుండా శాశ్వత పరిష్కారం చూపాలని నిర్ణయించాడు. అప్పటి మంత్రిగారిని మిర్యాలగూడ పిలిపించి ఆయన దృష్టికి తీసుకెళ్ళి ప్రభుత్యం ద్వారా పరిష్కారం అయ్యేలా చొరవ తీసుకున్నాడు. ఆచారి చొరవతో అక్కడ జరిగిన పనులు ఇవీ.

1. మిర్యాలగూడ మార్కెట్‌యార్డు చుట్టూ ప్రహరీ గోడ.

2. మార్కెట్ యార్డులో ధాన్యం పోసి ఉంచడానికి రేకుల షెడ్డులు.

3. రైతులకోసం విశ్రాంతి భవనం.

4. మూగ జీవులకు నీళ్ల సదుపాయం.

5. అందరికీ మంచి నీళ్లు అందేలా వాటర్ ట్యాంకు.

6. ధాన్యాన్ని నిల్వ ఉంచడానికి గోదాములు.

7. ఆ రోజుల్లో ఆర్థిక వ్యవస్థ అంతా పంటల పైనే ఆధారపడి ఉండేది. కానీ వాటిని మార్కెట్ యార్డుకు తీసుకొని రావడానికి

సరియైన రోడ్డు వ్యవస్థ వుండేది కాదు. దాన్ని ఆచారి గుర్తించి, అన్ని ముఖ్య గ్రామ పంచాయతీలను మిర్యాలగూడకు కలుపుతూ రోడ్లు వేయించాడు.

అదే సమయంలో దామరచెర్ల నుండి మిర్యాలగూడకు రైతులు ధాన్యం తీసుకురావడం కష్టం అవుతుందని, ప్రభుత్వాన్ని ఒప్పించి అక్కడే మరో కొత్త యార్డును ఏర్పాటు చేయించాడు. అలాగే నిడమనూరు మార్కెట్ యార్డును మంజూరు చేయించాడు.

అదేవిధంగా శ్రీవీరబ్రహ్మేంద్రస్వాముల వారి దేవాలయాన్ని కట్టాలని కులపెద్దలు నిర్ణయించడమే తరువాయి, ఆచారి గారు తన వంతుగా దేవాలయం కోసం భూమి కొని, దగ్గరుండి దేవాలయ నిర్మాణం చేయడమే గాక, మూడు రోజులు నియమనిష్టలతో తన చేతులమీదుగా విగ్రహ ప్రతిష్ట గావించాడు.



**శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్టలో అన్నభీమోజు సైదయ్య, సక్కుబాయమ్మ గారు, గడగోజు భిక్షపతి గారు, అన్నభీమోజు ఆచారి, ధనమ్మ గార్లు.**







## శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ధ్వజస్థంభ ప్రతిష్ట

# గర్ల్స్ హై స్కూల్ ఏర్పాటు ఘట్టం

గర్ల్స్ హై స్కూల్ ఏర్పాటుకోసం ఆచారి తీసుకున్న చొరవను ప్రత్యేకంగా చెప్పుకోవాల్సి ఉంటుంది. బాలికల ఉన్నత పాఠశాల ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అంగీకరించడం, అందుకోసం స్థలాన్ని నిర్ణయించడం కూడా జరిగిపోయాయి. ఆ స్థలంలోనే ఎస్సీలు దాదాపు 100 కుటుంబాలు ఉంటున్నాయి. అది ప్రభుత్వ స్థలం. అక్కడ గర్ల్స్ హై స్కూల్‌కు సరిపడినంత స్థలం ఉందని చెప్పి హై స్కూల్‌కు కేటాయించారు. కానీ అక్కడ తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్న ఆ కుటుంబాలను ఖాళీ చేయించడం ఓ పెద్ద సవాలుగా మారింది. వారంతా ఎస్సీలు అనే సున్నితమైన అంశం కన్నా కూడా పెద్ద సంఖ్యలో వారు ఉండడం, ఖాళీ చేయించడానికి వెళ్లిన అధికారులు గానీ, నాయకులు గానీ చేతులెత్తేసి వెనుతిరుగుతున్నారు. సీపీఎం బృందాలు సైతం అక్కడికి వెళితే అసహాయులై వెనక్కి వచ్చేస్తున్నారు. తాము ఉంటున్న ఆ స్థలాన్ని తమకే పట్టాలు చేయాలని, ఇతర కార్యక్రమాలకు తాము అంగీకరించేది లేదని ఎస్సీలంతా భీష్మించుకొని ఉన్నారు. పది, పదిహేను కుటుంబాలైతే నాయకులకు సులభమై ఉండేదేమో, కానీ 100 కుటుంబాలు కావడం, వారు సంఘంగా ఏర్పడి నాయకులను అధికారులను హడలెత్తిస్తున్నారు. దీంతో వారిని ఖాళీ చేయించే ప్రక్రియ నెలలకొద్దీ వాయిదాలు పడతోంది. అటు ఆడపిల్లల పేరెంట్స్ నుంచి విమర్శలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆ పనిని కృష్ణారెడ్డి

ఆచారికి పురమాయించాడు. నువ్వేం చేస్తావో నాకు తెల్వదు. ఆ ఎస్సీ కాలనీ పంచాయతీని సెటిల్ చేయాలి అని చెప్పాడు. దీంతో మరుసటి రోజు ఉదయాన్నే పంచాయతీకి ముహూర్తం ఫిక్స్ చేశాడు ఆచారి.

ఎస్సీ కాలనీలో పంచాయతీని విజయవంతంగా నిర్వహించడానికి అవసరమైన మందీ మార్బలం ఆ రోజు ఉదయాన్నే ఆచారి ఇంటికి చేరుకున్నారు.ఆర్డీవో స్థాయి అధికారులు, ఇతర ప్రభుత్వాధికారులు, వారికి రక్షణగా పోలీసులు వచ్చారు. వారందరినీ ఎస్సీ కాలనీకి వెళ్లిపోవాలని సూచించాడు ఆచారి. ఉదయం 8 గంటల ప్రాంతానికే ప్రభుత్వాధికారులంతా చేరుకున్నారు.

ప్రభుత్వాధికారులను చూడగానే అందులోని నాయకులంతా యథాప్రకారం గొడవ చేయడం ప్రారంభించారు. వారేం చెప్పినా తాము ఆ స్థలాన్ని వదిలేది లేదని, కాదని ముందుకొస్తే ఎంతకైనా తెగిస్తామని హెచ్చరిస్తున్నారు. ఆసలు అధికారులను చాడగానే కాలనీలోని మహిళలంతా ముందు వరుసలోకి వచ్చేశారు. దీంతో ఈ అంశాన్ని ఎలా డీల్ చేయాలో తెలియక అధికారులంతా సతమతం అవుతున్నారు. రూల్స్ ప్రకారం పోతే లాఠీచార్జీ జరగొచ్చు, కాల్పులే జరగొచ్చు. అలా జరిగితే విషయాన్ని డీల్ చేయలేని అసమర్థులు అనే పేరొస్తుంది. ప్రభుత్వం బద్నాం అవుతుంది. వారేమో మరోచోట స్థలాలు ఇస్తామని చెప్పినా వెళ్లము అంటున్నారు. కాలనీ ప్రజలు రెచ్చి పోతున్నారు. అధికారులేమో

మెత్తబడుతున్నారు. వారితో వాదించి, వాదించి శక్తిహీను లవుతున్నారు.

సరిగ్గా 10 గంటల ప్రాంతంలో ఆచారి తన బుల్లెట్ బండి మీద పంచాయతీ ప్రదేశానికి చేరుకున్నాడు. అప్పటికే ఆచారికోసం అక్కడ ఓ కుర్చీ వేయబడి ఉంది. ఆ కుర్చీకి అటు, ఇటుగా మరికొన్ని కుర్చీలు వేశారు. అధికారుల ముందు కాలనీ ప్రజలంతా పిల్లా పాపలతో ఉన్నారు. ఆచారిని చూడగానే కోలాహలం అంతా సద్దుమణిగింది. ఆచారిని చూడగానే అంతా నిశ్శబ్దంగా పక్కకు తప్పుకున్నారు. చాలామంది పెద్దలు ఆచారికి దండాలు పెడుతూ సైడ్ అయిపోయారు. ఆ సమయంలో ఆచారి అచ్చమైన సైనికాధికారిలా కనిపిస్తున్నాడు. యుద్ధానికి వెళ్లే సైనికుడు ఎలా ఉంటాడో అలాంటి గెటప్‌లో ఉన్నాడు. భుజానికి తుపాకీ తగిలించి ఉంది. అందులో తూటాలు నింపుకునే వచ్చేశాడు. ఇక భుజం నుంచి వీపుకు అడ్డంగా తూటాల మాల కూడా రెడిగా ఉంది. ఆయన ముఖం, చూపులు, నడక చూస్తుంటే పంచాయతీ చెప్పడానికైనా ఓకే, వంచనను ఎదుర్కోవడానికైనా ఓకే అన్నట్టుగా కనిపిస్తోంది.

తనకోసం వేసిన కుర్చీలో కూర్చొని "మీరేం చెప్పుకుంటారో చెప్పుకోండి" అన్నట్టుగా వాదనలకు అనుమతి ఇచ్చాడు. ఇప్పుడు కాలనీ ప్రజలంతా వరుసగా ఒక్కొక్కరే మాట్లాడుతున్నారు. ఇంతకు ముందులాగా అధికారుల మీద దురుసుగా మాట్లాడటం లేదు.

అయితే ఒక అరగంట తరువాత క్రమంగా మళ్లీ పాత పంథాలోకే వాతారణం మారుతోంది. అధికారులు కూడా పాత పద్ధతిలోనే కన్విన్స్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. వీళ్ల కన్విన్సింగ్ ధోరణి వారికి అలుసుగా మారుతోంది. మీరు పాఠశాల ఎక్కడ కట్టుకుంటారో మీ ఇష్టం... మేం మాత్రం ఇక్కణ్నే ఉంటాం... ఏం చేసుకుంటారో చేంసుకోండి అనే వాదనవైపే పంచాయతీ వెళ్లిపోతోంది. ఆచారి వచ్చిన తరువాత కూడా వాదనలు అదుపు తప్పుతున్నాయి. అప్పటిదాకా ఒక్క మాట కూడా మాట్లాడని ఆచారి ఒక్కసారిగా కుర్చీలోంచి లేచి పట్టరాని ఆగ్రహంతో ఆ కుర్చీని వెనక్కి ఒక్క తన్ను తన్నాడు. ఆ తన్నుకు చెక్క కుర్చీ ఆచారికి వెనకాల దూరంగా ఉన్న చెట్టును తాకి పడిపోయింది.

ఈ హఠాత్ పరిణామానికి అక్కడున్న వారంతా బండరాళ్లలాగ మారిపోయారు. అంతా ఆచారి వైపే చూస్తున్నారు. ఆచారి కళ్లు నిప్పులు కురిపిస్తున్నాయి. భుజానికి తగిలించి ఉన్న తుపాకీని చేతుల్లోకి తీసుకున్నాడు. ఈ ఒక్క "భౌతిక మార్పే" తీర్పు ఎలా ఉండబోతుందో సచిత్రంగా కమ్యూనికేట్ చేసింది.

ఆచారి బలమైన గొంతు మరింత బలమైన తీర్పును పాస్ చేసింది. "అరేయ్... మన దగ్గర 2, 3 చోట్ల సర్కార్ భూములున్నై. మీరు యాడ గవాల్నంటే గాడనే జాగాలు ఇప్పిస్త. జాగాలు ఇప్పిచ్చుడే గాదు... ఇండ్లు గూడా సర్కారుతోటే కట్టిపిస్త... మీ వెంట ఆచారి ఉన్నాడు, పార్టీ ఉన్నది, ప్రభుత్వం ఉన్నది. ఈ జాగా మాత్రం ఖాళీ చెయ్యాలె గంతే".

ఆచారి హుంకారం కొద్ది నెలలుగా నలుగుతున్న సమస్యను పరిష్కరించింది. అధికార యంత్రాంగం, ప్రభుత్వ వ్యవస్థ చూపలేని పరిష్కారం ఆచారి చూపించాడు. అంతా మౌనముద్ర దాల్చారు. ఏ ఒక్కరూ మారు మాట్లాడలేదు. అంతా తలలు వాల్చుకొని తమ అంగీకారం తెలిపారు. బహుశా అందుకేనేమో రాజనీతి కోవిదులు కొందరిని "Enlightened despots" అంటూ కీర్తించారు. ఆచారి లాంటి అరుదైన వ్యక్తిత్వాలను చూసే అలాంటి అద్భుతమైన పదాన్ని సృష్టించి ఉంటారు. ఆ పద బంధానికి అర్థం "వివేకవంతులైన నియంతలు'' లేదా ''ధర్మబద్ధమైన నియంతలు''' లేదా "జ్ఞానవంతులైన నియంతలు". ఇలాంటి న్యాయాన్ని ఏ కోర్టులు కూడా అందించవేమో. ఆచారి డీల్ చేసిన పంచాయతుల్లో ఇలాంటివి ఎన్నో ఉన్నాయి.

ఇలా మిర్యాలగూడ తాలుకాలో ఏ పెద్ద పంచాయతీ అయినా తెగకపోతే చివరి అస్త్రంగా అందరూ ఆచారినే సంప్రదించేవారు. ఈ సంప్రదాయం ఆచారి చనిపోయేవరకు కొనసాగింది.

# 11. అన్నభీమోజు కుటుంబంలో చీకటి అధ్యాయం

మిర్యాలగూడలో డాక్టర్ దశరథ్‌బాబు ఉదంతం తరువాత, ఒకానొక సందర్భం ఎలా ఆవిర్భవించిందంటే అన్నభీమోజు ఆచారి కుటుంబానికి ఎదురులేని వాతావరణం ఏర్పడింది. పరువు, ప్రతిష్టలతో పాటు వ్యాపారాలు, ధనసంపాదనలకు లోటులేదు. అన్నిటికీ మించి రాజకీయ పలుకుబడి ఆ కుటుంబాన్ని మెరుపులు మెరిపిస్తోంది. ధన, కనక, వస్తు, వాహనాది అనేక రూపాల్లో లక్ష్మీదేవి అందెల సవ్వడి అనుక్షణం వారియింట ప్రతిధ్వనిస్తోంది. రెండు టింబర్ డిపోలు, ఒక ఇంజినీరింగ్ వర్క్‌షాప్‌లో వినిపించే యంత్రాల తాలూకు శబ్దాలు మిర్యాలగూడలో ఆ కుటుంబానికి ఏర్పడిన పేరు ప్రతిష్టలకు ప్రతిధ్వనులుగా వినిపించసాగాయి. అటు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కొత్త బాధ్యతల్లో కొలువుదీరిన అన్నభీమోజు ఆచారి యొక్క ప్రభ మధ్యందిన మార్తాండునిలా ప్రకాశించసాగింది.

ఎమ్మెల్యేను, ఒక మంత్రిని మించిన అనుచర గణం ఆచారికి ఆభరణాలుగా అమరినాయి. ఆచారి మీద ఉండే అభిమానం, ఆయన వల్ల తమకు జరుగుతున్న పనులు, ప్రయోజనాల వల్ల

నియోజక వర్గంలోని రైతులు తమకు తోచినంతగా, కృతజ్ఞతా పూర్వకంగా ధాన్యాన్ని ఆచారి ఇంటికి పంపించేవారు. పళ్లు, కూరగాయలకు ఒక లెక్కంటూ ఉండేది కాదు. ఆ ధాన్యం, ఆ కూరగాయలే ఆచారి ఇంటి నిండా జనానికి, కూలీలకు, ఉ ద్యమకారులకు, ఇతర గ్రామాల నుంచి వచ్చిన అతిథులకు అన్నపానీయాలుగా మారిపోయేవి. ప్రతినిత్యం అన్నభీమోజు కుటుంబంలో అన్న సంతర్పణ జరుగుతున్న సందడి కనిపించేది. ఆచారి మార్కెట్ కమిటీ చైర్మన్ అయ్యాక ఆ ఇల్లే ఒక అన్నపూర్ణగా మారిపోయింది. వ్యాపారాలు, కుల సంఘాల ఏర్పాట్లు, కాంట్రాక్టు వ్యవహారాలు, రాజకీయ సమావేశాలు, పంచాయతీలు, సెటిల్‌మెంట్లు, పార్టీలు, సెలబ్రేషన్లు... ఇలా ఒక్కటి కాదు. ఆచారి జీవితమే సప్తవర్ణ శోభితంగా అలరారుతోంది.

ఎవరికైనా సంఘంలో పేరు-ప్రతిష్టలు, గౌరవమర్యాదలు లభిస్తున్నాయంటే దాని వెనకాల ఈర్ష్యాసూయలు కూడా పురుడు పోసుకుంటాయి. ఇది సహజం. కార్ఖానాలు, వ్యాపార రంగాల్లో రాణిస్తున్నప్పుడే అన్నభీమోజు కుటుంబాన్ని చూసి అసూయ పడేవారు ఉండేవారు. ఇక ఆ ఇంటినుండి ఒక రాజకీయ ప్రముఖుడు ఆవిర్భవిస్తే ఆ అసూయ ఎన్ని రెట్లకు పెరుగుతుందో ఊహించుకోవాల్సిందే. ఆచారి ఎదుగుదలను అందరూ ఆశీర్వదిస్తే అందులో కొందరు నోటితో నవ్వి నొసటితో వెక్కిరించేవారూ తయారయ్యారు. ఆచారి తన పంథాలో తాను పని చేసుకు

పోతున్నట్టే, ఆయా దుష్ట శక్తులు కూడా చాపకింద నీరులా పని చేసుకుంటూ పోతున్నాయి.

*          *          *

**అది 1979 ఆగస్టు 15.**

మార్కెట్ కమిటీ చైర్మన్ హోదాలో ఆచారి జెండా వందన కార్యక్రమంలో పాల్గొన్నాడు. ఆ రోజంతా ఉల్లాసంగా, ఆనందంగా గడిపాడు. ఆచారి వెంట కందుకూరి రాంరెడ్డి అనే నీలాయిగూడెం మాజీ సర్పంచ్ గత నాలుగైదు రోజులుగా ఉంటున్నాడు. ఇతను మిర్యాలగూడ సమితి ప్రెసిడెంట్‌గా కూడా చేశాడు. ఆ సమయంలోనే రాంరెడ్డికి, ఆచారితో పరిచయం ఏర్పడింది. మిర్యాలగూడ సమితి ఆఫీసును నిర్మాణం చేసింది కూడా



మిర్యాలగూడ సమితి కార్యాలయము

అన్నభీమోజు ఫ్యామిలీనే. ఆ భవనం ఇప్పటికీ చెక్కు చెదరకుండా వుంది. ఆచారి క్రియాశీల, చైతన్యవంతమైన రాజకీయాలు, ధైర్యసాహసాల కారణంగా ఆచారితో రాంరెడ్డి స్నేహం పెంచుకున్నాడు. రాంరెడ్డికి కమ్యూనిస్టులతో గొడవలున్నాయి. కమ్యూనిస్టులు షురూ చేసిన డీల్‌లో ఎవరైనా తల దూరిస్తే వాళ్లకు మూడిన కిందే లెక్క. వారు మొదలు పెట్టిన డీల్ ఎలాంటిదైనా వారు మాత్రమే క్లోజ్ చేయాలి.

ఇలాంటి డీల్స్‌తోనే పార్టీకి ప్రతిష్ట పెరుగుతుందని, ఊళ్లలో సామాన్య ప్రజలెవరూ పల్లెత్తు మాట  అనడానికి సాహసించరని, అదే కమ్యూనిస్టు పార్టీ ప్రాభవానికి శ్రీరామరక్ష అనే పెత్తందారీ మనస్తత్వం లెఫ్ట్ లీడర్లలో ఉంది.

అయితే నీలాయిగూడెంలో నలుగుతున్న ఓ భూ పంచాయతీలో రాంరెడ్డి ఎంటరయ్యాడు. రాంరెడ్డి ఏ రాజకీయ పార్టీలోనూ లేడు. ఎవరి అండా లేకుండా రాంరెడ్డి కమ్యూనిస్టులతో పంచాయతీని తేల్చుకోవడం అసంభవం. అయినా కమ్యూనిస్టులకు ఎదురు నిలిచాడు. కానీ ఆ బలం సరిపోలేదు. వారి దాడులను, అరాచకాలను తిప్పి కొట్టాలన్నా మరో బలమైన అండ అవసరం. అందుకే రాంరెడ్డి ఆచారి శరణుజొచ్చాడు. తనను మాజీ ఎమ్మెల్యే తిప్పన కృష్ణారెడ్డి దగ్గరకు తీసుకుపోవాలని, ఆయన హామీ ఇస్తే తనకు రక్షణ దొరుకుతుందని, ఆ పని చేసి పెట్టమని ఆచారిని బ్రతిమిలాడాడు రాంరెడ్డి. రాంరెడ్డితో అప్పటికే స్నేహం, విశ్వాసం

ఉండడంతో రాంరెడ్డికి అభయమిచ్చాడు ఆచారి. కృష్ణారెడ్డి దగ్గరకు తీసుకుపోయాడు.

"చెప్పు ఆచారి. ఏం సంగతీ?" అడిగాడు కృష్ణారెడ్డి.

"సార్, ఇతను రాంరెడ్డి. నీలాయిగూడెం మాజీ సర్పంచ్. వాళ్ల ఊరిలో ఒక భూమి పంచాయతీ విషయంలో కమ్యూనిస్టులు ఎంటరైంద్రట. ఆ పంచాయతీని తెగనిస్తలేరు. మీ అండదండలు, మన సాయం కోరి వచ్చిండు" అంటూ ఆ మొత్తం వృత్తాంతాన్ని కృష్ణారెడ్డికి పూసగుచ్చాడు ఆచారి.

కానీ రాంరెడ్డి పట్ల కృష్ణారెడ్డికి నమ్మకం కుదరలేదు. అవసరం కోసం వచ్చి సాయం అడిగే వారితో తనకు గానీ, పార్టీకి గానీ ఎలాంటి ఉపయోగం ఉండదని, అలాంటప్పుడు అనవసరంగా ఎందుకు రిస్కు తీసుకోవాలనేది కృష్ణారెడ్డి ఆలోచన. రాంరెడ్డి వైపు అనుమానంగానే చూశాడు. అయినా తీసుకొచ్చింది ఆచారి. ఆచారి ఒక విషయాన్ని టేకప్ చేస్తే అది పూర్తి కావాల్సిందే. ఆచారిని కృష్ణారెడ్డి కాదనలేడు. అందుకని మధ్యేమార్గంగా కృష్ణారెడ్డి ఓ ప్రతిపాదన పెట్టాడు. రాంరెడ్డి నీలాయిగూడెంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలనేది ఆ షరతు.

"కాంగ్రెస్ జెండా ఎగరేస్తే నువ్వు నావాడివి. అప్పుడే నేను నిన్ను నమ్మగలను". ఇదీ కృష్ణారెడ్డి కోరుకున్న కమిట్‌మెంట్.

రాజకీయాల్లో ఉన్నవారి స్వచ్ఛతకు ఇలాంటి పరీక్షలు ఈ రోజుల్లో ఊహించగలమా? అయితే రాంరెడ్డి అందుకు

ఒప్పుకున్నాడు. ఆయన వరకు జెండాతో పనిలేదు. ఆయనకు కావాల్సింది కమ్యూనిస్టు ఫ్యాక్షన్ నుంచి రక్షణ మాత్రమే. కృష్ణారెడ్డి సరే అంటే, ఆయన ఆమోదముద్ర పడితే ఆచారి రక్షణ ఖాయమైపోతుంది. ఒకవేళ రాంరెడ్డి కోసం ఆచారి అంతగా చొరవ తీసుకోకపోతే, తన దారిలో తాను వెళ్లిపోతే పరిస్థితి మరోలా ఉండేదేమో. రానున్న ఉపద్రవాన్ని ఎవరు మాత్రం తప్పించగలరు? రాంరెడ్డికి ఇచ్చిన మాట ప్రకారం ఆయన్ని తన ఇంట్లోనే పెట్టుకొని అనుక్షణం రక్షణ కల్పిస్తున్నాడు ఆచారి.

## అంతిమ ఘడియలు

జెండా వందనం జరిగిన మరుసటి రోజు, అంటే 16-08-1979న ఉదయం నుంచీ రాంరెడ్డిని తనవెంటే పెట్టుకొని తన కార్యక్రమాల్లో మునిగిపోయాడు ఆచారి.

పొద్దంతా రాజకీయ, వ్యాపార కార్యకలాపాల్లో బిజీగా ఉండడం, సాయంత్రం దగ్గరి వాళ్లతో ఆత్మీయతను కలబోసుకోవడం, మందు పార్టీలో అన్ని ముచ్చట్లూ మాట్లాడుకోవడం ఆచారి దినచర్య. ఆగస్టు 16 సాయంత్రం కూడా యథాప్రకారం పనులు ముగించుకొని ఇంటి కెళ్తున్న క్రమంలో రాంరెడ్డితో కలిసి బార్‌లో కూర్చున్నాడు ఆచారి.

మిర్యాలగూడలో రత్నయ్య లాడ్జి అనేది ఓ భారీ అడ్డా. ఈ బిల్డింగ్‌ని కూడా ఆచారి ఫ్యామిలీనే కట్టించడం విశేషం. అక్కడే

రెస్టారెంట్ నడుస్తుంటాయి. ఆచారి, రాంరెడ్డి తాము ఎప్పుడూ కూర్చుండే టేబుల్‌నే ఆక్యుపై చేశారు. ఇక లాడ్జి మొదటి అంతస్తులో రత్నయ్యతో కలిసి సైదయ్య కూడా తమకోసం కేటాయించిన ప్రత్యేకమైన గదిలో సిట్టింగ్ వేసుకున్నారు. రత్నయ్య మరో వ్యక్తితో కలిసి సిట్టింగే షేర్ చేయడు. సైదయ్యతో మాత్రమే ఆయన ప్రైవసీ మెయింటెయిన్ చేస్తాడు.

ఇక్కడ గ్రౌండ్ ఫ్లోర్‌లో రాంరెడ్డి, ఆచారి టేబుల్ దగ్గర ముచ్చట్లు నడుస్తున్నాయి.

మందు ఆర్డర్ చేశాడు ఆచారి. మందుతో పాటు స్టఫ్ వచ్చేలోపు ముచ్చట్లలో పడ్డారు ఇద్దరూ.

"రాంరెడ్డీ ఏం నడుస్తున్నాయి సంగతులు!?" మాటలు షురూ చేశాడు ఆచారి.

నీకు దెల్వని సంగతులు ఏమున్నాయి! అన్నాడు. కొత్త సంగతులేవీ లేవన్నట్టు.

"మనం అనుకున్నట్టు తిప్పన కృష్ణారెడ్డికి గానీ, నాకు గానీ టిక్కెట్టు రాకపాయె. మర్రి చెన్నారెడ్డి డ్రామాలు జేసి సీపీఎం వోల్లను గెలిపిచ్చె. మరి వాళ్లేం అనుకుంటుండ్రు?" ఆరా తీశాడు ఆచారి.

"కమ్యూనిస్టోల్లు నా మీద కక్ష గట్టిండ్రు. వాల్ల గురించి మనకు తెల్వంది ఏమున్నది? ఎట్లుంటదో అన్పిస్తుంది" అంటూ ఒకింత భయాన్ని వ్యక్తం చేశాడు రాంరెడ్డి అసలు విషయంలోకి దిగుతూ.

"ఏహె... దాని గురించి నువ్వేం రంది పడకు. నీ దగ్గరికి రావాల్నంటే ముందుగాల నన్ను దాటుకొని పోవాలె. నీకు ఇదివరకే చెప్పిన గదా? నువ్వు బేఫికర్‌గ ఉండు" అంటూ మరోసారి రాంరెడ్డిలో ధైర్యం నూరిపోసే ప్రయత్నం చేశాడు ఆచారి.

ఆచారికి శత్రువుల్లేక పోవడమే ఆయనకు ఉన్న ధైర్యం. ఆచారి కాంగ్రెస్‌లో ఉన్నా, మాజీ ఎమ్మెల్యే కృష్ణారెడ్డికి కుడి భుజం అయినా తను పార్టీలకు అతీతంగా ఉండేవాడు. అందువల్లే కమ్యూనిస్టు ప్రభావం మెండుగా ఉండే కుల సంఘాలు అన్నీ ఆచారి చేతుల్లోనే ఉండడం గమనించాల్సిన అంశం. బహుశా ఆ ధీమా, ఆ నమ్మకంతోనే రాంరెడ్డికి అభయ దానం చేశాడు ఆచారి. తాను రాంరెడ్డికి రక్షణగా ఉన్నాడన్న విషయం మిర్యాలగూడ రాజకీయ గ్రూపులు అన్నిటికీ తెలియడం కోసమే అతన్ని వెంట పెట్టుకొని తిరుగుతున్నాడు. అలా రాంరెడ్డి వైపు ఎవరూ కన్నెత్తి చూడరాదనేది ఆచారి ఉద్దేశం.

మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన కృష్ణారెడ్డికి టికెట్టు రాకపోవడం అనేది కమ్యూనిస్టులకు భారీ సెలబ్రేషన్‌గా మారింది. అయితే కృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా లేకపోయినా మార్కెట్‌కమిటీ చైర్మన్‌గా ఆచారి ఉండడం కాంగ్రెస్‌కు ఊరటనిచ్చింది. కానీ ఆచారికి ఉండే దూకుడు స్వభావం వల్ల కృష్ణారెడ్డి దగ్గర ఉండే నమ్మకస్తులు, అనుచరులు అప్పటికే ఆచారి వైపు వచ్చేశారు. కృష్ణారెడ్డి ఓటమి తరువాత ఆ స్థానాన్ని ఆచారి దాదాపుగా ఆక్రమించేశాడు. దీంతో

మిర్యాలగూడలో లెఫ్ట్ ప్రస్థానానికి ఆచారి అండ్ టీమ్ అడ్డంకిగా కనిపిస్తున్నారు.

ఆచారి కారణంగా కృష్ణారెడ్డి మీద, కాంగ్రెస్ కార్యకర్తల మీద కమ్యూనిస్టుల దాడులు ఆగిపోయాయి.

"గీ నడ్మ మెయిన్ లీడర్లు సీక్రెట్‌గా కొన్ని మీటింగ్‌లు పెట్టుకుంట్రడట!" ఏదో అనుమానాస్పదమైన అంశాన్ని కదుపుతున్నాడు రాంరెడ్డి.

"సీక్రెట్ మీటింగులా?" అండర్ లైన్ చేస్తున్నాడు ఆచారి మరింత వివరం కావాలి అన్నట్టుగా.

"నాగ్గూడ సమజ్ గాలే". "గందుకే మల్ల గూడ ఎంక్వైరీ జేపిచ్చిన. సీక్రెట్ మీటింగ్‌లు నిజమేనని తేలింది." కాసేపు ఆగాడు రాంరెడ్డి ఆ మీటంగ్‌లో ఏదో మతలబు ఉంది అనడానికి సంకేతంగా.

ఆచారి మొహంలో ఎలాంటి భావాలూ కనిపించడం లేదు. ఆచారి కళ్ల వెనుక దాగిన అవ్యక్త భావాల్ని చదివి మరికాస్త ముందుకెళ్లాలని రాంరెడ్డి అనుకుంటున్నాడు.

రాంరెడ్డి ఇంకా ఏం చెబుతాడో విందామని ఆచారి వెయిట్ చేస్తున్నాడు.

కొద్దిసేపటి తరువాత మళ్లీ రాంరెడ్డే గొంతు పెకిలించాడు. "నా మనసెందుకో కీడు శంకిస్తుంది ఆచారన్నా" అనేశాడు రాంరెడ్డి అప్రయత్నంగా. ఆచారి ఎటో చూస్తున్నాడు. తాను ఇంకేదో

ఆలోచిస్తున్నట్టుగా కనిపిస్తూ.

కొద్ది క్షణాలు ఆ టేబుల్ దగ్గర గంభీరమైన నిశ్శబ్దం రాజ్యమేలింది. నాలుగైదు క్షణాల తరువాత ఆచారి ఒక నవ్వు నవ్వాడు. అక్కడి వాతావరణాన్ని తేలికపరుస్తున్నట్టు.

"మనోల్లు గూడా గీ నడ్మ రెండు, మూడు సార్లు... జాగ్రత్తగ ఉండాల్నంటండ్రు" అన్నాడు రాంరెడ్డి కాసింత ఆందోళనగా.

రాంరెడ్డి గొంతులో, మొహంలో భయాన్ని చూశాడు ఆచారి.

"నీకేమన్నా జరగాల్నంటే ముందు నన్ను దాటుకొని పోవాలె రాంరెడ్డీ. నీకంటే ముందు ఈ ఆచారి ఉన్నడని మరచిపోకు" అన్నాడు ఆచారి రాంరెడ్డికి భరోసానిస్తూ.

ఆ తరువాత కుటుంబ వ్యవహారాలు, వ్యక్తిగత అంశాలు, పార్టీ కార్యక్రమాలూ వారి మధ్య చర్చకొచ్చాయి. సీరియస్ అంశాన్ని తేలిక చేస్తూ ఆచారి సరదా సరదాగా మాట్లాడుకుంటూ పోతున్నాడు. పెగ్గులు ఖాళీ అవుతున్నకొద్దీ వాతావరణం తేలిక పడసాగింది. భయం స్థానంలో ధైర్యం నిండిపోయింది. అటువైపు కుట్రలకు దీటుగా ఇటువైపు నుంచి ఏం చేస్తే బాగుంటుందో ఇద్దరూ చర్చించుకుంటున్నారు.

ఆచారి మాటలు వింటున్నకొద్దీ రాంరెడ్డికి పోయిన ధైర్యం మళ్లీ వచ్చింది. చేయాల్సిన పనులు, ఎజెండా గురించి మాట్లాడు కోవడంతో ఆచారి టీంను, కాంగ్రెస్ పార్టీని బలోపేతం

చేసుకోవాలనే పథకానికి ప్రాధాన్యత ఏర్పడింది. అంతకు ముందు కూడా రాంరెడ్డికి ఏదైనా జరగాలంటే ముందు తనను దాటుకొని పోవాల్సి ఉంటుందని ఆచారి గతంలో చెప్పి ఉన్నాడు.

ఇవాళ మరోసారి సిట్టింగ్‌లోనూ అదే అంశాన్ని హైలైట్ చేశాడు ఆచారి.

రాంరెడ్డిని కాపాడేందుకు ఆచారి ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాడో జాగ్రత్తగా కనిపెడుతోంది అవతలి వర్గం. రాంరెడ్డిని ఎలాగైనా తుదముట్టించాలనే పథకాలు నడుస్తున్నాయి. ఆ విషయాన్ని పసిగట్టాడు రాంరెడ్డి. అందుకే ఆచారిని మరింత అప్రమత్తం చేశాడు. రాంరెడ్డి తనతో ఉన్నా, రాంరెడ్డి వెంట తాను ఉన్నా ఆయన్ని ఎవరూ ముట్టుకునే దుస్సాహసం చేయరన్న భరోసాతో ఉన్నాడు ఆచారి. ఏదో మాయ చేసి తనకు ప్రాణహాని తలపెడతారేమోనని అనుమానిస్తున్నాడు రాంరెడ్డి. రాంరెడ్డి అనుమానమే నిజమవుతుందేమో ఎవరికెరుక?

ఆచారికి బాగా తెలిసిన, ఆత్మీయమైన పాత మిత్రులు వారి టేబుల్ దగ్గరకు వచ్చారు. వారిని చూడగానే ఆచారి ఆప్యాయంగా పలకరించాడు. వారు కూడా "అన్నా" అంటూ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వారి కోసం మరో రెండు కుర్చీలు, మందు తీసుకు రావాలని వెయిటర్‌ను పిలిచాడు ఆచారి.

వారు ఆచారి ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించారు.

"అన్నా... మేం అవతలి మూలకు టేబుల్‌ను ఆక్యుపై

చేసుకున్నాం. మీరే ఒకసారి అక్కడికి రండి మనవాళ్లంత అక్కడే ఉన్నారు. వాళ్లను గూడా ఒకసారి మీరు చూసినట్టు ఉంటది. మీరే రండి" అంటూ రిక్వెస్టు చేశారు.

"ఒక్క రెండు నిమిషాల్లో మళ్లీ వద్దురు. రండి" అంటూ బలవంతం చేశారు.

తనకు ఆత్మీయులు అని తెలిసినవారు తనను బలవంతం చేసే పరిస్థితి తీసుకురాడు ఆచారి. అందుకే ఏమాత్రం సందేహించకుండా లేచి నిలబడి ధోవతిని సవరించుకున్నాడు.

"రాంరెడ్డీ... నువ్వు ఈ పెగ్గు తీసుకునే లోపు నేనొస్తా". ఐదే ఐదు నిమిషాలు" అంటూ రాంరెడ్డికి చెప్పాడు.

అప్పటికే పరిస్థితులను అనుమానిస్తున్న రాంరెడ్డి, ఆచారి ఎంతో ఆప్యాయంగా మాట్లాడుతున్న ఆ ఇద్దరిని చూసి తనకు కలిగిన అనుమానాల తాలూకు ఛాయలను మొహంలో కనిపించకుండా జాగ్రత్త పడ్డాడు. అన్యమనస్కంగానే వెళ్లి రమ్మన్నట్టు సైగ చేశాడు.

అటు ఆచారిని మాటల్లోకి దింపిన ఆ ఇద్దరు వ్యక్తులు మరికొంత మందిని పాత పరిచయస్తులతో కలిసి ఆచారిని నమ్మించి దూరం తీసుకెళ్లారు. ఇక్కడ రాంరెడ్డి ఒంటరి వాడయ్యాడు. కాసేపటికే రాంరెడ్డి టేబుల్ దగ్గరకు నలుగురు వ్యక్తులు వచ్చేశారు. రావడం రావడమే రాంరెడ్డిని తిడుతూ భౌతిక

దాడికి దిగారు. అతన్ని కొట్టుకుంటూ బయటకు లాక్కెళ్తున్నారు. రాంరెడ్డి అరుస్తున్నాడు. ఆయన మొహంలో చావు భయం కనిపిస్తోంది. ఇహ తన పని అయిపోయిందన్న భావన స్పష్టంగా వ్యక్తమవుతోంది. బార్‌లో కూర్చున్నవారంతా ఈ దృశ్యాన్ని చూస్తున్నా అది మామూలుగా జరిగే తంతుగానే భావిస్తున్నారు. అది సాధారణమైన కొట్లాటగానే పరిగణిస్తున్నారు కానీ అందులోని అసలు కుట్ర రాంరెడ్డికి తెలుసు. అందుకే ఆయన ఆచారి కోసం కేకలు వేస్తున్నాడు.

"ఆచారన్న... ఆచారన్న..."

"నన్ను సంపుతాంద్రు... ఎక్కడున్నావ్"

"ఆచారన్నా... జల్ది రా" అంటూ రాంరెడ్డి కేకలు వేస్తున్నాడు.

ఆచారిని మాటల్లో పెట్టి పాత పరిచయస్తులు అక్కడే బయట రోడ్డుమీద ఉన్న పాన్ డబ్బా వద్దకు తీసుకెళ్లారు. ఆచారిని చూడగానే ఆయన రెగ్యులర్‌గా తినే మసాలా పాన్ కడుతున్నాడు షాపువాడు.

"ఆచారన్నా... ఇగ నా పనైపోయింది... ఎక్కడున్నావే" అంటూ దాదాపు అదే ఆఖరు పిలుపుగా గొంతు పెకిలించుకొని అరిచాడు.

అది చెవిన పడ్డ ఆచారి వెను దిరిగాడు.

"ఎవలు వాళ్లు?... రాంరెడ్డిని ఏం జేస్తుంద్రు?" అంటూ

ఆదుర్దాగా వెనక్కి వస్తున్నాడు ఆచారి.

రాంరెడ్డిని కొట్టుకుంటూ బయటకు దూరంగా తీసు కెళ్తున్న ఆ దుండగులు... అతను అరవకుండా నోరు మూసే ప్రయత్నం చేస్తున్నారు. ఆచారికి ఆ అరుపులు వినపడకూడదని వారి ఉద్దేశం. కానీ ఆచారి హడావుడిగా ఆదుర్దాగా అక్కడకు రానే వచ్చాడు.

ఆచారి రాగానే రాంరెడ్డికి అడ్డుగా నిలబడ్డాడు. దుండగులను నిలదీస్తున్నాడు ఆచారి.

"రాంరెడ్డిని ఎందుకు కొడుతుండ్రు? ఆయన ఏ పాపం జేసిండు? ఏదన్నా ఉంటే మాట్లాడుకుందాం అంటూ రాంరెడ్డిని ఆ దుండగుల కబంధ హస్తాల నుంచి విడిపించేందుకు ప్రయత్నిస్తున్నాడు.

వారంతా ఆచారికి తెలిసిన మొహాలే. హార్డ్‌కోర్ కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలే. ఎర్రజెండా కోసం, కమ్యూనిస్టు పార్టీ కోసం ఎంతకైనా తెగించేవారే.

మామూలుగా ఆచారి ఎంటరైతే ఎవరూ ఎదురు నిలబడరు. కానీ ఈ గ్రూపు అందుకు భిన్నంగా కనిపిస్తోంది. మాటలు హద్దులు దాటుతున్నాయి. ఈ పరిస్థితిని ఊహించని ఆచారి ఆగ్రహానికి లోనయ్యాడు. వారు రాంరెడ్డిని మాటల్లో పెట్టి ఇది ఆచారికి సంబంధం లేని విషయంగా ఇద్దరినీ విడదీసే

పథకంతో వాదులాడుతున్నారు. ఆచారి అది తన సొంత విషయంగానే స్వీకరించి జవాబిస్తున్నాడు. ఆచారి ఒకరికి మాట ఇస్తే ఎన్నడూ వెనక్కి తగ్గడు కదా.

అయితే ఆచారి అండ్ టీం నుంచి ఒక్కొక్కరిని తప్పించడం, అందులో భాగంగా ఆఖరుకు ఆచారిని కూడా తుదముట్టించడం అనే కుట్రకు బహుశా కమ్యూనిస్టులు తెరచాటుగా వ్యూహం రూపొందించుకుని ఉండవచ్చు. అందుకోసం కొద్దిరోజులుగా వారు రెక్కీ నిర్వహిస్తున్నారు. ఇవాళ దాన్ని అమలు చేయడానికి రంగంలోకి దిగారు.

రాంరెడ్డిని వెనకేసుకొస్తూ ఆ దుండగులు అందరికీ జవాబిస్తున్నాడు ఆచారి. రాంరెడ్డి మీద దాడికి దిగినవారిలో అతను బాగా గౌరవించే, ఆరాధించే రాములు యాదవ్ కూడా ఉండటం గమనార్హం. ఆ బృందంలో మరికొందరు “రెడ్లు” కూడా ఉన్నారు. రాంరెడ్డిని ఎలాగైనా మట్టుబెట్టాలన్న నిర్ణయంతో ఉన్న ఆ దుండగులను ఆచారి అటకాయిస్తున్నాడు. వారి ‘టార్గెట్’కు అడ్డు తగులుతున్నాడు. ఆచారితో వాదులాడటం, ఆ తతంగాన్ని మరింత ఎక్కువ సేపు కొనసాగనిస్తే “లక్ష్యం” దెబ్బ తింటుందన్న ఉద్దేశంతో “పని” కానిచ్చేయడానికే పూనుకున్నారు. రాంరెడ్డిని తప్పించాలంటే ఆచారి ఉండగా సాధ్యం కాదని, కాబట్టి వెంటనే టార్గెట్ ఛేదించుకొని వెళ్లిపోవాలని ఆ గ్యాంగ్ తొందరపడుతోంది.

అటు రాములు యాదవ్ ఆచారిని తప్పుకోమంటున్నాడు.

ఇందులో ఆచారికి ప్రమేయం లేదని, అనవసరంగా ఎంటర్ కావద్దని రాములు నచ్చజెబుతున్నాడు. అయితే ఆచారి వినడం లేదు. రాంరెడ్డి మీద దాడి చేస్తున్న మరో ఇద్దరు వ్యక్తులను మడత పెట్టేందుకు ముందు కెళ్తున్నాడు. అందులో ఒకడు ఆచారిని బలంగా వెనక్కి నెట్టాడు. దీంతో ఆచారి కింద పడిపోయాడు. ఈ హఠాత్పరిణామాన్ని ఊహించని ఆచారి తమాయించుకొని లేచి నిలబడ్డాడు. ఇక వాళ్లిద్దరికీ ఆ క్షణాన తన చేతుల్లో మూడింది అన్నట్లుగా ఉగ్రరూపం దాల్చాడు.

ఆచారిని ఎదుర్కోవడం అంత సులువుగా ఎవరికీ అయ్యే పని కాదు. ఆ విషయం ఆ దుండగులకు తెలుసు కాబట్టే మందు సిట్టింగ్ సందర్భం కోసం వేచి చూశారు. ఈ పథకానికి సంబంధించిన క్లూ ఆచారికి ముందుగా అందకపోవడంతో ఏమరుపాటుగా ఉన్నాడు. అయినా ఆచారి లేచి ఇద్దరికీ "జవాబు" ఇవ్వడానికి సిద్ధపడ్డాడు. వారి మీదికి ఆకలి గొన్న సింహంలా లంఘించాడు. ఒకడి గొంతు పట్టుకొని వెనక్కి నెడుతూ మరొకణ్ని మరో చేత్తో మెడలు పట్టుకోవడానికి ముందుకు కదుల్తున్నాడు. తాము వచ్చిన లక్ష్యం ఉల్టా అయిపోతుందేమో అనే కంగారుతో పాటు ఆచారి చేతుల్లో తమకు చివరి క్షణాలు తప్పదా అన్న భయం వారి మొహాల్లో కనిపిస్తోంది. అయితే ఆచారిది పైచేయిగా మారిన కొద్ది క్షణాల్లోనే అనుకోని పరిణామం సంభవించింది. ఆచారి ఉక్కు పిడికిళ్ల నుంచి విడిపించుకోవడానికి వారు పెనుగులాడుతుండడం, వారి పీక పిసికేలా పట్టు బిగిస్తున్న ఆచారి

భీమసేనుడిలా ముందుకు కదుల్తున్న క్షణాల్లో ఆచారి ధోవతి కుచ్చిళ్లు తన ఎడమకాలి కింద పడిపోయాయి. దీంతో వారిని కింద పడదోయబోయిన ఆచారి తానే బోర్లా పడ్డాడు. ఆచారి పడిపోయాక వారిద్దరికీ ప్రాణభిక్ష దొరికి నట్టయింది. ఇదే అవకాశంగా వారు అనుకున్న అంతిమ పథకం అమలు చేశారు. కిందపడిన ఆచారికి మరోసారి లేచే అవకాశం ఇవ్వ దలచుకోలేదు. వారి వీపు వెనుక షర్టుల్లో కనిపించకుండా పెట్టుకున్న గొడ్డళ్లను ఒక్కసారిగా బయటకు తీశారు. అటు కింద పడిన ఆచారి ఈసారి లేవడం కోసం సమయం వృధా చేయదలచుకోలేదు. తన బొడ్లో దోపుకున్న షాట్‌గన్‌ని బయటకు తీస్తున్నాడు. ఈ సందర్భాన్ని పూర్తిగా ఉపయోగించుకొనే ముందస్తు ప్రణాళికలో ఉన్న అగంతకులు ఆచారి గన్ తీసేలోగానే ఎడమ చేతి మీద గొడ్డలి కర్రతో బలంగా కొట్టాడు ఒకడు. దీంతో ఆచారి గన్ కింద పడిపోయింది. ఇదే అదునుగా మరొకడు తన దగ్గరున్న రెండో గొడ్డలిని బయటకు లాగి ప్రయోగించాడు. కిందపడ్డ ఆచారి మెడమీద గురిచూసి వేటు వేశాడు. మరో దెబ్బ వేయడానికి గొడ్డలిని లాగుతుంటే ఆయన మెడలో ఇరుక్కున్న గొడ్డలి రావడం లేదు. అంత లోతుగా వేటు పడడం, ఆచారి శరీరానికి పట్టి ఉన్న కొవ్వు ఎంత బలంగా ఉందో చూసి ఆ దుండగుడు ఆశ్చర్యపోతున్నాడు. ఈ లోపు రెండో వ్యక్తి తన దగ్గరున్న గొడ్డలితో దాడి చేశాడు. తమ టార్గెట్ కాని ఆచారి మీద గొడ్డళ్ల వేటు పడటాన్ని రాములు యాదవ్ ఊహించలేదు. కానీ "లక్ష్య" ఛేదన

జరగాలంటే అందుకు ఎదురయ్యే ఆటంకాలను తొలగించుకోక తప్పని పరిస్థితులు ఎదురవుతాయి. రాములు వారిస్తున్నా ఆ దుండగులు ఆచారి మీద దాడి చేస్తూనే ఉన్నారు. రాములు వారించాడా? వారిస్తున్నట్టు నటించాడా? ఆ దేవుడికే ఎరుక. ఆచారి ఒంటిమీద నిర్దాక్షిణ్యంగా గొడ్డళ్ల వేట్లు పడుతున్నాయి.

రాంరెడ్డి మీద దాడి ఒక ఎత్తు అయితే ఆచారి మీద దాడి మరో ఎత్తు అయింది. ఆచారి మీద గొడ్డళ్ల దాడి జరుగుతున్న క్రమంలో రత్నయ్య లాడ్జ్ ఉన్న రోడ్ల మీద హాహాకారాలు మిన్నంటాయి. విపరీతమైన కలకలం చెలరేగింది.

"ఆచారిని చంపుతుండ్రు... ఆచారిని చంపుతుండ్రు" అనే కేకలు లాడ్జి, రెస్టారెంట్ పరిసరాల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. మొదటి అంతస్తులో కబుర్లలో మునిగిపోయిన సైదయ్య, రత్నయ్యలకు ఈ వార్త సోకింది.

వెంటనే సైదయ్య హడావుడిగా మెట్లు దిగి కిందికొచ్చేశాడు. తమ్ముడి మీద దాడి చేసిన దుండగులు సైదయ్యకు కూడా బాగా తెలుసు. "ఎవడ్రా మీరు?... మా తమ్ముడేం చేసిండురా మీకు? ఆచారిని ఎందుకు చంపుతుండ్రురా"... అంటూ వారిని అడ్డగించేందుకు ముందుకు ఉరుకుతున్నాడు. ఆచారి మీద గొడ్డళ్ల దాడి చేస్తున్న ఆ దుండగులలో ఒకడు సైదయ్య మీద కూడా గొడ్డలి ఝుళిపించాడు. ఆ గొడ్డలి వేటు సరిగ్గా సైదయ్య మొహం దిశగా దూసుకొచ్చింది.

సైదయ్య ఒక్కసారిగా కాస్త వెనక్కి జరిగాడు. దీంతో ఆ గొడ్డలి అంచు సైదయ్య నుదుటికి గాటు పెడుతూ వేగంగా వెళ్లిపోయింది. సైదయ్య ఒక అడుగు వెనక్కి వేసి ఉండకపోతే గనక ఆయన పరిస్థితి మరోలా ఉండేదేనేమో. అనూహ్యమైన ఈ పరిణామంతో సైదయ్య షాక్‌కి గురయ్యాడు. నోట మాట రావడం లేదు. ఏం మాట్లాడాలో తెలియడం లేదు. తన మొహం నుంచి కారిపోతున్న రక్తం. తెల్లటి ధోవతి, తెల్లటి చొక్కా ఎరుపెక్కాయి. ఎదురుగా రక్త మడుగులో తమ్ముడు. తమ్ముడి మీద గొడ్డళ్ల దాడి, రాంరెడ్డి మీద కరకు గొడ్డళ్ల కరాళ నృత్యం.

ఆ క్షణంలో తన మనోపథంలో తమ్ముడేమై పోతాడనే ఆందోళన. బతికించుకోవడానికి ఏం చేయాలి? తనకు మిగిలిన సమయమెంత? తానిప్పుడు ఏం చేయాలి? ఇదంతా తన తమ్ముడి గురించి ఆందోళన అయితే ... మరోవైపు తన శరీరం మొత్తం రక్తంతో తడిసిపోయింది. దీంతో తనకేం జరిగిందో తన కండిషన్ ఏంటో సైదయ్యకు అర్థం కాని స్థితి.

అలాంటి పరిస్థితిలో సైదయ్య సాయం కోసం అర్థిస్తున్నాడు.

“అరేయ్... ఎవడ్రా అక్కడ... రాంద్రా... నా తమ్ముడ్రా... అయ్యో రాంద్రా... నా తమ్ముడ్రా... అంటూ అసంపూర్తి వాక్యాలతో, సైగల ద్వారా పిచ్చిపట్టిన వాడిలా ప్రవర్తిస్తున్నాడు.

సైదయ్య అరుపులు, ఆచారి పరిస్థితి చూసి అక్కడున్న రిక్షాపుల్లర్లు “అయ్యా”.... అంటూ సైదయ్యను సమీపించారు.

తమ్ముడిని ఎలాగైనా కాపాడుకోవాలనే అదుర్దాలో ఉన్న సైదయ్య ఓ ఉన్మాదిలా కనిపిస్తున్నాడు.

నోటి నుంచి పూర్తిగా బయటకు రాని మాటలనే ఆదేశాలుగా తీసుకున్న రిక్షా కార్మికులు ఆచారిని, రాంరెడ్డిని రెండు రిక్షాల్లోకి ఎక్కించారు. హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు.



**హత్యానంతరము ఆచారి మరియు రాంరెడ్డిని ఏరియా ఆసుపత్రికి రిక్షాలపై తరలించినప్పటి దృశ్యం**

కింద పడిన ఆచారి మెడ నుంచి శరీరం కింది భాగాలకు, మెదడుకు రక్తం సరఫరా చేసే నరాలు తెగిపోయాయి. అటు వీపు మీద కూడా పదునైన గొడ్డలి వేట్లు పడ్డాయి. రక్తపు మడుగులో పడిపోయాడు ఆచారి. అవే గొడ్డళ్లతో అటు రాంరెడ్డి మీద కూడా పడ్డారు దుండగులు. ఆయన శరీరం మీద కూడా గొడ్డళ్లు కరాళ నృత్యం చేశాయి. ఈ హఠాత్ పరిణామంతో అక్కడి వాతావరణం

ఒక్కసారిగా భయానకంగా మారిపోయింది. సాయంత్రం వేళ సరదాగా, సందడిగా కళకళలాడే ఆ రోడ్డు మొత్తం విషాదం అలముకొంది. వచ్చిన పని పూర్తి చేసుకొని వెళ్లిపోయారు దుండగులు. రక్తం మడుగులో పడి ఉన్నాడు ఆచారి. ఆచారి మూలుగుతున్నాడు. ఏదో మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నాడు. కానీ ఏదీ అర్థం కావడం లేదు. పైనుంచి పడుతున్న వర్షంతో రక్తం కలిసిపోయి మడుగులా తయారవుతోంది.

ఈ వార్త కొద్ది నిమిషాల్లోనే ఆచారి అనుచరులకు, సైదయ్య కుటుంబానికి తెలిసిపోయింది. కొద్ది నిమిషాల్లోనే ఆచారి అభిమానులు, అనుచరులు, సైదయ్య కుటుంబ శ్రేయోభిలాషులు అంతా ఆస్పత్రికి చేరుకున్నారు. పదులు, వందలు, వేలు ... ఈ విధంగా ఆచారిని, రాంరెడ్డిని చూడటానికి తండోపతండాలుగా తరలివచ్చారు. ఆచారిని బతికించాలని, అతను బతికి రావాలని అనేక కుల సంఘాల కార్మికులు, నాయకులు దేవుళ్లకు మొక్కుకుంటున్నారు. డాక్టర్ ఏం చెబుతాడా అని ఎదురు చూస్తున్నారు. క్షణమొక యుగంలా గడుస్తున్న ఆ సందర్భంలో ఆచారిని, రాంరెడ్డిని చూసిన డాక్టర్ పెదవి విరిచాడు.

ఆచారి మరణ వార్త తెలియగానే ఆస్పత్రి ముందు గుమిగూడిన ప్రజలంతా గొల్లుమన్నారు. ఆచారిని తలచుకొని బావురుమన్నవాళ్లు కొందరైతే, హృదయాల్లోనే మౌనంగా నివాళ్లు అర్పించిన వారు మరికొందరు. ఆచారితో ఉన్న

అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతమైనవారు మరికొందరు. ఇలా వేలాది మంది రాకతో ఆస్పత్రి ప్రాంగణం విషాద సంద్రంలా మారిపోయింది. రాంరెడ్డితో చెప్పిన మాటలు ఆచారి తు.చ. తప్పకుండా నిలబెట్టుకున్నాడని, రాంరెడ్డి కన్నా ముందు ఆచారి మీద వేటు పడడాన్ని ఆ నోటా, ఈ నోట ఒక దైవ నిర్ణాయక అంశంగా చెప్పుకుంటున్నారు. ఈ దారుణమైన జంట హత్యల వార్తను మరునాడు పేపర్లు ప్రముఖంగా ప్రచురించాయి.

# 12. మంటల్లో సీపీఎం ఆఫీస్

ఆ రాత్రంతా ఇద్దరి మృతదేహాలు ఆస్పత్రిలోనే ఉన్నాయి. ఆచారి అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు, కుల సంఘాల నాయకులు, కమ్యూనిస్టు పార్టీ నుంచి కూడా ఆచారి స్నేహితులు అందరూ వచ్చి చూసి పోతున్నారు. ఎవరికి తోచిన రీతిలో వారు ఆచారికి నివాళులు అర్పిస్తున్నారు. ఆ దుండగులు రాంరెడ్డిని చంపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆచారి ఫస్ట్ టార్గెట్ కాకపోయినా రాంరెడ్డి కోసం మొదటి గొడ్డలి వేటు తిన్నాడు. స్నేహితుడికి ఇచ్చిన మాట కోసం తను మరణాన్ని కూడా ఆహ్వానించాడు. అజాత శత్రువు అయ్యుండీ అర్ధాయుష్కుడిగా వెళ్లిపోయాడు. ఆచారి పిల్లలందరు చిన్నవారు. ఇంటికి ఆధారమైనవాడు అర్ధాంతరంగా వెళ్లిపోతే ఆ కుటుంబ పరిస్థితి ఏమిటి? ఇలా ప్రజలంతా అనేక రకాలుగా మాట్లాడు కుంటూ... ఆచారి మరణాన్ని తలచుకొని మౌనంగా రోదిసున్నారు.

మరునాడు పోస్టుమార్టం అనంతరం రాంరెడ్డి శవాన్ని ఆయన బంధువులకు అప్పగించారు. వారు అతని డెడ్ బాడీని నీలాయిగూడెం తరలించారు. ఆచారి శవానికి మాత్రం పోస్టుమార్టం జరగలేదు. ఆచారి అభిమానులు, కాంగ్రెస్

కార్యకర్తలు గొడవకు దిగారు. కాదని పోస్ట్‌మార్టమ్ చేస్తామంటే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయంటూ ఆచారి అభిమానులు దాడికి సిద్ధమయ్యారు. దీంతో పోస్ట్‌మార్టమ్ చేయకుండానే డెడ్‌బాడీని అప్పగించారు. మిర్యాలగూడలో ఆచారి శవాన్ని అంతిమ సంస్కారాలకు సిద్ధం చేస్తూ.. తన కుడిభుజం విరిగిపోయిందని సైదయ్య వలవలా కన్నీరు కారుస్తున్నాడు. వచ్చే పోయేవారంతా ఆయన పిల్లల గురించే మాట్లాడుకుంటున్నారు. మొదటి భార్య ధనమ్మ పిల్లలు పెద్ద కొడుక్కి దాదాపు 15 ఏళ్లు, రెండో అబ్బాయికి 13 ఏళ్లు, మూడో అబ్బాయికి 11 ఏళ్లు, 4వ సంతానానికి 8 ఏళ్లు, ఐదో సంతానంగా పుట్టిన ఆడపిల్లకు ఆరేళ్లు ఉంటాయి.

ఇక రెండో భార్య జమీరాకు పుట్టిన పెద్దబ్బాయికి దాదాపు నాలుగేళ్లుంటాయి, రెండో అబ్బాయికి సుమారు రెండేళ్లు. మూడో అబ్బాయి 11 నెలల పసివాడు.

నాన్నకు ఏం జరిగిందో పిల్లలకు తెలియదు. భర్త ఏమైపోయాడు? ఎవరు చంపారు? అనే వివరాలేవీ భార్యలకు తెలియదు.

మరోవైపు ఆచారి అభిమానులు, ఆయన అభిమానాన్ని అనుభవించిన కుల సంఘాల నాయకులు, సైదయ్యకు నమ్మిన బంట్లుగా ఉన్నవారంతా ఆగ్రహోదగ్రులవుతున్నారు. ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్నారు. ఆచారి లేని తమను వారు

ఊహించుకోలేక పోతున్నారు. వారి ఆగ్రహ జ్వాలల ఫలితంగా మిర్యాలగూడలోని సీపీఎం ఆఫీసుకు నిప్పంటుకుంది. ఎవరో కొందరు ఆచారి అభిమానులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమానికి కాగడాలుగా మారి నడిపించినవారు ఓ గుంపుగా వెళ్లి సీపీఎం ఆఫీసు మీద పడ్డారు. డబ్బాల్లో కిరోసిన్ తీసుకెళ్లి ఆఫీసు మీద చల్లి నిప్పంటించారు. పార్టీ ఆఫీసు రాత్రంతా వర్షానికి తడిసినా ... వారి ఆగ్రహ జ్వాలల తీవ్రతకు పార్టీ కార్యాలయం తగలబడిపోతోంది.

# 13. అది అంతిమ యాత్రా? ప్రజల ఆగ్రహ యాత్రా?



**ఆచారిగారి అంతిమయాత్రకు ముందు చిత్రం**

ఆచారి అంతిమ యాత్రకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. సైదయ్య కుటుంబ సభ్యులంతా విషణ్ణవదనులై విలపిస్తున్నారు. సైదయ్యను వారి కుటుంబాన్ని పరామర్శించేందుకు అన్ని కుల సంఘాల నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు, కాంగ్రెస్

నాయకులు, కార్యకర్తలు తండోప తండాలుగా తరలివస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే కృష్ణారెడ్డి సైదయ్యను, ఆయన మిగతా తమ్ముళ్లను ఓదారుస్తున్నాడు. మరోవైపు ఈ దురాగతానికి పాల్పడింది ఎవరు? అందుకు వారిని పురికొల్పిన పరిస్థితులేంటి? అనే కారణాలను కృష్ణారెడ్డి ఆరా తీయిస్తున్నాడు.

ఆచారి అనుచరులు, కాంగ్రెస్ కార్యకర్తలు, మరోవైపు సీపీఎంలోని ఆచారి సానుభూతిపరులు కూడా ఆగ్రహోదగ్రులు అవుతున్నారు. ఏదో ఒకటి చేయకపోతే సీపీఎం ఆగడాలకు అంతే ఉండదని, అది ఇతర పార్టీలకు, మిగతా అన్ని సంస్థలకు ప్రమాదకరంగా మారుతుందన్న అభిప్రాయం అందరి నుంచీ వినిపిస్తోంది. బుసలు కొడుతున్న ప్రతీకార జ్వాలలతో అక్కడి వాతావరణం క్షణక్షణం కోలాహలంగా మారుతోంది.

మరోవైపు ఆచారి అంతిమ యాత్రకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. క్షణాలు గడుస్తున్నకొద్దీ సైదయ్య ఇంటికి జనవాహిని పోటెత్తుతోంది. అభిమానులు, కార్యకర్తల నినాదాల మధ్య ఆచారి అంతిమ రథయాత్ర బయల్దేరింది.

ఆచారి – అమర్ రహే.

తెలంగాణ నిప్పు కణం – ఆచారన్న అమర్ రహే..

బడుగుల ఆశాకిరణం – ఆచారన్న అమర్ రహే..

అనే నినాదాలతో అంతిమ యాత్ర ముందుకు సాగుతోంది. వీధుల వెంట తుది యాత్ర సాగుతున్నకొద్దీ జనమంతా కలుస్తున్నారు.

ఆచారి అంతిమ యాత్రను ప్రధానంగా పంజాబీ సిక్కు జాతీయులే నిర్వహించడం విశేషం. సైదయ్య కార్ఖానాల్లోకి పనివాళ్లుగా పంజాబీ సిక్కులను రిక్రూట్ చేసుకున్నారు. వారు ఉండడానికి వసతి, కుటుంబాలు గడవడానికి అడ్వాన్సులు ఇచ్చి, పిల్లల చదువుల కోసం ఏర్పాట్లు చేసి వారికి అన్ని రకాలుగా అండదండలు అందించింది సైదయ్య కుటుంబం. వారిని రిక్రూట్ చేసింది ఆచారే కావడం విశేషం. అదే కాకుండా వాళ్లు నివసిస్తున్న స్థలం కూడా ఆచారే వారికోసం వదిలేయడం వలన, అన్నభీమోజు కుటుంబ పెద్దలందరి పాడె మోసి ఆ రుణం తామే తీర్చుకుంటామని, ఆ అదృష్టం ఎవరికీ ఇవ్వమని చెప్పి వారి కృతజ్ఞతను ఆ విధంగా చాటుకున్నారు.

కర్నాటి రత్నయ్య లాడ్జ్ నిర్మించేటప్పుడు పంజాబీ సిక్కు కార్మికులకు సైదయ్య తమ స్థలాన్ని ఇచ్చాడు. అది 20 గుంటలకు పైనే ఉంటుంది. ఆ స్థలంలో సిక్కులు ఉండడానికి షెల్టర్, ఇతర ఏర్పాట్లు చేశారు. అయితే బిల్డింగ్ పూర్తయిన తరువాత ఆ స్థలం నుంచి సిక్కులను ఖాళీ చేయించాలని, ఆ స్థలాన్ని వ్యాపార అవసరాల కోసం ఉపయోగించుకోవాలని సైదయ్య భావించాడు. వాళ్లను తీసుకొచ్చిందీ, రిక్రూట్ చేసిందీ ఆచారి కాబట్టి తమ్ముడి ద్వారా వారిని ఖాళీ చేయించాలని చూశాడు. అయితే ఆచారి తరహా వేరు అని ముందే చెప్పుకున్నాం కదా. వారిని ఖాళీ చేయించి అక్కణ్నించి పంపివేయడానికి ఆయనకు మనసొప్పలేదు. ఆ మొత్తం స్థలాన్ని పంజాబీ సిక్కులకే వదిలేశారు. ఆ విధంగా సిక్కులు అక్కడే

స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. పంజాబీ సిక్కులు కాస్తా మిర్యాలగూడ సిక్కులుగా మారిపోయారు.

ఆ స్థలాన్ని తమకోసం వదిలేసి తమను మిర్యాలగూడ వాస్తవ్యులుగా మార్చినందుకు పంజాబీలు ఇప్పటికీ తమ కృతజ్ఞతను చాటుకుంటున్నారు. ఇప్పటికీ ఆచారి వర్ధంతిని కుటుంబ సభ్యుల్లాగే ఎంతో భక్తి భావంతో సంప్రదాయబద్ధంగా నిర్వహించు కోవడం విశేషం.

ఆచారి అంతిమయాత్రకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, బలమైన తెలంగాణ వాదిగా పని చేసిన పాల్వాయి గోవర్ధన్ రెడ్డి వచ్చాడు. ఆయన వెంట ఆయన అనుచరులు, యావత్ తెలంగాణ వాదులంతా వచ్చి చేరారు. పాల్వాయి గోవర్ధన్ రెడ్డి, ఆచారి మధ్య మంచి స్నేహానుబంధం ఉండేది. పాల్వాయి మిర్యాలగూడవస్తే ఆ రోజంతా ఇద్దరికీ పండగే. ఇద్దరూ కలిసి సరదగా షికార్లకు వెళ్లేవారు. పోటీలు పడి అడవిలో వేటాడేవారు. మనిషి జీవితంలో తానేం సంపాదించుకున్నాడో అంతిమ ప్రయాణంలో కనిపిస్తుందంటారు. అది నిజమేనని కదిలివచ్చిన జనసమూహాన్ని చూస్తే ఆచారి కూడబెట్టుకున్న ఆస్తిపాస్తుల గురించి తెలుస్తుంది.

ఆచారిది సహజ మరణం కాదు. అది హత్య. అందుకే అందులో సానుభూతికన్నా ఆగ్రహావేశాలే కనిపిస్తున్నాయి. ఒక రకంగా అది విషాదయాత్రగా కంటే విప్లవ యాత్రనా

అనిపించేలాగుంది. ఆచారిని అమరుడిగా కొందరు కీర్తిస్తుంటే మరికొన్ని గొంతుల్లోంచి ప్రతీకార ధ్వనులు పరవళ్లు తొక్కుతున్నాయి. సుదీర్ఘమైన ఆ యాత్రలో అక్కడక్కడా ప్రతీకార నినాదాలు మంద్రంగా వినిపిస్తున్నాయి.

ఆ రోజు చీకటిపడే సమయానికి ఆచారి అంతిమ సంస్కారం ముగిసింది. రాత్రి పొద్దుపోయేటప్పటికి అంతా ఇళ్లలోకి చేరుకున్నారు. ఆచారితో ఉన్న అనుబంధాన్ని మరోసారి గుర్తు చేసుకుంటూ ఊరి జనమంతా మెల్లగా నిద్రలోకి జారిపోయారు.

నిజానికి ఈ కుట్ర జరిగిన రోజు ఆచారి కృష్ణారెడ్డి అన్న కొడుకుతో హైదరాబాద్ వెళ్లాల్సి ఉంది. కానీ ఎందుకనో అది జరగలేదు. అదే జరిగితే ఆయన చరిత్ర మరోలా ఉండేదేమో.

మరోవైపు ఆచారి మర్డర్ కేసును కమ్యూనిస్టు లీడర్లు కొట్టేయించగలిగారు గానీ దానికి ప్రతీకారం జరగకుండా ఎవరూ ఆపలేకపోయారు.

ఆచారి చనిపోయిన రెండు నెలలకు తిప్పన కృష్ణారెడ్డి కూడా చనిపోయాడు.

# 14. తుపాకీ లోడ్ చేసుకున్న కృష్ణారెడ్డి : ఆనాటి ఘటనను గుర్తు చేసుకున్న విజయసింహారెడ్డి



మార్కెట్ కమిటీ చైర్మన్ ఆచారిని మర్డర్ చేశారన్న వార్త మిర్యాలగూడ పరిసర ప్రాంతాల్లో భయాందోళనలు సృష్టించింది. సీపీఎం గూండాల చేతుల్లో కాంగ్రెస్ నాయకుడి హత్య జరిగిందని గ్రామాలన్నీ చర్చించుకుంటున్నాయి. నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ వర్సెస్ కమ్యూనిస్టు పార్టీల ఆధిపత్య పోరు, హత్యా రాజకీయాలు కొత్తవేమి కాదు. కానీ కాంగ్రెస్ నుంచి ఆచారి ఎదిగి వచ్చిన తరువాత ఆ హత్య రాజకీయాలు ఆగిపోయాయి. కాంగ్రెస్ ఆధిపత్యం కొనసాగుతోంది. ఇలా కొన్నేళ్లుగా ప్రశాంత వాతావరణం కనిపిస్తున్న తరుణంలో అకస్మాత్తుగా ఆచారి హత్య జరగడంతో ప్రజలంతా ఎక్కడ చూసినా అదే విషయంపై ఆందోళనగా మాట్లాడుకుంటున్నారు.

రాజకీయ నాయకులు కూడా అప్రమత్తమయ్యారు. ఇది ఆచారి దగ్గరే ఆగిపోతుందా లేక ఇంకా ఎవరినైనా టార్గెట్ చేశారా అన్న భయం కాంగ్రెస్ నేతల్లో ప్రవేశించింది. మరోవైపు ఆచారి హత్య తరువాత కాంగ్రెస్ వైపు నుంచి ఎలాంటి రియాక్షన్ వస్తుందో, ఏ స్థాయి దాడులు జరుగుతాయో, ఎవరిని టార్గెట్ చేస్తారో అనే టెన్షన్ సీపీఎం నాయకులను పీడిస్తోంది. ఇలా రెండు శిబిరాలు కూడా అప్రకటిత యుద్ధానికి సిద్ధమైపోయాయి. ఎవరొచ్చినా, ఎవరేం చేసినా ప్రతిఘటనకు సిద్ధపడాలనే నిర్ణయానికి వచ్చారు. అదే విషయాన్ని తిప్పన కృష్ణారెడ్డి కుమారుడు విజయసింహారెడ్డి ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు.

ప్రజల స్మృతి పథంలో అప్పుడప్పుడూ తొంగిచూసే ఆనాటి అనుభవాలను విజయసింహారెడ్డి తన సన్నిహితుల దగ్గర అడపాదడపా గుర్తు చేసుకుంటారు. ఆచారితో తన తండ్రికి ఉన్న అనుబంధం ఎంత గాఢమైందో ఆయన్ని కదిలిస్తే బయటపడుతుంది. క్రూరమృగం వేటాడిన తర్వాత అడవిలో ఎంత అలజడితో కూడిన నిశ్శబ్దం ఉంటుందో ఆచారి హత్య తరువాత అలాంటి వాతావరణమే కనిపించిందంటారు విజయసింహారెడ్డి. సీపీఎం గూండాలు ఇంకా ఎలాంటి కుట్రలకు తెగబడి ఉన్నారో తెలియదు కాబట్టి, ఎలాంటి ప్రతిఘటనకైనా సిద్ధంగా ఉండాలని తండ్రి కృష్ణారెడ్డి తనను అప్రమత్తం చేశారని ఇప్పటికీ చెప్పుకోవడం కనిపిస్తుంది.

ఆచారి హత్య జరిగిన వార్త తెలిసిన వెంటనే కృష్ణారెడ్డి తుపాకీ లోడ్ చేసుకున్నారట. కొడుకు విజయసింహారెడ్డిని కూడా

అనుమానాస్పదంగా ఎవరు తమ ముందుకొచ్చినా కాల్చి పారేయాలని ఆదేశించారట. లోడెడ్ తుపాకులతోనే తండ్రి కొడుకులు సుబ్బారెడ్డి గూడెం నుంచి మిర్యాలగూడెం చేరుకున్నారు. అలాంటి ఉద్రిక్త పరిస్థితుల్లో కూడా కృష్ణారెడ్డి తన కొడుకును వెంటపెట్టుకొని ఆచారి కుటుంబాన్ని పరామర్శించేందుకు, కాంగ్రెస్ శిబిరానికి మరే ఇతర నష్టమూ జరగకుండా నివారించేందుకు మిర్యాలగూడ రావడం నిజంగా సాహసమే. ఈ ఘటన ద్వారా మిర్యాలగూడ ప్రాంతంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల మధ్య ఎలాంటి వైరం ఉండేదో అర్థం చేసుకోవాల్సిందే.

ఈ పుస్తక రచనలో భాగంగా ఆనాటి కీలకమైన వ్యక్తుల అభిప్రాయము తెలుసుకునే తెలుసుకునేందుకు ప్రయత్నించినప్పుడు పలు ఆసక్తికరమైన మరిన్ని కోణాలు బయటపడ్డాయి. 1974లో ఆనాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు మిర్యాలగూడెం వచ్చినప్పుడు కృష్ణారెడ్డి ఆహ్వానం మేరకు ఆయన సుబ్బారెడ్డి గూడెం వెళ్లడం జరిగిందట. మిర్యాలగూడ నుంచి కృష్ణారెడ్డి సొంతూరు అయిన సుబ్బారెడ్డి గూడెం దాదాపు 8 కిలోమీటర్లు ఉంటుంది. ఒక సీఎం అంత పల్లెటూరికి వెళ్లడం ఆ రోజుల్లో గొప్ప విషయంగా చెప్పుకునేవారు. జితేందర్ కలిసిన మీదట విజయసింహారెడ్డి అదే విషయాన్ని, ఇంకా అనేకమైన అంశాలను గుర్తు చేసుకోవడం విశేషం. ఆచారితో తన తండ్రికి ఉన్న అవ్యాజ్యమైన ప్రేమను, గురు శిష్య బంధాన్ని మరోసారి నెమరు వేసుకోవడం విశేషం.

# 15. ఆచారి అడుగు జాడలు

ఒక సమర్థుడైన వాడు సామ్రాజ్యానికి పునాదులు వేస్తే మరో సమర్థుడైన వ్యక్తి ఆ సామ్రాజ్యాన్ని నిర్మించి విస్తరిస్తాడు. అలా కాకుండా పునాదుల దశలోనే అసమర్థుడి చేతిలోకి బాధ్యతలు గనక వెళితే అది పురిటిలోనే సమాధి అవుతుంది. రాజకీయాలు నడిపేవారికైనా రాజభోగాలు అనుభవించే వారికైనా ఇదే సూత్రం వర్తిస్తుంది. అదృష్టవశాత్తో లేక సామర్థ్యవశాత్తో ఎలా అనుకున్నా సరే, ఆచారి మొదలు పెట్టి అద్భుతంగా పట్టాలకు ఎక్కించిన రాజకీయ వారసత్వ పంథాను అన్నభీమోజు కుటుంబంలో దురదృష్టవశాత్తూ ఎవరూ కొనసాగించ లేకపోయారు. మదనాచారి తరువాత ఆయన రాజకీయ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడానికి తమ్ముడి కుమారుడు నాగార్జునాచారి ప్రయత్నిస్తున్నా ఆచారి వేసిన పునాదులు నిష్ప్రయోజనంగా మారాయి. అచ్చమైన తెలంగాణవాదిగా, నికార్సయిన జాతీయవాదిగా భిన్న పార్శ్వాల వ్యక్తిత్వాన్ని ఆచారి కనబరిచాడు. రాజకీయ పంథాలో రాణించాలంటే ఒక కుటుంబానికి అంతకు మించిన ఆస్తిపాస్తులు అక్కరలేదు. ఆచారి చూపిన తెగువలో పదోవంతు చూపినా అన్నభీమోజు కుటుంబం రాజకీయాల్లో సుస్థిర స్థానం

సంపాదించుకొని ఉండేదంటారు మిర్యాలగూడ ప్రజలు. మిర్యాలగూడ రాజకీయాల్లో అన్నభీమోజు సైదయ్య, ఆచారి అనే సోదర ద్వయానికి ఇచ్చిన ప్రాధాన్యత ఆ తరువాత ఎందుకు తెరమరుగైందో ఆ కుటుంబీకులే ఆత్మ విమర్శ చేసుకోవాలి. నిజానికి ఆచారి చూపిన తెగువ కేవలం అన్నభీమోజు కుటుంబానికి మాత్రమే వారసత్వం కాదు. బీసీ సామాజిక వర్గం మొత్తం కూడా ఆచారి లాంటి ఒక సమున్నతమైన కీర్తి శిఖరాన్ని తమకు గర్వకారణంగా భావించాల్సి ఉంది. ఒక శ్రీకాంతాచారి గానీ, ఒక ప్రొఫెసర్ జయశంకర్ సార్ గానీ తెలంగాణ కోసం చేసిన త్యాగాలను విశ్వబ్రాహ్మణ సమాజమే సరిగ్గా ఉపయోగించుకోలేకపోయింది. జయశంకర్‌ను ప్రజలంతా ఎంతో ప్రేమతో తెలంగాణ జాతిపితగా పిలుచుకున్నా స్వరాష్ట్రం సిద్ధించాక ఆ “టైటిల్”ని కూడా హైజాక్ చేసే కుట్రలు జరిగాయి. అంతటి జయశంకర్ త్యాగాన్నే ముందుకు తీసుకెళ్లలేకపోయిన విశ్వబ్రాహ్మణ నాయకులు, మేధావులు ఆచారి లాంటి మెరుపుతీగ విరజిమ్మిన వెలుగులను ఒడిసి పడతారని, రాజకీయ కాగడాగా మలుచుకుంటారని భావించడం అత్యాశే అవుతుంది. బహుశా అందుకేనేమో మదనాచారి రెండో భార్య పిల్లలు హితేందర్, జితేందర్ తమ వంతు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆచారి నిస్వార్థపూరిత సేవలను, బడుగు బలహీన వర్గాల ప్రజల పట్ల ఆయన చూపిన అవ్యాజ్యమైన అనురాగాన్ని పది కాలాలపాటు స్మరించుకునే పనికి పూనుకున్నారు.

తోడబుట్టిన సోదరులు నిర్లక్ష్యం చేసినా, ఆచారి పేరును ఎందరో రాజకీయ పార్టీల నేతలు అణగదొక్కినా, తన తండ్రి పేరు ప్రతిష్టను ప్రజల గుండెల్లో శాశ్వతంగా ఉండిపోయేలా చేయాలని జితేందర్ బలంగా సంకల్పించుకున్నాడు. తండ్రి నడకలో, నడతలో ఉండే ప్రజామోదాన్ని పసిగట్టిన జితేందర్ ఆచారి పేరిట పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. "ఆచారి ఫౌండేషన్"' స్థాపించి ఆయన వల్ల మిర్యాలగూడకు జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు మరచిపోకుండా చేస్తున్నాడు. పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తూ ఆచారి పంచిన ఆత్మీయతను ఇప్పటికీ ప్రవహింపజేస్తున్నాడు. ఎమర్జెన్సీ వైద్యం అవసరమున్న సమయాల్లో నిరుపేద ప్రజలకు 'ఆచారి ఫౌండేషన్' ద్వారా వైద్య సేవలు కూడా అందజేస్తున్నాడు.

# 16. ఆచారిగారి గది

ఆచారి హత్య జరిగాక అన్నభీమోజు కుటుంబం మీద సానుభూతి మాత్రమే కాదు. మిర్యాలగూడలో భయమూ, భక్తీ పెరిగాయి. కొన్నేళ్ల క్రితం వరకు కూడా ఆ వాతావరణం కనిపించేది.

ఆచారి గదివైపు ఎవరూ వెళ్లేవారు కాదు. గది ముందు నుంచి కూడా వెళ్లాలంటే జంకేవారు. ముఖ్యంగా గది తలుపులు తెరచి ఉన్నప్పుడు ఆ వైపు ఎవరూ వెళ్లేవారు కాదు.

ఆచారి ఉపయోగించిన గదిలో రెండు తుపాకులు ఒకదాని ముఖం ఒకటి చూస్తున్నట్టుగా ఎదురెదురుగా గోడకు వేలాడుతూ కనిపించేవి. ఆత్మరక్షణ కోసం వాడే తుపాకీ ఒకటి, జంతువులను వేటాడడానికి ఉపయోగించే తుపాకీ మరొకటి. అక్కడే టేబుల్ మీద రివాల్వర్ కూడా ఉండేది. ఆచారి పేరు చెబితే వణికించే ట్రేడ్‌మార్క్ ఆయన ధరించే తుపాకీనే. ఆయన భౌతిక రూపం భయపెడితే ఆయన స్వభావం మాత్రం అభిమానుల్ని సంపాదించుకుంది.

అందుకే ఆచారి పోయినా కూడా ఆ గదిలో ఆయన

ఆనవాళ్లను అలాగే భద్రం చేశారు. తుపాకులను అలాగే ఆచారి జ్ఞాపకంగా ఉంచారు. ఆయన కూర్చునే కుర్చీ ఎప్పుడూ ఆయన కోసం వేసినట్టుగా కనిపించేది. ఆచారి ఎప్పుడో వచ్చి కూర్చుంటాడు. సేదదీరి పోతాడు. అనే భావన ఆ ఇంటిల్లిపాదిలోనూ వ్యక్తమయ్యేది. ఆయన పోయాక ఆచారి భారీ ఫొటోను ఒకదాన్ని ఆ కుర్చీ వెనకాలే పెట్టారు. కుర్చీ పక్కన దీపం పెట్టేవారు. ఆ దీపం అఖండంగా వెలుగుతూ ఉండేది. ప్రతిరోజూ తెల్లవారు జామునే మహిళలు మేల్కొని ముందుగా ఆచారి గదిని శుభ్రం చేసేవారు. స్నానం ముగించుకొని దీపం వెలిగించి తలుపు దగ్గరగా వేసి వచ్చేవారు. చాలా మంది పెద్దవారు సైతం ఆ గది తలుపులు తెరచి చూడడానికైనా సంకోచించేవారు. ఇంక పిల్లలు ఆ వైపు వెళ్లడం జరిగేది కాదు. ఆ గదిలో గంభీరమైన వాతావరణం అలా ఉండేది. గుబురు మీసాలతో ఆచారి నిలువెత్తు ఫొటో, ఆ ఫొటో ముందు తుపాకులు, ఆ కిందనే కాస్త పక్కగా వెలుగుతున్న దీపం అనేక అవ్యక్త భావాల నడుమ ఆచారి జ్ఞాపకాల దొంతరలను వీక్షకుల మనో గగనాన రెపరెపలాడించేవి.

**గంభీరమైన మౌనముద్ర నుంచి వచ్చే సూక్ష్మ తరంగాలు ఎంత విస్పష్టంగా చెవులకు సోకుతాయో వాటి అలికిడి ఆ గది నిండా వ్యాపించి ఉండేది. అందుకే ఆ వైపు ఎవరూ వెళ్లేవారు కాదు.** ఒకవేళ ఆసక్తితో వెళ్లినా తలుపు సందుల్లోంచి “లోపలి దృశ్యాన్ని” చూసి వెంటనే వచ్చేవారు.

అదీ ఆచారి సంపాదించుకున్న గౌరవ పూర్వకమైన ఆస్తి. అయితే తొలుత అన్నభీమోజు కుటుంబం యావత్తూ ఆచారి మీద చూపిన భక్తి ప్రపత్తులు, క్రమంగా ఆస్తుల మీదికి మళ్లడంతో ఆచారి ఆనవాళ్లన్నీ కాలరేఖల్లో కలిసి అదృశ్యమై పోయాయి. ఇప్పుడాయన ఒక శాశ్వత జ్ఞాపకంగా మిగిలిపోయాడు.

# ఆచారి జీవితంలో కొన్ని మైలురాళ్లు మరికొన్ని జ్ఞాపకాలు

తెలంగాణ వాదం కోసం సఫారీ రెస్టారెంట్ స్థలంలో ఏర్పాటు చేసిన తొలి బహిరంగ సభ సీడీ నాయుడు, జనార్ధనాచారి ఆధ్వర్యంలో సక్సెస్ అయింది. వేలాదిమంది ప్రజలు హాజరయ్యారు. దానికి ముఖ్య అతిథులుగా అప్పటి నాగర్‌కర్నూల్ ఎంపీ డా. మదన్ మోహన్, కె. కేశవరావు, మల్లికార్జున్ (ఆ తరువాత ఎంపీగా గెలిచాడు), టి.ఎన్. సదాలక్ష్మి, మహరాజ్‌గంజ్ ఎమ్మెల్యే బద్రివిశాల్ వంటి ప్రముఖ కాంగ్రెస్ నేతలు హాజరయ్యారు.

ఆ సభ విజయవంతం అయ్యాకనే 1969 ఆగష్టు 15న ఎమ్మెల్యే తిప్పన కృష్ణారెడ్డి చేత “జై తెలంగాణ” అనిపించి ఉద్యమ బాధ్యతలు ఆయనకు అప్పగించడం జరిగింది.

ఇప్పుడున్న కొత్త బస్టాండ్ ఆచారి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఉన్నప్పుడే ప్రారంభోత్సవం జరిగింది.

అప్పటి కార్మిక శాఖ మంత్రి టి. అంజయ్యను (మాజీ సీఎం కూడా), పాల్వాయి గోవర్దన్ రెడ్డి గారిని, ఆచారి

మిర్యాలగూడకు పిలిపించి థియేటర్‌లోనే సమావేశం ఏర్పాటు చేయించాడు.

రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో ఆచారి సూచనలతో చాలామంది వ్యాపారాలు చేసి మిర్యాలగూడలో కోట్లకు పడగలెత్తారు.

రాజకీయాల్లో  అగ్రకులాల ఆధిపత్యం మాత్రమే కొనసాగుతున్న కాలంలో బీసీ వర్గం నుంచి తనకు ప్రత్యమ్నాయం లేదు అనే స్థాయిలో ఎదిగిన అరుదైన వ్యక్తి ఆచారి.

ఆచారి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవీకాలం సమీపిస్తుండడంతో తదుపరి పదవికోసం ప్రయత్నాలు ప్రారంభించాడు. మార్కెట్ కమిటీని కృష్ణారెడ్డి అన్న కుమారుడికి అప్పగించి, ఆచారిని ప్రభుత్వ ఆధ్వర్యంలోని కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించాలని కృష్ణారెడ్డి పట్టుపట్టాడు. పూర్తికాలం రాజకీయాల్లో ఉండేలాగా ఆచారిని హైదరాబాద్‌లో స్థిరపడాలని పెద్దలు అంతా సూచించారు. వారి సూచనలతో, భవిష్యత్ రాజకీయాలవైపు పక్కాగా అడుగులు వేస్తున్న ఆచారి హైదరాబాద్‌లో  ల్యాండ్ కొనుగోలు చేశాడు. ఇది ఆచారి అత్యంత సన్నిహితులకు మాత్రమే తెలుసు. ఆర్థికంగా లోటు రాకుండా ఉండేలా ఆచారి పేరుమీదనే కాంట్రాక్టు ఇప్పించేందుకు కాంగ్రెస్ సీనియర్లు ప్రోత్సహించారు. ఆస్తుల పంపకాలు జరిగితే ఆచారి పేరు మీదికి ఆస్తులు బదిలీ అయి వాటి సెక్యూరిటీతో సొంతంగానే పనులు చేసుకోవాలని,

అటు రాజకీయంగా కార్పొరేషన్ పదవికి ప్రయత్నాలు తీవ్రంగా జరిగాయి. అప్పటివరకు ఆస్తులన్నీ సైదయ్య పేరిటనే ఉండటంతో కాంట్రాక్టులు కూడా సైదయ్య పేరిటనే జరిగిందని గమనించాలి. అయితే ఆచారి మరణానికి కొద్ది రోజుల ముందు మాత్రమే ఈ నిర్ణయాలు జరగడంతో ఆ కార్యక్రమాలేవీ సాకారం దాల్చలేదు.

# ఆచారి ఏం సాధించాడు?
# ఏం వదిలేశాడు?

మనిషి జీవితం ఎంత చిన్నదీ అంటే.. ఇంత చిన్నదా అని గుర్తించే లోపే కాలం ముగిసిపోతుంది. అందుకే జీవితాన్ని నీటి బుడగతో పోల్చారు. ఆ నీటి బుడగ ఆయువులోనే చేయాల్సిన పనులు చేసేయాలి. చూడాల్సిన సంగతులు చూసేయాలి. ఆచారి గురించి తెలుసుకుంటున్నకొద్దీ ఇంకా తెలుసుకుంటే బాగుండుననిపిస్తుంది. రచయితగా నాకు కలిగిన ఆసక్తే పాఠకులకు కూడా తప్పక కలుగుతుంది అనడంలో అతిశయోక్తి ఉండదు. ఆయన గురించి మరింతగా తెలుసుకోవాలనే కాంక్ష చల్లారకముందే ఆయన అకస్మాత్తుగా అదృశ్యమైపోవడం వేదనా భరితం.

ఆయన రాజకీయాల్లో పని చేసింది పదేళ్లే. కానీ పది తరాల పాటు గుర్తుండిపోయేలా డైనమిజం చూపించారు. ఆనాటి అధికార కాంగ్రెస్ పార్టీలో మంత్రులతో పోటీపడి ప్రజా క్షేత్రంలో పనులు చేశాడు. తన వద్దకు వచ్చిన ఏ సమస్య ఐనా పరిష్కారంతో వెళ్లాల్సిందే తప్పా పెండింగ్ ఇష్యూగా ఏదీ రికార్డు కాలేదు. ఆయన

ఇంకా బతికి ఉండి కనీసం ఒక్కసారైనా ఎమ్మెల్యే అయి ఉంటే గనక యావన్మంది రాజకీయనాయకులకు ఒక నమూనాగా ఉండేవాడనే చెప్పాలి. తాను తీసుకొచ్చి పని కల్పించిన పంజాబీ సిక్కులకు చాలా విలువైన స్థలాన్ని వదిలేయడంలోనే ఆచారి ఎంత విజనరీ అనేది అర్థం చేసుకోవచ్చు. ఒక్కసారి అధికారంలోకి వస్తేనే ప్రభుత్వ భూములు ప్రైవేటు వ్యక్తులకు రిజిష్టరు అయిపోతున్న ప్రస్తుత తరుణంలో ఒక కాంగ్రెస్ నాయకుడిగా, బడుగు, బలహీన, దళిత వర్గాల ప్రతినిధిగా తన సొంత ఆస్తిని వదిలేసుకోవడం మామూలు విషయమా? ప్రాణహాని ఉందని తన శరణు జొచ్చిన వ్యక్తికి రక్షణగా నిలవడం మామూలు విషయమా? తన ప్రాణం కోసం తాను చూసుకోకుండా శరణార్థి కోసం ఆత్మబలిదానం చేయడం కన్నా స్ఫూర్తినిచ్చే ఘట్టాలు ఎంత మంది జీవితాల్లో కనిపిస్తాయి? నేను బతికితే చాలు, నా భార్యాపిల్లలు చల్లగా ఉంటే చాలు అనుకునే నేటి కాలంలో ఆచారిలాంటి ఒక మోడల్ పబ్లిక్ ఫిగర్‌ని కనీసం ఊహించగలమా?

కులపైత్యం, అధికార పైత్యం, జాతిపైత్యం ఒంటి నిండా కమ్ముకున్నవారు జాతిపితలుగా కీర్తి పొందాలని ఆరాటపడుతుంటే సర్వమూ ఒదులుకుని, భార్యాపిల్లల ప్రేమానురాగాలు కూడా కోల్పోయి అన్ని వర్గాల ప్రజా నాయకుడిగా వెలుగొందిన ఆచారిని స్మరించుకోవడానికి ఇప్పటికీ శషభిషలు లెక్కించే నాయకులు, మేధావులే ఆయన చరిత్రకు తీరని అన్యాయం చేస్తున్నారని చెప్పాల్సి ఉంటుంది.

మొహంలో నవ్వులు పులుముకొని, లోపల విషపు కోరలతో బుసలుకొట్టే "ఫక్తు రాజకీయ నాయకులు" ఆచారి లాంటి ఎంతమంది అసలైన ప్రజానాయకులను కాలగర్భంలో కలిపేశారో బయటకు రావాల్సిన అవసరం ఉంది. ఈ క్రమంలో తన ప్రత్యేకమైన ప్రజాపంథాతో ప్రజాక్షేత్రాన్ని మెరిపించిన ఆచారి గాథ ఇన్నాళ్లకు బయటకు రావడం అంటే ప్రజా నాయకులకు మరణం ఎప్పటికీ ఉండదనే అర్థం.

ఆచారి పంథా: "జీనా హై తో మర్‌నా సీఖో" కాదు.. "మర్‌నే సే పహలే జీనా కైసే".

**ఆచారి అమర్ రహే!**

**ఆచారి సదా రహే!**


Namasté







# కీ॥శే॥ అన్నభీమోజు లోహితా చారి గారు

**జననం : 21-09-1978   మరణం : 04-01-2022**


## ACHARI FOUNDATION

**ఆచారి ఫౌండేషన్** భారతదేశంలోని నిరుపేద వ్యక్తులు, సంఘాల మరియు వివిధ సమూహాల విద్యా, సామాజిక అభివృద్ధి మరియు ఆర్థిక సాధికారత కోసం పనిచేస్తుంది. ఫౌండేషన్ అంతిమంగా సమగ్ర సమాజానికి దారితీసే సానుకూల సామాజిక మార్పును సృష్టించడం మరియు కొనసాగించడం లక్ష్యంగా పెట్టుకుంది.

ACHARI FOUNDATION — A VOICE TO EMPOWER

http://facebook.com/annabhimoju.achari   www.achari.org